సంపుటము–2
సమావేశము–XXX
నంబరు. 4

వెల : రూ. 10–00
20 మార్చి, 2018
మంగళవారము
విళంబి నామ సం.
చైత్ర శు. 3

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు
# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL DEBATES

## అధికార నివేదిక
## OFFICIAL REPORT

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | విషయం | పేజీ నం. |
|---|---|---|
| (1) | సభా కార్యక్రమము – వాయిదా తీర్మానం | 01–01 |
| (2) | ప్రశ్నోత్తరాలు | 01–35 |
| (3) | సభా సమక్షంలో ఉంచబడిన పత్రం<br>పురపాలక. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పి. నారాయణ, 2015–16 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, 1వ వార్షిక నివేదిక ప్రతిని, 2013 కంపెనీల చట్టంలోని 394 సెక్షన్ క్రింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ | 35–35 |
| (4) | సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావనలు | 35–36 |
| (5) | “సంక్షేమం” పైలఘు చర్చ | 33–55 |
| (6) | 2018–19 సంవత్సరానికి వార్షిక ఆదాయ–వ్యయ పట్టిక (బడ్జెట్)పై సాధారణ చర్చకు ఆర్థిక మంత్రి ప్రత్యుత్తరం | 55–71 |

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | శ్రీ ఎన్. ఎం.డి. ఫరూక్ |
| డెప్యూటీ చైర్మన్ | : | శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం |
| ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీమతి పామిడి శమంతకమణి<br>శ్రీ వాకాటి నారాయణ రెడ్డి<br>శ్రీ బొడ్డు నాగేశ్వర రావు |
| కార్యదర్శి (ఇన్‌ఛార్జ్) | : | శ్రీ ఎమ్. విజయరాజు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ కె. సత్యనారాయణరావు<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి. వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజకుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకరరావు<br>శ్రీమతి కె. భారతి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL

Tuesday, the 20th March, 2018.

—

(The House assembled at 10.00 am with the Hon'ble Chairman in the Chair)

## 1.సభా కార్యక్రమం – వాయిదా తీర్మానం

**మిస్టర్ చైర్మన్:** 'పశువైద్య కేంద్రాల ఉన్నతీకరణ గురించి' శ్రీ కత్తి నరసింహారెడ్డిగారు ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరించడమైనది.

**శ్రీ కత్తి నర్సింహారెడ్డి (ఉపాధ్యాయ నియోజక వర్గం – కర్నూలు, అనంతపురం, కడప):** అధ్యక్షా, 250 రూరల్ లైవ్ స్టాక్ యూనిట్స్‌ని వెటర్నరీ హాస్పిటల్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పారు. (మైకు లేదు)

**మిస్టర్ చైర్మన్:** మొన్ననే మీరు ఇదే అంశం మీద మాట్లాడారు. ప్లీజ్..

**శ్రీ కత్తి నర్సింహారెడ్డి:** 19 రోజులుగా 3 కాలేజీల నుండి 1200 మంది విద్యార్థులు నిరవధికంగా సమ్మె చేస్తున్నారు. దయచేసి ఆ విద్యార్థి సంఘాలతో మాట్లాడి, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ 250 హాస్పిటల్స్‌ని అప్‌గ్రేడ్ చేయవలసిందిగా కోరుతున్నాను...(మైకు లేదు)

**మిస్టర్ చైర్మన్:** సంబంధిత మంత్రిగారు లేరు. నేను ఇన్ఫర్మేషన్ ఇస్తానండి.

**శ్రీ కత్తి నర్సింహారెడ్డి:** అధ్యక్షా, మంత్రిగారికి పంపించండి. న్యాయమైన డిమాండ్ అది. గత 19 రోజులుగా విద్యార్థులు సమ్మె చేస్తున్నారు.(మైకు లేదు)

**MR.CHAIRMAN:** Question No.9978 (81), Hon'ble Minister for Roads and Buildings.

## 2.ప్రశ్నోత్తరాలు

### అనంతపురం – అమరావతి ఎక్స్‌ప్రెస్ వే

ప్రశ్న నెం. 9978(81)

**శ్రీమతి పోతుల సునీత, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** అమరావతి–అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం భూసేకరణ ప్రక్రియ ప్రస్తుతం ఏ దశలో ఉంది;

**ఆ)** కేంద్రం ఇందుకోసం సమారు రూ.27,635 కోట్లను ప్రకటించినప్పటికీ సదరు జాతీయ రహదారి ప్రారంభం కాకపోవడానికి కారణం ఏమిటి?

**ఇ)** అయితే, రోడ్డు నిర్మాణం కోసం తీసుకున్న చర్యలు ఏమిటి?

**గౌరవనీయులైన రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి (శ్రీ సిహెచ్. అయ్యన్నపాత్రుడు):**

**అ)** అన్ని 5 జిల్లాలలో (అనంతపురము, కర్నూలు, కడప, ప్రకాశం, గుంటూరు) భూసేకరణ కోసం భూసేకరణ సమర్థ అధికారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. కేంద్ర ప్రభుత్వ గెజెట్‌లో ప్రచురించడం కోసం 08-02-2018 తేదీన ముసాయిదా 3(ఎ) ప్రకటనను ఎం.ఓ.ఆర్.టి.హెచ్ కు సమర్పించడమయింది.

**ఆ)** భూమిని సేకరించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డి.పి.ఆర్)ను సమర్పించిన పిదప కేంద్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును చేపడుతుందని ఎం.ఓ.ఆర్.టి.హెచ్ / జి.ఓ.ఐ తెలియజేసింది.

**ఇ)** భూసేకరణ మరియు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డి.పి.ఆర్) రూపకల్పన పురోగతిలో ఉంది.

**శ్రీమతి పోతుల సునీత (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, నమస్కారం. గౌరవ మంత్రివర్యులు అమరావతి–అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం భూసేకరణ జరిగిందని చెప్పారు. అలాగే ఈ జాతీయ రహదారికి దాదాపు రూ.27,635 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇస్తామని చెప్పి ప్రకటించింది. ఎందుకంటే, ఇది చాలా ప్రాధాన్యత కలిగిన రహదారి. అమరావతి నుండి అనంతపురం వరకు ఎక్స్‌ప్రెస్ హైవేని జాతీయ రహదారిగా గుర్తించి, దీని కోసం రూ.30,000 కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినా, ఎన్నోసార్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారు విజయవాడ వచ్చినప్పుడు కూడా ఈ హైవే నిర్మాణాన్ని చేపడతామని ప్రకటించి సంవత్సరం రోజులు గడుస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం స్పందన లేకుండా వ్యవహరిస్తోంది. ఎందుకంటే, మనకు రావాల్సిన ప్రత్యేక హోదా విషయంలో గానీ, స్పెషల్ ప్యాకేజీ విషయంలో గాని ఏవిధంగా మభ్యపెడుతూ వచ్చారో, ఈ జాతీయ రహదారి విషయంలోనూ అదేవిధంగా మభ్యపెడుతూ కేంద్ర ప్రభుత్వం చాలా నిర్లక్ష్యానికి గురి చేస్తోంది.

అధ్యక్షా, మన గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పినట్లు రాయలసీమకు సంబంధించి అతిపెద్ద రోడ్డుగా దాన్ని ఇంప్రూవ్ చేయాలని చెప్పి, రూ.27,000 కోట్లతో, 393 కి.మీ. మేర మలుపులు లేకుండా నిర్మించతలపెట్టిన అతి పొడవైన జాతీయ రహదారి ఇది. 120 కి.మీ. వేగంతో ఈ రహదారిపై రాకపోకలు సాగాలని గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రతిష్టాత్మకంగా నిర్మించాలని నిర్దేశించడం జరిగింది. అయినప్పటికీ, దీని నిర్మాణంలో చాలా జాప్యం జరుగుతోంది. అయినా అమరావతి రాజధానిని, రాయలసీమ ప్రాంతానికి అనుసంధానం చేయాలని గౌరవ ముఖ్యమంత్రి గారు దీన్ని ముందుకు తీసుకుపోతున్నారు. కాబట్టి, కేంద్ర ప్రభుత్వం కూడా ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలి. దీని కోసం మనం పోరాడైనా సరే, స్పెషల్ ప్యాకేజీలో ఏవైతే ఉన్నాయో అవన్నీ రాబట్టడానికి గౌరవ మంత్రివర్యులు కూడా దీనిపట్ల శ్రద్ధ తీసుకుని, ఈ రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని ఈ సభ ద్వారా మంత్రి గారిని కోరుతూ శెలవు తీసుకుంటున్నాను.

**శ్రీమతి పి.శమంతకమణి (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, అనంతపురం నుండి అమరావతి ఎక్స్‌ప్రెస్ వే రోడ్డుకు సంబంధించి భూసేకరణ కూడా జరిగింది. చాలా వరకు సర్వే చేయడం జరిగింది. సర్వే ప్రకారంగా భూసేకరణ కూడా జరిగింది. అయితే, ఆ భూసేకరణ క్రింద తీసుకున్న భూములకు నష్టపరిహారం ఏవిధంగా ఇస్తారనేది తెలియడం లేదు. మరి ఎప్పటిలోపల ఆ భూసేకరణ ప్రక్రియ పూర్తిచేసి, దానికి కావాల్సిన నిధులు ఇవ్వడం గానీ, నష్టపరిహారం ఇవ్వడం గానీ ఎప్పుడు పూర్తి చేస్తారు? ఎందుకంటే, అనంతపురం నుండి మేము అమరావతికి రావడం చాలా కష్టతరం. మాకు ఒక్కటే ఒక్క ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఉంది. ఆ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ తప్ప వేరే ట్రైయిన్స్ లేవు. ఇంక రోడ్లు చూస్తే ఎలా ఉన్నాయంటే, రోడ్డు మార్గం ద్వారా రాజధానికి రావాలంటే దాదాపు 8 గంటలో, 9 గంటలో వయా ఒంగోలు, గుంటూరు నుండి రావాలి. ఇక్కడకు వచ్చేలోపల మాలాంటి సీనియర్ సిటిజన్స్‌కు నడుములు సడుగులై పోతున్నాయి. కాబట్టి, ప్రభుత్వం ద్వారా మేము కోరేదేమంటే దయచేసి అనంతపురం నుండి అమరావతికి ఎక్స్‌ప్రెస్ రోడ్లు ఏర్పాటు చేసి, మాలాంటి వారికి సుఖతర ప్రయాణాన్ని ఏర్పాటు చేయవలసిందిగా మీ ద్వారా మంత్రి గార్ని కోరుతున్నాను.

**శ్రీ కె.ఇ.ప్రభాకర్ (స్థానికసంస్థలు – కర్నూలు):** అధ్యక్షా, ఈ అనంతపుం-అమరావతి ఎక్స్‌ప్రెస్ వేకు కర్నూలు రోడ్డు కూడా లింక్ చేయడం జరిగింది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే అమరావతికి 3 గంటల్లో రావచ్చని గతంలో చెప్పుకోవడం జరిగింది. కానీ, 3 రోజులు అవుతోంది. అంటే ఇక్కడకి రావడానికి ఒక రోజు, పోవడానికి ఒక రోజు, మధ్యలో ఒళ్లు నొప్పులకు ఒక రోజు అధ్యక్షా. అటవీ, పర్యావరణ అనుమతులు కూడా ఇప్పటికే రావడం జరిగింది. డబుల్ లైన్ రోడ్డును కూడా మంత్రి గారు ప్రకటించడం జరిగింది. అది త్వరలో పూర్తి చేస్తే, తక్కువ సమయంలో త్వరగా అమరావతికి రావడానికి అవకాశం ఏర్పడుతుందని మీ ద్వారా మంత్రి గారికి మనవి చేస్తున్నాను.

**శ్రీ కత్తి నర్సింహారెడ్డి:** అధ్యక్షా, అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ వే అనేది రాజధానికి అనుసంధానమైన రోడ్డు మార్గం. హైదరాబాదు రాజధానిగా ఉండేటప్పుడు హైవే ఉండేది. ఇప్పుడైతే అమరావతికి రావాలంటే 12 గంటల నుండి 15 గంటల సమయం పడుతోంది. ఈ రోడ్డును 6 లేన్లు చేయడం కోసం ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో, పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ రోడ్డును నిర్మించాలి. దీనివల్ల కేంద్రంపైన అదనపు భారమేమీ పడదు. కానీ, పర్మిషన్ ఇవ్వడం లేదు. తమిళనాడులో పలు జాతీయ రహదారులను కేంద్ర ప్రభుత్వమే 100 శాతం గ్రాంట్‌తో నిర్మించింది. ఇక్కడ మాత్రం పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపడతామని నాలుగేళ్లు గడిచినా ఇంకా మోక్షం కలగలేదు. కాబట్టి, సత్వరమే ఈ రోడ్డును పూర్తి చేసి, రాయలసీమ ప్రాంతవాసులకు కూడా రాజధానితో కనెక్టివిటీ ఉండేలా చూడాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ రాము సూర్యారావు (ఉపాధ్యాయ నియోజకవర్గం – తూర్పు, పశ్చిమ గోదావరి):** అధ్యక్షా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సూర్యాపేట నుండి కాకినాడ వరకు నేషనల్ హైవేకు సంబంధించిన ప్రపోజల్స్ వచ్చాయి, అవి శాంక్షన్ అయ్యాయని అన్నారు. కానీ, ప్రస్తుతం అశ్వారావుపేట వరకు మాత్రమే రోడ్డు బాగుంటుంది. తరువాత మన ఆంధ్రప్రదేశ్‌లోకి ఎంటరైన తరువాత, రోడ్లు సరిగ్గా లేవు. గతుకులుగా ఉంది. కాబట్టి, దయచేసి దాని మీద దృష్టి పెట్టవలసిందిగా మీ ద్వారా మంత్రి గారికి తెలియజేస్తున్నాను.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్ (పట్టభద్రుల నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం):** అధ్యక్షా, అమరావతి–అనంతపుం ఎక్స్‌ప్రెస్ వే 557 కి.మీ. మేర 6 లేన్ల రోడ్డు. రాయలసీమకు అతి ముఖ్యమైన రహదారిగా మారబోతోంది. ముందు డిపిఆర్ తయారైన తరువాత, కర్నూలుకు కూడా కనెక్టివిటీ ఇవ్వాలని కోరితే కనెక్టివిటీ ఇవ్వడం జరిగింది. తరువాత కడపకు కూడా కనెక్టివిటీ ఇవ్వడం జరిగింది. తద్వారా మొత్తం రాయలసీమకు మన ఆంధ్రప్రాంతానికి రావడానికి అతిముఖ్యమైన మార్గంగా ఇది రావడం జరిగింది. దీనికి స్థల సేకరణ మొత్తం కేంద్ర ప్రభుత్వమే చేస్తుంది. దీనికి సంబంధించి పిపిపి మోడ్‌లోనే జరుగుతుంది. దేశంలో ఉండే అనేక రకాల పద్ధతులలో పిపిపి మోడ్ అనేది చాలా ముఖ్యమైనది. ఆ తరహాలోనే ఇది చేస్తున్నారు. అలాగే, గ్రీన్ ఫీల్డ్ రోడ్ వే. ఆ విధంగా మొత్తం పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఆలోచనతో వెళుతోంది. దీంట్లో అతి ముఖ్యమైన భాగం ఫారెస్టుకు సంబంధించిన ల్యాండ్ అక్విజిషన్ వల్ల లేట్ అయ్యింది. ఇది కూడా శరవేగంగా కొనసాగుతోంది. ఆల్‌రెడీ మన కలెక్టర్స్ అందరూ ఆ పనిలో ఉన్నారు. ఆ విధంగా సుమారు రూ.30,000 కోట్ల పెట్టుబడితో ఈ కార్యక్రమం జరుగుతుంది.

ఉ.10.10

**శ్రీ సిహెచ్. అయ్యన్నపాత్రుడు:** అధ్యక్షా, ఎక్స్‌ప్రెస్ వే అనేది నవ్యాంధ్ర రాజధాని అమరావతి నుండి రాయలసీమలోని అనంతపురం నగరాన్ని కలుపుతూ వేసేందుకు ప్రతిపాదించడం జరిగింది. ఇది అతి సుందరమైన విశాలమైన రహదారి. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి డ్రీమ్ ప్రాజెక్టు ఇది. వారు ఎన్నో పర్యాయాలు దీనిపై సమావేశాలు జరిపి 5,6 సార్లు కేంద్రంతో మాట్లాడడం కూడా జరిగింది. ముఖ్యమంత్రిగారు కోరిన మీదట భారత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టుటకు సూత్రప్రాయంగా అంగీకరించింది. గుంటూరు, ప్రకాశం, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలలో ఈ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం జరుగుతుంది. మొత్తం ఈ ఎక్స్‌ప్రెస్ హైవే పొడవు కర్నూలు, కడపతో కలుపుకుని 557 కి.మీ. ఉన్నది. అమరావతి నుండి అనంతపురానికి రోడ్డు పొడవు 394 కి.మీ. దీనిని 6 లేన్స్ రోడ్డుగా 200 మీ వెడల్పుతో ఈ రోడ్డు వేయాలని ముఖ్యమంత్రిగారి ఆదేశం. అమరావతి నుండి నేరుగా అనంతపురానికి రోడ్డు పొడవు 391 కి.మీ. నాలుగు లేన్ల రోడ్డు 150 కి.మీ. ఇది గిద్దలూరు అనంతపురంకు మధ్యలో వస్తుంది. రెండు సొరంగాలు కూడా వస్తాయి. వాటి పొడవు 27 కి.మీ. ఉంటుంది. 43 మేజర్ వంతెనలు వస్తాయి. ROB లు మొత్తం 9 వస్తాయి. 23 ఇంటర్ ఛేంజ్‌లు వస్తాయి. ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు రూ.24,000 కోట్లుగా అంచనా వేయడమైనది. ఎక్స్‌ప్రెస్ వే గొప్పతనం ఏమిటంటే చంద్రబాబునాయుడు గారి విజన్ నచ్చిన భారతప్రభుత్వం దీనిని "భారతమాల ప్రాజెక్టు"లో చేర్చాలనే ఆలోచనతో ఉన్న విషయాన్ని సభముందు ఉంచుతున్నాను.

గౌరవ సభ్యులు భూసేకరణ గురించి అడిగారు. ఆ పనులు పురోగతిలో ఉన్నాయి. జాతీయ రహదారి చట్టం–1956 ప్రకారంగా భూసేకరణ జరుగుతున్నది. అలైన్‌మెంట్‌లో ఉన్న ప్రభుత్వ భూములు మరియు ప్రైవేటు భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా గానీ మరే ఇతర విధానంలోనైనా రాష్ట్రప్రభుత్వం భూసేకరణ చేసి ఇవ్వాలని కేంద్రప్రభుత్వం 16.11.2016 న తెలియచేయడం జరిగింది. రాష్ట్రప్రభుత్వంచే భూసేకరణ కొరకు 5 జిల్లాల్లో 5

యూనిట్లు ఇప్పటికే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పర్యవేక్షణలో ఏర్పాటు చేయడం జరిగింది. 200 మీటర్ల వెడల్పున **Right of Way** కు భూసేకరణ చేస్తున్నాము. భూసేకరణ చేయుటకు భారతదేశ ప్రభుత్వం గెజిట్‌లో **3A, 3D, 3G notifications** ప్రచురించవలసి ఉన్నది. **3A** వివరాలు భారత ప్రభుత్వానికి నోటిఫికేషన్ కొరకు 8-2-2018న రాష్ట్రప్రభుత్వానికి పంపించడం జరిగింది. జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేగా భారతప్రభుత్వం ప్రకటించుటకు కావలసినటువంటి **Economic Feasibility Report**ను తయారు చేసి కేంద్రానికి పంపించాము. 8,571 హెక్టార్ల భూసేకరణకు గాను రూ.2,500 కోట్లు అంచనా వేయడమైనది. ఈ ఎక్స్‌ప్రెస్ వే నల్లమల అడవుల్లో 33 కి.మీ. పయనిస్తుంది. అటవీ భూమి 591.50 హెక్టార్లు ఉంటుందని అంచనా వేయడమైనది. ఈ అటవీ భూములను కూడా రాష్ట్రమే సేకరించాలని 16.11.2016లో కేంద్రప్రభుత్వం తెలియచేయడమైనది. ఈ అటవీ భూముల సేకరణకు ప్రత్యేకంగా డిఎఫ్ఓ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

అధ్యక్షా, ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిపిఆర్‌ను తయారు చేస్తున్నాము. ఎక్స్‌ప్రెస్‌వేకు భారతప్రభుత్వం వారు నంబరును కేటాయించవలసి ఉన్నది. ముందుగా జాతీయ రహదారికి కేంద్రప్రభుత్వం నంబరును కేటాయించవలసి ఉంటుంది. ఈ ఎక్స్‌ప్రెస్ హైవేకు ఇంకా నంబరును ఇవ్వవలసి ఉందని నేను తమ ద్వారా సభ్యులకు మనవిచేస్తున్నాను. కేంద్రం దీనికి నంబరును కేటాయించి డిపిఆర్‌కు ఆమోదం తెలిపిన వెంటనే నిర్మాణ బాధ్యతలను చేపట్టి, అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ఈ ప్రాజెక్టును పూర్తిచేసేందుకు అన్ని విధాలుగా ఈ రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని తమ ద్వారా గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను.

ఈ ఎక్స్‌ప్రెస్ హైవే ద్వారా మన రాష్ట్రానికి ఎంతో మేలు చేకూరుతుంది. అమరావతి- అనంతపురం ఎక్స్‌ప్రెస్ వే ప్రధాన రహదారి 394 కి.మీ. పొడవు కలిగి నాలుగు జిల్లాల ద్వారా కొనసాగుతుంది. దీనివలన అమరావతి నుండి అనంతపురంకు దాదాపు 70 కి.మీ. తగ్గే అవకాశం ఉంటుంది. దూరంతోబాటు 10 గంటల ప్రయాణకాలం తగ్గి అమరావతి నుండి అనంతపురంకు 4 గంటల సమయంలో చేరే అవకాశం ఉంటుంది. అనంతపురంతో బాటు కడప, కర్నూలు పట్టణాలకు కూడా ప్రయాణకాలం తగ్గే అవకాశాలు వస్తాయి. అమరావతి నగరం నుండి బెంగళూరుకు సురక్షితంగా చేరే మార్గం ఏర్పడుతుంది. ప్రయాణ కాలం కూడా 6 గంటలలోపే ఉంటుంది. రాయలసీమ వారికి బెంగళూరుతో అనుబంధం ఉంటున్న విషయం మనందరికీ తెలుసు. రాయలసీమ వారందరూ కూడా ఏ కార్యక్రమమైనా బెంగళూరుకు వెళుతుంటారు. రాయలసీమ వారికి ఈ ఎక్స్‌ప్రెస్‌వే ఒక వరం లాంటిది. దీనివల్ల వారికి 2,3 గంటలలో బెంగళూరు చేరేందుకు ఆస్కారమేర్పడుతుంది. రోడ్డు భద్రత అంతర్జాతీయ ప్రమాణాలతో ఉంటుంది. ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు నూరు శాతం అవకాశముంటుంది.

**మిస్టర్ ఛైర్మన్:** మినిస్టర్ గారూ, మొత్తం వివరాలు చెబుతున్నారు మీరు. సభ్యులు అడిగినంతవరకూ చెప్పండి చాలు.

**శ్రీ సిహెచ్. అయ్యన్నపాత్రుడు:** ఇది చాలా ముఖ్యమైన అంశం సార్. భారతదేశంలోనే నెంబర్ వన్ రోడ్డు అధ్యక్షా. దీనిగురించి ప్రజలకు కూడా తెలియాల్సిన అవసరం ఉన్నది కాబట్టి, కాస్త సమయం ఇవ్వండి. ఈ ఎక్స్‌ప్రెస్ వే ద్వారా 5 జిల్లాల్లో గల ప్రముఖమైన పుణ్య క్షేత్రాలు, యాత్రా స్థలాలు, ఎస్ఈజడ్‌లు వేగంగా అభివృద్ధి చేయడానికి చక్కటి అవకాశం వస్తుంది. ఈ ఎక్స్‌ప్రెస్ వే పక్కన అనువైన ప్రదేశాలలో శాటిలైట్ పట్టణాలు, రిక్రియేషన్ క్లబ్స్, రిసార్ట్స్ వచ్చే అవకాశముంటుంది. టూరిజం, పారిశ్రామికీకరణ ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వస్తాయి. అత్యవసర మెడికల్ సర్వీసెస్‌కు మెడికల్ టూరిజంకు కూడా అవకాశాలు మెరుగుపడతాయి.

అధ్యక్షా, ల్యాండ్ అక్విజిషన్‌కు సంబంధించి మొత్తం 5 జిల్లాల్లో కూడా నూరు శాతం రాష్ట్రప్రభుత్వం పూర్తిచేసి ఆ వివరాలను కేంద్రానికి సబ్మిట్ చేయడం జరిగింది. కేంద్రప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే మేము దానిని అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తామని గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను. దీని గురించి ఇంకా వివరంగా చెప్పాలంటే, భారతదేశంలో ఇప్పటివరకూ మొత్తం 4 అతి పెద్ద ఎక్స్‌ప్రెస్ వేలు ఉన్నాయి. ఆగ్రా నుండి లక్నో ఎక్స్‌ప్రెస్ వే 302 కి.మీ., ఢిల్లీ నుండి జైపూర్ ఎక్స్‌ప్రెస్ వే 195 కి.మీ., ముంబై నుండి పూణే 95 కి.మీ., అహ్మదాబాదు నుండి వడోదర 93 కి.మీ. ఉండగా మన అమరావతి అనంతపురం హైవే మాత్రం 394 కి.మీ. ఉన్నదని తెలియచేస్తున్నాను. దేశంలోనే అతి పెద్దది, సుందరమైనదిగా ఈ రోడ్డు రాబోతున్నది. దీనికి కేంద్రప్రభుత్వం వెంటనే అనుమతి ఇవ్వవలసిన అవసరమున్నది. ఇంతకుముందు శమంతకమణి గారు కేంద్రం అనుమతి ఇవ్వలేదా అని అడిగారు. కేంద్రం చాలా వాగ్దానాలు చేసింది. అందులో ఇది కూడా ఒక వాగ్దానంగా మిగిలిపోయింది. అందుచేత ఇక్కడున్న బిజెపి సభ్యులు కూడా చొరవ తీసుకుని కేంద్రం మీద ఒత్తిడి తీసుకువచ్చి వెంటనే పర్మిషన్ తీసుకువస్తే ఈ హైవేను పూర్తిచేసి రాష్ట్ర ప్రగతి తోడ్పడతామని తమ ద్వారా మనవిచేస్తున్నాను.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్ :** (మైక్ లేదు) స్థల సేకరణకు కూడా పూర్తి డబ్బు కేంద్రమే ఇస్తుంది. పర్మిషన్ కూడా కేంద్రం ఇచ్చింది అధ్యక్షా.

## నాయుడు పేట – తిరుపతి రహదారి

ప్రశ్న నెం.10481 (83)

**శ్రీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్, ఎం.ఎల్.సి**

గౌరవనీయులైన రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా:

అ) నెల్లూరు జిల్లాలో నాయుడుపేట నుండి తిరుపతి మధ్య రహదారి పైన భారీ ట్రాఫిక్ వల్ల ప్రమాదాల సంఖ్య పెరిగిన విషయం వాస్తవమేనా: మరియు

ఆ) అయితే, ఆ రహదారిని 4 వరుసల రోడ్డుగా చేయడానికి ప్రతిపాదన ఏదైనా ఉందా?

**గౌరవనీయులైన రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి (శ్రీ సిహెచ్. అయ్యన్నపాత్రుడు) :**

**అ)** అవునండీ.

**ఆ)** భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్.హెచ్.ఎ.ఐ) ద్వారా నాయుడుపేట – తిరుపతి రోడ్డును ఆరు వరుసల రోడ్డుగా చేయడానికి ఒక ప్రతిపాదన ఉంది.

**శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ (స్థానికసంస్థలు – కృష్ణా):** అధ్యక్షా, చిత్తూరు జిల్లాలో నాయుడుపేట నుండి తిరుపతికి ఉన్నటువంటి రోడ్డు కేవలం డబుల్ రోడ్డుగా ఉండడం వల్ల చాలా ఇరుకుగా ఉన్నది. రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా వచ్చే ప్రయాణీకులకు అది చాలా ఇబ్బందిగా ఉంటోంది. వాహనాల రద్దీ, ప్రయాణీకుల రద్దీ కారణంగా యాక్సిడెంట్లలో అనేకమంది చనిపోతున్నారు. అలాగే, స్పీడు బ్రేకర్స్ కూడా చాలా ఎక్కువగా వేయడం జరిగింది. ఈ రోడ్డును సాధ్యమైనంత త్వరగా పూర్తిచేస్తే బాగుంటుందని మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**ఉ.10.20**

**శ్రీ బి.ఎన్.రాజసింహులు (స్థానికసంస్థలు – చిత్తూరు):** అధ్యక్షా, ఎంతసేపూ అతి పొడవైన రహదారి అనంతపురం – అమరావతి అన్నారు. మా చిత్తూరును రాయలసీమలో వదిలిపెట్టేస్తున్నారు. రావడానికి ఒకరోజు, వెళ్ళడానికి ఒకరోజు, నడుమునొప్పులకు ఒకరోజు అని మా సోదరి శమంతకమణిగారు చెప్పారు. చిత్తూరు నుంచి నాయుడుపేటకు రహదారి మంజురైందని మొన్ననే చెప్పారు. దానికి భూసేకరణ జరుగుతోందన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ రహదారిని పూర్తిచేస్తే మేం తొందరగా రావడానికి అవకాశముంది. ఇటీవల ఏర్పేడు దగ్గర ఒక లారీ ప్రమాదం జరిగి సుమారు 16 మంది చనిపోయారు. బెంగళూరు నుంచి తిరుపతి వరకూ రహదారిలో ఇప్పటివరకూ ఎంతమంది చనిపోయారనేదానిని పోలీసు స్టేషన్ వారీగా మేము రికార్డు చేసి ఇచ్చాము. కాబట్టి త్వరగా ఆ రహదారిని పూర్తిచెయ్యాలని మీద్వారా మంత్రిగారిని అభ్యర్థిస్తున్నాను.

**శ్రీ గౌనివారి శ్రీనివాసులు (నామినేటెడ్):** అధ్యక్షా, చాలా సంతోషం. మన రాష్ట్రప్రభుత్వం రోడ్ల వ్యవస్థను చాలా చక్కగా మెరుగుపరుస్తోంది. అయితే, చిత్తూరు నుండి కడపకు, తిరుపతికి వెళ్ళేటప్పుడు మధ్యలో మూడు రైల్వే లైన్లు ఉన్నాయి. ఈ రహదారిపై ఓవర్ బ్రిడ్జిలు వేయాలని నేను గత సమావేశంలో కూడా అడగడం జరిగింది. దీనికి డబ్బులు మంజూరయ్యాయనీ, టెండరు స్టేజిలో ఉన్నాయని అప్పుడు చెప్పారు. అయితే, ఆ మూడు ఓవర్ బ్రిడ్జిలకు సంబంధించిన పనులు కూడా ఇంతవరకూ కూడా ప్రారంభించలేదు. అదేవిధంగా ఎస్.వి. విశ్వవిద్యాలయం సమీపంలో తిరుపతి నుండి చంద్రగిరికి వచ్చే రహదారిలో కూడా ఒక రైల్వే క్రాసింగ్ ఉంది. అక్కడ కూడా గంటల తరబడి వాహనాలు ఆగిపోతున్నాయి. ఈ నాలుగు ఓవర్ బ్రిడ్జిలను వెంటనే ప్రారంభించాలని తమద్వారా గౌరవ మంత్రివర్యులను అభ్యర్థిస్తున్నాను.

**శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు:** అధ్యక్షా, రాజేంద్రప్రసాద్‌గారిది కృష్ణాజిల్లా అయినా చిత్తూరు జిల్లా గురించి ప్రశ్న వేశారు. చాలా సంతోషం. ఈ రహదారి గురించి బి.ఎస్.రాజసింహులుగారు, గౌనివారి శ్రీనివాసులుగారు చెప్పింది వాస్తవమే. అది చాలా ముఖ్యమైన రహదారి. తిరుపతికి వెళ్ళే రహదారి ఎక్కువగా భక్తులు, పర్యాటకులు ఉపయోగిస్తుంటారు. ఇది రెండు వరుసల రహదారి కాబట్టి ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశముంది. ఈ విషయం నా దృష్టికి కూడా వచ్చింది. మదనపల్లె, తిరుపతి, రేణిగుంట, ఏర్పేడు, నాయుడుపేట మీదుగా ఉన్న ఈ రహదారిని 2013 సంవత్సరంలో భారత ప్రభుత్వం జాతీయ రహదారిగా ప్రకటించడం జరిగింది. దీనికి జాతీయ రహదారి-71గా నెంబర్ కూడా ఇచ్చారు. అదేవిధంగా, ఈ జాతీయ రహదారి మొత్తం 190.60 కిలోమీటర్లు. ప్రస్తుతం ఇది రెండువరసల రహదారి. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రస్తుతం ఈ రహదారిని నాలుగు వరసల రహదారిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అయితే, నాయుడుపేట నుండి తిరుపతి వరకూ ఉన్న రహదారి పొడవు 57 కిలోమీటర్లు. ఇది చాలా ముఖ్యమైన రహదారి కాబట్టి ఈ 57 కిలోమీటర్ల రహదారిని మాత్రం ఆరు వరసల రహదారిగా వేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి డిపిఆర్ కూడా త్వరలోనే తయారవుతుంది. భూసేకరణలో కొంత ఆలస్యమవుతోంది.

అదేవిధంగా, భూసేకరణ అంతా కూడా ఎక్కువగా రెవెన్యూ శాఖ చూసుకుంటుంది. రెవెన్యూ విభాగంలో కొంత ఆలస్యమవుతుందనేది వాస్తవం. ఎందుకంటే వాళ్ళకు కూడా చాలా పనులుంటాయి. జె.సిగారు, ఆర్‌డిఓగారు, తహశీల్దార్లు ఇలా ఎవరికి ఫోన్‌చేసినా వాళ్ళందరూ చాలా బిజీగా ఉన్నామని అంటుంటారు. అలాగే సచివాలయం నుండి ప్రధాన కార్యదర్శిగారు సిసిఎల్ఏ పునేతగారు కూడా ప్రతి పదిహేను రోజులకు ఒకసారి జిల్లా కలెక్టర్లందరితో భూసేకరణ గురించి చర్చించి వేగవంతం చేస్తున్నారు. గౌరవ సభ్యులను నేను కోరేదేమిటంటే మీ ప్రాంతంలో ఎక్కడైనా భూసేకరణ చేయాల్సి ఉంటే ప్రభుత్వ అధికారులదగ్గర కూర్చొని ఒత్తిడి తీసుకువచ్చి భూసేకరణ పూర్తి చేయాల్సిన అవసరముందని ఈ సందర్భంలో మనవి చేస్తున్నాను. ఈ ప్రాజెక్టు మొత్తం నేషనల్ హైవే అథారిటీ వారే చేస్తున్నారు. అలాగే, భూసేకరణ ఖర్చు అంతా కూడా భారత ప్రభుత్వం వారే భరిస్తున్నారు. జూలై 18 నాటికల్లా డిపిఆర్ పూర్తవుతుందనుకుంటున్నాము. రెండు వరుసల నుండి ఆరు వరుసలకు మార్చే ఈ రహదారి ఖర్చు రూ.2000 కోట్లు అవుతుందని ప్రస్తుతం అంచనా. డిపిఆర్ పూర్తయిన వెంటనే టెండర్లు పిలిచి తిరుపతికి మంచి రహదారి వేయడంకోసం ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని మీద్వారా మనవి చేస్తున్నాను.

**శ్రీ బి.ఎన్.రాజసింహులు:** అధ్యక్షా, చిత్తూరు నాయుడుపేట రహదారి గురించి చెప్పలేదు.

**మిస్టర్ చైర్మన్:** చెప్పారండీ. రికార్డులో ఉంది.

<u>రాజధానికి నూతన రైల్వే లైన్లు</u>

ప్రశ్న నెం. 10323 (84)

**శ్రీ సోము వీర్రాజు, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన రవాణా శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** దేశంలోని ఇతర ప్రాంతాలతో అమరావతి రాజధానిని కలుపుటకు కొత్త రైల్వే మార్గాలను మంజూరు చేయుటకు కేంద్ర ప్రభుత్వానికి ఏవైనా ప్రతిపాదనలు పంపారా;

**ఆ)** అందుకు సంబంధించి ఏదైనా నివేదికను సమర్పించారా;

**ఇ)** అయితే, ఆ వివరాలు ఏమిటి?

**గౌరవనీయులైన రవాణా, బీసీ సంక్షేమం మరియు సాధికారత, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి (శ్రీ కె.అచ్చెన్నాయుడు) :**

**అ)** అవునండీ.

**ఆ)** ఒక సవివర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) ను రైల్వే మంత్రిత్వ శాఖ రూపొందించింది.

**ఇ)** సవివర ప్రాజెక్టు నివేదిక ప్రకారం ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 3,272.03 కోట్లు. ప్రాజెక్టు మొత్తం పొడవు 106.56 కిలోమీటర్లు. ఇందులో దిగువ మార్గాలు చేరి ఉన్నాయి.

- ఎర్రుపాలెం – అమరావతి – నంబూరు (విభాగం–I) మధ్య డబుల్ బ్రాడ్ గేజ్ మార్గం 56.53 కి.మీ. ।
- అమరావతి – పెదకూరపాడు (విభాగం–II) మధ్య సింగల్ బ్రాడ్ గేజ్ మార్గం 23.78 కి.మీ.
- సత్తెనపల్లి – నరసరావుపేట (విభాగం–III) మధ్య సింగల్ బ్రాడ్ గేజ్ మార్గం 26.25 కి.మీ.

**శ్రీ సోము వీర్రాజు (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, అమరావతి భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు అనుసంధానం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినమీదట గత బడ్జెట్‌లో రైల్వేశాఖ మంత్రిగా సురేష్ ప్రభుగారు ఉండగా రూ.2800 కోట్లు కేటాయించారు. దీనికి సంబంధించి మనం ఏదైనా నివేదిక ఇచ్చామా? దాంట్లో ఏమైనా ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నాయా? ఇది వినియోగించని మూలంగా, రాష్ట్రం నుంచి సరైన నివేదిక వెళ్ళని మూలంగా ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.10 కోట్లే కేటాయించారు కాబట్టి గత బడ్జెట్‌లో ఉన్న ధనాన్ని కొంత ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేసి అమరావతికి భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు మార్గాన్ని ఏర్పాటుచేసే ప్రయత్నం చేయాల్సిందిగా మీద్వారా కోరుతున్నాను.

**శ్రీ పి.రామసుబ్బారెడ్డి:** అధ్యక్షా, రాష్ట్రం విడిపోయిన తరువాత మనం అమరావతిని రాజధానిగా ఏర్పాటుచేసుకున్నా, గౌరవ సభ్యులందరూ చెప్పినట్లు రాయలసీమ ప్రాంతం నుంచి అమరావతికి రహదారి కనెక్టివిటీ, రైల్వే కనెక్టివిటీ లేక చాలా ఇబ్బందిగా ఉంది. కడప నుంచి మరీ ముఖ్యంగా రాజధానికి రావాలంటే ధర్మవరం నుంచి వచ్చే రైలు ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, నంద్యాల మార్గాలమీదుగా వస్తోంది. నాకు తెలిసినంతవరకూ ప్రొద్దుటూరు నుంచి గిద్దలూరు, కంభం, విజయవాడకు రైల్వే లైను కోసం సర్వే చేశారని తెలుస్తోంది. అలా వేస్తే ఇప్పుడున్న లైను కంటే దాదాపు 100 కిలోమీటర్లు దూరం తగ్గుతుంది. ముఖ్యమంత్రిగారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని రాజధానికి రహదార్ల కనెక్టివిటీ చేస్తున్నారు. అలాగే వెనుకబడిన ప్రాంతాలకు కూడా చేస్తున్నారు. దాంట్లో భాగంగా ప్రొద్దుటూరు, గిద్దలూరు, కంభం, విజయవాడకు రైల్వేలైను ఏర్పాటుచేస్తే ఇటు అనంతపురం నుంచి వచ్చే ట్రైన్స్‌కు, అటు కడప నుంచి వచ్చే ట్రైన్స్‌కు చాలా దూరం తగ్గిపోతుంది కాబట్టి సత్వర చర్యలు తీసుకోవాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కె.అచ్చెన్నాయుడు :** అధ్యక్షా, సోము వీర్రాజుగారు ప్రశ్న వేశారు. ఇది మంచి ఉదాహరణ. ఒకసారి మీరుకూడా తెలుసుకోవాలి. రాష్ట్రప్రభుత్వం అమరావతికి పాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఏదైనా కనెక్టవిటీ ఉండాలని గౌరవ సభ్యులు అడుగుతున్నారు. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 13వ షెడ్యూల్‌లోనే వీటిగురించి పొందుపరిచారు. అమరావతి నుండి హైదరాబాద్‌కు మరియు తెలంగాణలోని ఇతర ముఖ్యనగరాలకు సత్వర రైళ్ళను అనుసంధానం చేస్తామని చట్టంలోనే పొందుపరిచారు. చట్టంలో పొందుపరచిన విధంగా వెంటనే చేయమని తెలియజేస్తూ, రైల్వే బోర్డు చైర్మన్‌గారికి 29.9.2015వ తారీఖున మన ప్రధాన కార్యదర్శిగారు ఒక లేఖ రాశారు. ఆరు మాసాల్లోనే ఏర్పాటు చేయాలని చట్టంలో కూడా స్పష్టంగా పొందుపరిచారు. ఎప్పుడైతే మన ప్రధాన కార్యదర్శిగారు లేఖ రాశారో రైల్వేబోర్డు ఆర్.వి.ఎన్.ఎల్ (రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్) అనే ఏజెన్సీకి ఈ పనులను అప్పజెప్పారు. ఆ ఏజెన్సీ సర్వే చేసి (1) ఎర్రుపాలెం – అమరావతి – నంబూరు, (2) అమరావతి – పెద్దకూరపాడు, (3) సత్తెనపల్లి – నర్సరావుపేట మూడు మార్గాలను గుర్తించారు.

ఉ.10.30

ఈ మూడు రూట్లు కూడా సుమారుగా రూ.3,272.03కోట్లతో ఏర్పాటు చేయాలని ఆర్‌విఎన్ఎల్ (Rail Vikas Nigam limited) నివేదిక ఇస్తే ఆ ప్రిలిమినరీ రిపోర్ట్ మీద వెంటనే రైల్వేశాఖ డిపిఆర్ ఇవ్వమని అడిగింది. ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. ఆర్‌విఎన్ఎల్ కూడా రైల్వేశాఖ పరిధిలో ఉన్న సంస్థ. ఆర్‌విఎన్ఎల్ నివేదిక ప్రకారం ఈ రూట్లన్నీ ఏర్పాటు చేస్తే రైల్వేకు 10శాతం లాభం వస్తుంది. ఎప్పుడైతే రైల్వే శాఖ పూర్తి వివరాలతో డిపిఆర్ అడిగిందో వెంటనే కేంద్రప్రభుత్వం ప్లేటు ఫిరాయించింది. ఈ రూట్లన్నీ ఏర్పాటుచేస్తే రైల్వేకు 4 శాతం నష్టం వస్తుందని తప్పుడు సమాచారం చెబుతోంది. అదేవిధంగా 50 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కేంద్ర ప్రభుత్వం వారు మెలిక పెట్టారు కానీ, చట్టంలో అలా లేదు. అమరావతి కొత్తగా ఏర్పడుతున్న రాజధాని కాబట్టి

అమరావతికి ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలతో కనెక్టివిటీ ఇవ్వాలని, దానిని ఆరు మాసాలలో పూర్తి చేయాలని అంటే ఒక్కరోజు కూడా ఆలస్యం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తే ఏరకంగా ప్రాజెక్టు ఆపాలని ఆలోచించి మెలికవేశారు. ఈ ప్రాజెక్టుకు 50శాతం నిధులు రాష్ట్రప్రభుత్వం భరించాలంటే నిధులు ఎక్కడి నుండి తీసుకువస్తాము, ఏ రకంగా పూర్తవుతుంది? గౌరవ సభ్యులు ఈ అంశాలన్నీ తెలుసుకుని మాట్లాడాలి. ఏదీ తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడి కేంద్ర ప్రభుత్వం అన్ని ఇచ్చిందని అంటున్నారు.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా మేము ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం లేదు.

(అంతరాయం)

**శ్రీ కె. అచ్చెన్నాయుడు:** అధ్యక్షా, ముందు మేము మాట్లాడేది వినమనండి, విన్న తరువాత వారు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిస్తాము. నేను చెప్పిన దానిలో ఏదైనా అవాస్తవముంటే అది కూడా అడగండి. ఎవరమైనా సరే, ఏ పార్టీ అయినా, బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు, తెలుగుదేశం పార్టీలు ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసమే ఆలోచించాలి. ఇక్కడ రాజకీయాలు ఏమి ఉన్నాయి సార్? నేను చెప్పిన దానిలో ఏమైనా అవాస్తవముంటే అడగమనండి. దానికి కూడా సమాధానమిస్తాను.

(అంతరాయం)

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, నేను ఇష్టం వచ్చినట్లు మాట్లాడలేదు, సమాచారం కోసం అడిగాను. మాకు బాధ్యత ఉంది కాబట్టే ప్రశ్న వేశాను.

**శ్రీ కె. అచ్చెన్నాయుడు:** అధ్యక్షా, చట్టంలో పెట్టారు, ఆరు మాసాలలో పూర్తి చేయాలని స్పష్టంగా చెప్పారు, మేము వెంటనే కేంద్రంలోని రైల్వే బోర్డుకు లేఖ రాశాము, వారు ఒక ఏజెన్సీకి అప్పగించారు, సర్వే చేయించారు, ఇంత ఖర్చవుతుంది, ఇలా చేస్తే 10శాతం లాభం వస్తుందని కూడా చెప్పారు, కానీ ఎలా ఎగ్గొట్టాలా అని చెప్పి నాలుగు శాతం నష్టం వస్తుంది, 50శాతం నిధులు రాష్ట్రప్రభుత్వం భరించాలని అంటే ఎలా వీలవుతుంది? ఇప్పటికైనా సరే గౌరవ సభ్యులకు చిత్తశుద్ధి ఉంటే మిగతావన్నీ పక్కన పెట్టి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలి. డిపిఆర్‌తో సహా ఈ ప్రాజెక్టు వివరాలన్నీ ఉన్నాయి. రూ.3,272.03కోట్లు ఖర్చవుతుంది. ఇది మేము అడిగింది కాదు, చట్టంలో పెట్టారు. మీకు శక్తి ఉంటే వెంటనే కేంద్రం నుండి అనుమతి తెచ్చుకుని చేసి చూపించండి, ప్రజలు హర్షిస్తారు తప్ప ఏదో మైకులు దొరికాయని సమావేశాలలో డిస్కషన్స్‌లోకి వెళ్లి ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, నేను ఇష్టానుసారంగా మాట్లాడలేదు. సమాచారం తెలుసుకోవడానికే ప్రశ్న వేశాను.

**శ్రీ కె. అచ్చెన్నాయుడు:** అధ్యక్షా, ఈ ప్రాజెక్టు గురించి సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారికి చెబుతున్నాను, డిపిఆర్ రెడీగా ఉంది, కేంద్రప్రభుత్వానికి వివరాలు పంపించాము, మీకు కూడా ఒక కాపీ ఇస్తాము. మీకు శక్తి ఉంటే కేంద్ర ప్రభుత్వం వద్ద నుండి నిధులు తీసుకురండి, రాష్ట్ర ప్రజలు హర్షిస్తారు. రాష్ట్ర ప్రజలకు మంచి జరుగుతుందని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**MR.CHAIRMAN:** Question No.10408 (85) Minister for Transport.

## <u>ఉన్నత వర్గాలలోని పేదలకు పథకాలు</u>

ప్రశ్న నెం.10408(85)

**సర్వశ్రీ గంగుల ప్రభాకర్ రెడ్డి, వెన్నపూస గోపాల్ రెడ్డి, ఎం.ఎల్.సి.లు.,**

గౌరవనీయులైన వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** ఎఫ్.సిలలోని పేదలకు ఏవేని ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టడమయిందా;

**ఆ)** అయితే, అందుకు సంబంధించిన వివరాలేమిటి?

**గౌరవనీయులైన రవాణా, బీసీ సంక్షేమం మరియు సాధికారత, చేనేత మరియు జౌళి శాఖమంత్రి (శ్రీ కె. అచ్చెన్నాయుడు):**

**అ)** అవునండీ.

**ఆ)** 2017-18 సంవత్సరానికి ఇ.బి.సి.లకు ఆర్.టి.ఎఫ్ మంజూరు నిమిత్తం ప్రభుత్వం రూ.682.75కోట్ల మొత్తాన్ని కేటాయించింది. అందులో 05-03-2018 నాటికి 1,90,000 ఇ.బి.సి. విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.664.65 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేయడమయింది. 2017-18 సంవత్సరానికి వరుసగా 537 మరియు 298 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ, ప్రభుత్వ హాస్టళ్లు మరియు నైవాసిక పాఠశాలల్లో ప్రవేశాలను కల్పించడమయింది.

07-12-2017 తేదీగల వెనుకడిన తరగతుల సంక్షేమ(బి) శాఖ జి.ఓ.ఎంఎస్. నెం.174 ద్వారా స్వయం ఉపాధి పథకాలు, నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణా కార్యక్రమం, ఎన్.టి.ఆర్. ఉన్నత విద్యాదరణ పథకం మరియు ఎన్.టి.ఆర్. విదేశీ విద్యాదరణ పథకాల క్రింద సివిల్ సర్వీసు పరీక్షల కోసం ఉచిత కోచింగు మొదలైన వాటి క్రింద ఆర్థికంగా వెనుకబడిన సామాజిక వర్గాలకు ఆర్థిక సహాయాన్ని అందించడానికి 2017-18 ఆర్థిక సంవత్సరం కోసం ప్రభుత్వం రూ.263.00 కోట్ల మొత్తాన్ని కేటాయించడమయింది. అంతేగాక, ఆర్థిక సహాయాన్ని అందించడానికి కాపు, బ్రాహ్మణులు, మైనారిటీలు మరియు క్రైస్తవ మైనారిటీలకు చెందిన పేద లబ్ధిదారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పోరేషన్‌లు ఉన్నాయి. ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెటును కూడా కేటాయించింది.

**శ్రీ చిక్కాల రామచంద్ర రావు (స్థానికసంస్థలు–తూర్పుగోదావరి):** అధ్యక్షా, మంత్రిగారి సమాధానంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి రూ.263కోట్లు కేటాయించడం జరిగిందని చెప్పారు. ఇది మంచి పరిణామం. గతంలో కొన్ని వర్గాలకు అంటే కాపులకు, బ్రాహ్మణులకు, ఉన్నత వర్గాల వారిలోని పేదవారి కోసం ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగింది. మంత్రిగారిని కోరేదేమంటే కాపులకు ఎంత కేటాయించారు, బ్రాహ్మణులకు ఎంత కేటాయించారు, అలాగే మైనార్టీలు, క్రైస్తవ మైనార్టీలకు ఎంత కేటాయించారు? గతంలో కూడా వైశ్యులకు కూడా కేటాయిస్తామని చెప్పారు. కానీ ఇందులో చెప్పలేదు. వైశ్యులకు ఎంత కేటాయించారో చెప్పాల్సిందిగా మీద్వారా మంత్రి వర్యులను కోరుతున్నాను. రెండవ అంశమేమంటే, ప్రభుత్వ పథకాలైన స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి ప్రజలకు బ్యాంకులలో అనేక ఇబ్బందులు వస్తున్నాయి. వారికి రుణాలు పూర్తిగా శాంక్షన్ చేయడం లేదు, ప్రభుత్వం బ్యాంకర్స్‌తో మాట్లాడి ప్రజలకు లోన్స్ వచ్చేలా చూడాలని మంత్రివర్యులను మీద్వారా కోరుతున్నాను.

**డా.ఎ.ఎస్.రామకృష్ణ (ఉపాధ్యాయ నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు):** అధ్యక్షా, వేసిన ప్రశ్న ఏమంటే ఉన్నతవర్గాలకు చెందిన పేదవారి కోసం ఏవైనా ప్రత్యేక పథకాలు ప్రారంభించారా? సమాధానంలో ఇబిసి విద్యార్థుల కోసం రూ.682కోట్లు కేటాయించారని, అలాగే బ్రాహ్మణులకు, మైనారిటీలకు, క్రైస్తవ మైనారిటీలకు, కాపుల కోసం ప్రత్యేకమైన పథకాలు కేటాయించిన విషయం అందరికీ తెలిసిందే. అలాగే ఈమధ్య కొత్త బడ్జెట్‌లో వైశ్యులకు కూడా రూ.30కోట్లు కేటాయించారు, సంతోషం. అందుకు ప్రభుత్వానికి మనమందరం అభినందనలు తెలియజేయాలి. అయితే ఈ సందర్భంగా ఉన్నత వర్గాలలో పేదలు అంటే కాపులు, బ్రాహ్మణులు, వైశ్యులతోపాటు ఇంకా కొన్ని ఉన్నతవర్గాల వారు ఉన్నారు. వారెవరో మనందరికీ తెలిసిన విషయమే. ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రెడ్లు, వెలమలు, రాజులు వీరందరూ ఈ మధ్య ఒక సంఘంగా ఏర్పడ్డారు. ఆ మధ్య మేము ప్రత్యేకంగా ఒక రిప్రజెంటేషన్ తయారు చేసుకుని గౌరవమంత్రివర్యులు శ్రీ నారా లోకేశ్‌గారికి ఇవ్వడం జరిగింది. వారందరి ప్రతినిధులు వచ్చి లోకేశ్‌గారికి ఒక విన్నపాన్ని ఇవ్వడం జరిగింది. మాలోకూడా పేదలు ఉన్నారు, వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు, మిగిలిన వాళ్లకు కార్పొరేషన్ పెట్టినట్లే ఓ.సీలందరికి కలిపి ఒకే కార్పొరేషన్ పెట్టమని అడుగుతున్నారు. ఒక్కొక్క వర్గానికి ఒక్కొక్క కార్పొరేషన్ పెట్టమని అడగడం లేదు, ఉన్నత వర్గాలలో ఉన్న పేదవారందరికి కలిపి ఒకే కార్పొరేషన్ పెట్టమని అడుగుతున్నారు. ఇద్దరు మంత్రులూ సభలోనే ఉన్నారు కాబట్టి చర్చించుకుని వారికి న్యాయం చేయాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీ బొడ్డు నాగేశ్వరరావు(పట్టభద్రుల నియోజకవర్గం–కృష్ణా, గుంటూరు):** అధ్యక్షా, ఇబిసికి సంబంధించి అనేక పథకాలను పెట్టి వారిని ఆదుకుంటామన్నారు, సంతోషం. నేను సూటిగా రెండు అంశాలు అడుగుతాను. ఒకటి మనకు ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ స్టడీ సర్కిల్స్ ఉన్నాయి. అయితే నేను కోరేదేమంటే చదువుకునేవారందరికి కూడా ఉద్యోగాలకు సంబంధించిన ప్రకటనలు వచ్చినప్పుడు వాటికి సంబంధించిన శిక్షణ ఇవ్వడానికి స్టడీ సర్కిల్స్‌ను స్ట్రెంగ్తెన్ చేస్తే బాగా ఉపయోగంగా ఉంటుంది. జిల్లాకొక బీసీ స్టడీ సర్కిల్ ఉంది కాబట్టి అలాంటి దానిలో అందర్నీ

అకామడేట్ చేసి శిక్షణ ఇచ్చేలా ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఖర్చు కూడా తగ్గుతుంది. శాశ్వతంగా స్టడీ సర్కిల్స్ ద్వారా రాష్ట్రంలో ఉండే పేద విద్యార్థులకు ఉపయోగపడతాయి కాబట్టి అలాంటి ప్రతిపాదనలు ఏమైనా ప్రభుత్వం దగ్గర ఉన్నాయా అని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

ఉ.10.40

**శ్రీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్:** అధ్యక్షా, ఉన్నత వర్గాలలోని పేదలకు పథకాల గురించి మంత్రిగారు చెప్పారు. రాష్ట్రప్రభుత్వం దాదాపు ఉన్నత వర్గాలలోని అన్ని కులాల వారికి సహాయపడడం జరుగుతోంది. విద్యార్థులకే గాక ఆయా వర్గాల ప్రజలకు, అందులోనూ రెడ్లు, కమ్మవారు, వెలమలు ఈ మూడు కులాలే మిగిలిపోయాయి. వైశ్యులకు కూడా మొన్న బడ్జెట్‌లో నిధులు కేటాయించడం జరిగింది. ఆ మూడు కులాలలో కూడా పేదవారు ఉన్నారు. మరి వాళ్లేం పాపం చేసుకున్నారు? వాళ్లకు కూడా న్యాయం చేస్తే బాగుంటుంది. అందులో మరీ ముఖ్యంగా ఇటీవల కొన్ని లోన్లు కూడా మంజూరు చేయడం జరిగింది. కానీ, ఒక్కొక్క మండలానికి రెండు మూడు లోన్లు మాత్రమే శాంక్షన్ చేశారు. మిగతా కులాల వారికి 50,60,70 లోన్లు వచ్చి, వీళ్లకు రెండు మూడు లోన్లు మాత్రమే ఇస్తే, ఎవరికి ఇవ్వాలో తెలియక కొన్ని నియోజకవర్గాల్లో మాకు ఇవి వద్దని చెబుతున్నారు. ఎందుకంటే లేనిపోని గొడవలు అవుతాయని. అందువల్ల వారికి లోన్లు పెంచాలి.

అధ్యక్షా, రెండోది, ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకం. అది నిజంగా చాలా అద్భుతంగా పనిచేస్తోంది. ప్రజలను, ముఖ్యంగా పేద వర్గాలను ఎంతో ఆదుకుంటుంది. బాగా చదివే విద్యార్థులు విదేశాలకు వెళ్లే స్థోమత లేక ఆగిపోతున్నారు, అలాంటి వారికి ఈ పథకం ఎంతో సహాయపడుతోంది. మరి ఉన్నత వర్గాలలోని కులాలైన రెడ్డి, కమ్మ, వెలమల పిల్లలకు కూడా ఈ ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకాన్ని అమలు చేస్తే బాగుంటుంది. ఎందుకంటే, అన్ని దానాలలోకి విద్యా దానం గొప్పదన్నారు కాబట్టి, ఆ విషయంలో ప్రభుత్వం ఖచ్చితంగా స్పందించవలసిందిగా మీ ద్వారా కోరుతున్నాను.

**శ్రీ కె. అచ్చెన్నాయుడు:** అధ్యక్షా, ఈ ప్రభుత్వానికి, ప్రత్యేకించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి రెండే రెండు కులాలు ఉన్నాయి. ఒకటి పేదలు, రెండోది ధనికులు. ఏ కులంలో ఉన్నా మనం కులాల పేర్లు చెప్పుకోవాల్సిన అవసరం లేదు. రూ.575కోట్లు 2015-16లో ఇబిసిలకు స్కాలర్‌షిప్‌లు, ట్యూషన్ ఫీజుల కింద ఇచ్చాము. అదేవిధంగా ఈ బడ్జెట్‌లో రూ.263కోట్లు ప్రత్యేకించి ఇబిసిలకు కేటాయించడం జరిగింది. స్కిల్ డెవలప్‌మెంట్, స్వయం ఉపాధి, ట్రైనింగ్‌కు రూ.183కోట్లు కేటాయించాము. ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకానికి రూ.50కోట్లు కేటాయించాము. ఎన్టీఆర్ ఉన్నత విద్యా పథకం క్రింద రూ.30కోట్లు కేటాయించి ఇబిసిలకు ఈ పథకాలను అమలు చేస్తున్నాము.

అధ్యక్షా, ఈరోజు గతంలో ఎప్పుడూ ఏ ప్రభుత్వం చేయని విధంగా చేస్తున్నందుకు గర్వపడాలి, ప్రతిఒక్కరు చెప్పుకోవాలి. చాలా మంది చాలా సంవత్సరాల నుండి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం, ఎలక్షన్లు వచ్చినప్పుడు మీకు అది చేస్తాం, ఇది చేస్తాం అని ప్రజలకు చెప్పడం తప్ప, ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. ఫస్ట్ టైం

గర్వపడుతున్నాము. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎవరైతే పేదవారు ఉన్నారో, అది ఏ వర్గమైనా కానీ, అందరినీ సమాన ప్రాతిపదికన గౌరవిస్తున్న ప్రభుత్వం, నాయకుడు ఎక్కడైనా ఉన్నారంటే, అది మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారే. మొన్ననే ఎంబీసీలు అంటే బీసీలలో ఉన్న 36 కులాల వారు ఏ ఊర్లో ఎక్కడ ఉన్నారో, ఏం చేస్తున్నారో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 70 సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి సింగిల్ పైసా కూడా లబ్ధి పొందనటువంటి కులాలు 36 ఉంటే చంద్రబాబునాయుడి గారి నాయకత్వంలో ఎం.బి.సి కార్పోరేషన్‌ని తీసుకువచ్చి 13 జిల్లాల్లో ఊరూరు తిరిగి ఆ 36 కులాల్లో ఎవరెవరు ఉన్నారో వాళ్లందరి దగ్గరకు వెళ్లి వాళ్లందరినీ ఒకే ప్లాట్‌ఫాం మీదకు తెచ్చాము. మొదటిసారి రూ.60,000కోట్లు బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (ఎంబిసి) మరియు అన్ని కులాలకు అందించిన ఘనత కూడా మన ప్రభుత్వానికే దక్కుతుంది. అయితే ఈరోజు ఇబిసిలకు మనం పథకాలు అందిస్తున్నాము, అలాగే వీరికి ఆర్థిక సహాయం కూడా అందించాలి. ఇప్పటికే కొన్ని కార్పోరేషన్లు ఉన్నాయి. కాపు కార్పొరేషన్‌కు సంవత్సరానికి రూ.1000కోట్లు ఖర్చు పెట్టి వారికి కావలసినటువంటి విద్యాపరంగా, లేకపోతే స్వయం ఉపాధికి, ట్రైనింగ్‌కు, లేదా వారు బయట ఎక్కడ చదువుకున్నా వారికి ఆర్థిక సహాయం చేకూర్చే విధంగా కాపు కార్పొరేషన్‌లో కార్యక్రమాలు చేస్తున్నాము. అదేవిధంగా బ్రాహ్మణ కార్పొరేషన్ విషయానికి వస్తే, బ్రాహ్మణుల గురించి ఇంతకు ముందు ఏ ఒక్క ప్రభుత్వమూ ఎప్పుడూ ఆలోచించలేదు. మొదటిసారిగా బ్రాహ్మణ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి ఈ బడ్జెటులో రూ.75కోట్లు కేటాయించాము. అదేవిధంగా కాపు కార్పొరేషన్‌కు రూ.1000కోట్లు కేటాయించాము. ఇప్పుడే కొంతమంది సభ్యులు వైశ్యుల గురించి చెప్పారు. వైశ్యులకు రూ.30కోట్లు కేటాయించాము. రూ.30కోట్లు బడ్జెటులో పెట్టాము. అది ముఖ్యమంత్రిగారి పరిశీలనలో ఉంది. వీళ్లకు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిగారి పరిశీలనలో ఉంది.

అధ్యక్షా, ఇంకొక విషయం సభ్యులు మిగతా కులాలలో ఉన్న పేద వారికి కూడా న్యాయం చేయమని అడిగారు. అందుకే ప్రత్యేకించి ఇబిసి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలనుకున్నాము. అది ముఖ్యమంత్రి గారి పరిశీలనలో ఉంది. అన్ని కులాలకు అంటే బ్రాహ్మణులు, కాపులు, వైశ్యులకు ఇస్తున్న విధంగానే, మిగతా కులాలలో ఉన్న ఇబిసిలకు కూడా మనం స్వయం ఉపాధి, విద్య గురించి సహాయం అందిస్తున్నాము. ఈ కార్యక్రమాన్ని చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో మనందరం కలిసి ముందుకు తీసుకువెళదామని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, స్టడీ సర్కిల్స్ విషయానికి వస్తే, నేను మంత్రి అయిన తరువాత మన దగ్గరే స్టడీ సర్కిల్స్ ఉండి ఉంటే మనమెందుకు ఇతరులకు డబ్బులు కట్టాలనే ఒక ఆలోచన వచ్చింది. స్టడీ సర్కిల్స్‌ను ముందు జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో బలోపేతం చేయాలని నోటిఫికేషన్ ఇచ్చి, మంచి లెక్చరర్స్‌ని డైరెక్టర్లుగా పెట్టి వాటిని బలోపేతం చేయాలని డిసైడ్ చేశాము. మొన్ననే బడ్జెటులో కూడా రూ.30కోట్లు పెట్టాము. దానిని దృష్టిలో ఉంచుకుని ఈ మధ్య కార్యక్రమాలు చేస్తున్నా, దానికి బ్యాంకర్లు సహకరించడం లేదు. అది మీ అందరికీ కూడా తెలుసు. అయితే మొదటిసారి చాలా గర్వపడుతున్నాము. మొన్ననే జన్మభూమి కార్యక్రమం జరిగింది. జన్మభూమిలో 12వ తారీఖున ముఖ్యమంత్రి గారు

కేవలం బీసీలకు అసెట్స్ డిస్ట్రిబ్యూషన్ క్రింద ఒక కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యమంత్రిగారే ప్రత్యేకంగా స్టేట్ లెవల్ బ్యాంకర్ల మీటింగు పెట్టి లక్షాయాభైవేల యూనిట్లకు టార్గెట్ ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో 12వ తారీఖు ఒకే రోజు ఒకే సమయంలో లక్షాయాభైవేల యూనిట్లు ఇవ్వమంటే, ఆరోజు కొన్ని జిల్లాల్లో బాగా జరిగి, కొన్ని జిల్లాల్లో కొంత నెమ్మదిగా జరిగినా సరే ఒక లక్షా పదివేల యూనిట్లు ఒకేరోజు జనవరి 12వ తారీఖున బీసీలకు ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కింది. ఇదొక మంచికార్యక్రమం. ఇంకా కొన్ని ప్రాంతాలలో బ్యాంకర్లు ఇబ్బంది పెడుతున్నారు. అందుకే ఏదో అస్పష్టంగా బ్యాంకర్లు చేయలేదని కాకుండా జిల్లాల వారీగా, బ్రాం। ల వారీగా మనం ఎంత టార్గెట్ ఇచ్చాము, వాళ్లు ఆ టార్గెట్ ఫుల్ఫిల్ చేస్తున్నారా, లేదా, చేయకపోతే ఎందుకు చేయడం లేదు అని ప్రతి పదిహేను రోజులకి కలెక్టర్స్ ఆధ్వర్యంలో ఒక సమావేశం ఏర్పాటు చేసి బ్యాంకుల వారీగా సమీక్షించి మొదటిసారిగా బీసీలకు బడ్జెటులో కేటాయించిన ప్రతిపైసా కూడా మిగలకుండా ఖర్చు పెట్టాము. ఈ సంవత్సరం మళ్లీ 26శాతం పెంచి రూ.6,300కోట్లు కేవలం బీసీలకు కేటాయించాము. ఇంకా ఈబీసీలకు కూడా కేటాయించాము. మీ అందరి సహకారంతో తప్పనిసరిగా ఈ సంవత్సరం పూర్తి స్థాయిలో బడ్జెటును ఖర్చు పెట్టడానికి మనం అన్ని విధాలా ప్రయత్నం చేద్దామని మీ ద్వారా సభ్యులకు తెలియజేస్తూ, అన్ని వర్గాలలో ఉన్న పేదలకు సహాయం చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని సభ్యులందరికీ తెలియజేస్తున్నాను.

## విశాఖపట్నం విమానాశ్రయంలో ఇ–వీసా

ప్రశ్న నెం.10117(86)

**శ్రీ టి.డి. జనార్ధన్, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (హోం) గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం విమానాశ్రయంలో ఇ–వీసాకు అనుమతినిచ్చిందా;

ఆ) అయితే, ఆ విషయంలో చేకూరే ప్రయోజనాలు ఏమిటి?

**గౌరవనీయులైన ఉపముఖ్యమంత్రి (హోం మరియు విపత్తుల నిర్వహణ) శాఖ (శ్రీ నిమ్మకాయల చినరాజప్ప):**

అ) అవునండీ.

ఆ) విశాఖపట్నంలో పర్యాటకాన్ని మరియు వ్యాపారాన్ని పెంపొందించడమే ప్రధాన ప్రయోజనం.

**MR. CHAIRMAN:** Question No.10232 (87) is postponed at the request of the Member. Next, Question No.10204 (88) Minister for Home.

## పశ్చిమ గోదావరి జిల్లాలో వీసా ముఠా

ప్రశ్న నెం.10204(88)

**డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి, శ్రీ వట్టికూటి వీర వెంకన్న చౌదరి, ఎం.ఎల్.సి.లు.,**

గౌరవనీయులైన ఉపముఖ్యమంత్రి (హోం) గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) పశ్చిమ గోదావరి జిల్లాలో నకిలీ వీసా రాకెట్ ఏజెంట్లను గుర్తించడమయిందా;

ఆ) అయితే, ఆ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

**గౌరవనీయులైన ఉపముఖ్యమంత్రి (హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ) (శ్రీ నిమ్మకాయల చినరాజప్ప):**

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీ వి.వి.వి. చౌదరి (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, వీసాలు ఇప్పిస్తామని పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో ఒక రాకెట్ ప్రయత్నం చేసి కొంతమంది తణుకు వారిని మోసం చేసినట్లుగా పత్రికలలో ఈ మధ్యకాలంలో వార్తలు కూడా వచ్చాయి. అది మంత్రిగారి దృష్టికి వచ్చిందా? వస్తే దానిమీద వారు ఏ రకమైన చర్యలు తీసుకున్నారు? ఇటువంటివి అరికట్టవలసిన అవసరం ఉంది. చాలా చోట్ల ఇటువంటి సంఘ విద్రోహక శక్తులు తమ ప్రయోజనాల కోసం ఏదో రకంగా ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా వీసా రాకెట్ కూడా ప్రబలంగా ఉందని పత్రికల ద్వారా తెలుస్తోంది. దానిమీద తగిన విధంగా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**ఉ.** 10.50

**శ్రీ నిమ్మకాయల చినరాజప్ప:** అధ్యక్షా, చట్టబద్ధత లేని వారు కొంతమంది విదేశాలకు పంపిస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారు. ఇందులో గౌరవ సభ్యులు చెప్పినట్లుగానే పశ్చిమ గోదావరి జిల్లాలో 2015, 2016, 2017 మూడు సంవత్సరాలలో కూడా దాదాపుగా 57 కేసులు పెట్టడం జరిగింది. ఇటువంటి కేసులలో దాదాపు 37 మంది వ్యక్తులు మోసపోవడం జరిగింది. ఇప్పటి వరకు సుమారుగా 66 మందిని అరెస్టు చేయడం కూడా జరిగింది. కొంతమంది ఏజెంట్లు వారిని తప్పిస్తామని మోసం చేస్తున్నారు కానీ, ఇటువంటి వాటిని అరికట్టడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## సాంఘిక సంక్షేమ శాఖకు నిధుల కేటాయింపు

ప్రశ్న నెం.10253 (89)

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమ మరియు సాధికారత శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** 2017-18 సంవత్సరానికి సాంఘిక సంక్షేమ శాఖకు కేటాయించిన నిధుల మొత్తం ఎంత ;

**ఆ)** 2014-15, 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరాలలో సాంఘిక సంక్షేమ శాఖకు కేటాయించిన మరియు విడుదల చేసిన నిధుల మొత్తం ఎంత ;

**ఇ)** అందులో నిమిత్తం ఖర్చు చేసిన నిధుల మొత్తం ఎంత?

**గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం, సాధికారత మరియు గిరిజన సంక్షేమం, సాధికారత శాఖ మంత్రి (శ్రీ నక్కా ఆనందబాబు) :**

**అ)** 2017-18 ఆర్థిక సంవత్సరానికి, రూ.3692.43 కోట్ల మొత్తాన్ని కేటాయించి, రూ.2937.93 కోట్లు విడుదల చేయడమయింది, రూ.2491.53 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేయడమయింది.

**ఆ)** - ఇ) (I) 2014-15 ఆర్థిక సంవత్సరానికి, రూ.3287.38 కోట్ల మొత్తాన్ని కేటాయించి, రూ.2531.09 కోట్లు విడుదల చేయడమయింది. రూ.2244.07 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేయడమయింది.

(II) 2015-16 ఆర్థిక సంవత్సరానికి, రూ.2696.58కోట్ల మొత్తాన్ని కేటాయించి, రూ.2339.20 కోట్లు విడుదల చేయడమయింది. రూ.2129.13 కోట్లు వ్యయాన్ని ఖర్చు చేయడమయింది.

(III) 2016-17 ఆర్థిక సంవత్సరానికి, రూ.3446.70 కోట్ల మొత్తాన్ని కేటాయించి, రూ.3136.93 కోట్లు విడుదలచేయడమయింది, రూ.2477.37 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేయడమయింది.

**శ్రీ కత్తి నరసింహా రెడ్డి:** అధ్యక్షా, సాంఘిక సంక్షేమ శాఖకు ఈ నాలుగు సంవత్సరాలలోనే నిధులు బాగా ఇవ్వడమే కాకుండా, బడ్జెట్‌లో కూడా బాగా పెంచారు. అయితే, గత నాలుగు సంవత్సరాలలో విడుదలైనటువంటి రూ.10,945.15కోట్ల రూపాయలలో మంజూరు చేసి విడుదల చేసింది కొంత అయితే విడుదల చేసిన వాటిల్లో కూడా దాదాపుగా రూ.1,603కోట్లను ఖర్చు పెట్టకుండా నిలిపివేశారు. మంజూరైన ఆ నిధులను ఎందువలన ఖర్చు పెట్టలేదో తెలియజేయవలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

అదేవిధంగా, సాంఘిక సంక్షేమ శాఖకు విడుదల చేసిన నిధులను జాతీయ రహదారులకు, ఇతర శాఖలకు బదలాయింపులు చేస్తున్నారని ఒక ప్రచారమయితే జరుగుతోంది. ఆ విధంగా ఈ శాఖ నిధులను ఏమైనా డైవర్ట్

చేశారా? ఆ విధంగా ఉంటే ఎందువల్ల చేశారో, వాటి వివరాలను కూడా తెలియజేయాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ నక్కా ఆనందబాబు:** అధ్యక్షా, ఈ ఆర్థిక సంవత్సరం చివరి క్వార్టరులో ఉండడం వలన తదుపరి సంవత్సరానికి రెన్యూవల్ అవుతూ ఉంటుంది. ఇది వాస్తవం. అంతేగానీ ఈ నిధులను ఎక్కడా ప్రక్కదారి పట్టించడం కానీ, ఇంకొకటి, ఇంకొకటి కానీ ఎప్పుడూ చేయలేదు. అలాగే, గత ప్రభుత్వాలు ఈ నిధులను జాతీయ రహదారులకో, హుస్సేన్‌సాగర్‌కో ఖర్చు పెట్టినట్లుగా మా ప్రభుత్వం ఎప్పుడూ అటువంటి పనిచేయలేదు. చిత్తశుద్ధితో దళితులకు కేటాయించిన నిధులను వారికే ఖర్చు పెడుతున్న ప్రభుత్వం 2014-15లో 88.66 శాతంగా వచ్చింది. అదేవిధంగా ఈ సంవత్సరంలో మార్చి చివరి నెల ఇది. దీనిలో మిగిలినటువంటి చివరి క్వార్టరు, మరునటి సంవత్సరానికి అడ్జస్ట్ అవుతూ ఉంటుంది.

2015-16లో 91.02 శాతం ఈ శాఖ ద్వారా నిధులను ఖర్చు పెట్టడం జరిగింది. అలాగే, 2016-17లో 78.97 శాతం, 2017-18లో ఇప్పటివరకూ 84.81శాతంగా ఖర్చు పెట్టడం జరిగింది. ఫైనల్ క్వార్టర్ బిల్లులు అన్నీ వచ్చేలోపు వంద శాతం కూడా పూర్తవుతుందని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. కాబట్టి, ఎక్కడా ఈ నిధులను ప్రక్కదారి పట్టించడం కానీ, ఇంకొకటి చేసే ఆలోచన లేదు. మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారి నాయకత్వంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఎప్పుడూ చేయని విధంగా ఈ దళితుల సంక్షేమం కోసం వాళ్ళకి కేటాయించిన నిధులను నూరు శాతం వారికే కేటాయించడం జరుగుతోందని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**శ్రీమతి పామిడి శమంతకమణి:** అధ్యక్షా, ఈనాటి ప్రభుత్వంలో దళితులు ఆర్థికంగా చాలావరకు అభివృద్ధి చెందడం జరుగుతోంది. అయితే, ఈ క్రెడిట్ క్యాంపుల ద్వారా గానీ, లేక గ్రామ సభల ద్వారా కానీ ఆర్థికంగా చాలా వరకు అంటే ఆర్థికంగా తక్కువ స్థితిలో ఉన్న వారి పేర్లను ఎంపిక చేసి బ్యాంకుల ద్వారా ఋణాలను పొందడానికి ఒక పథకం ఉన్నది. అయితే, ఆ గ్రామ పంచాయతీలోను, క్రెడిట్‌క్యాంపులలోను నమోదు చేసిన వారి పేర్లను బ్యాంకులకు పంపించిన తరువాత అక్కడ ఉన్నటువంటి మండల ఎం.డి.ఓ. గారు గానీ, ప్రజాప్రతినిధులు గానీ, ప్రపోజ్ చేసిన పేర్ల లిస్టు బ్యాంకులకు వెళ్ళిన తరువాత తారుమారు అవుతున్నది. అక్కడ నుంచి వచ్చే లిస్టులో చాలావరకు వేరే పేర్లు ఉండడం జరుగుతోంది. ఎండిఓ గారిని అడిగినప్పుడు ఆయన చెప్పడం ఏమంటే – మేము పంపిస్తున్నాము కానీ, బ్యాంకులలో అక్కడ మారుస్తున్నారని అన్నారు. తీరా అక్కడకి వెళ్ళి అడిగితే, ఆ బ్యాంకు మేనేజర్లు చెప్పడమేమంటే, మాకు డిపాజిటర్లు ఉంటారు, ఆ డిపాజిటర్లను మేము పోగొట్టుకోలేము కాబట్టి, ఆ డిపాజిటర్లు ప్రపోజ్ చేసిన పేర్లను కూడా మేము ఇవ్వవలసి ఉంటుందని చెప్పడం జరుగుతోంది.

మరొక విషయం ఏమంటే – ఈ ల్యాండ్ పర్చేజింగ్ స్కీం అనేది కూడా మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చేపట్టడం జరిగేది. గతంలో ఏవో కొండలు, గుట్టలు ఇస్తే వాటిని బాగు చేసుకోవడానికే వారి జీవితకాలం సరిపోయేది.

కానీ, ఈనాటి ముఖ్యమంత్రిగారు రాష్ట్రంలో ఆర్థిక వనరులు పెరగాలనే ఉద్దేశంతోనే ఈ ల్యాండ్ పర్చేజింగ్ స్కీం అనేదానిని పెట్టారు. వెట్ ల్యాండ్ అయితే రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు, డ్రై ల్యాండ్ అయితే ఒక ఎకరాకు రూ.3 లక్షల చొప్పున బాగా సాగులో ఉన్న భూమిని కొనుగోలు చేసి దళిత కుటుంబాలకు ఇవ్వవలసిందిగా చెప్పడం జరిగింది. కానీ, ఇవన్నీ జిల్లాల స్థాయిలో ఎక్కడా సరిగ్గా జరగడం లేదు.

అధ్యక్షా, ఇంకొక విషయం. దళితులకు యూనిట్లు ఇస్తున్నారు. అందులో ఒక యూనిట్ అంటే ఒక బర్రె గానీ, లేదా నాలుగు గొర్రెలు గానీ ఇస్తున్నారు. ఈ బర్రెలను హరియాణ రాష్ట్రం ద్వారా కొనుగోలు చేస్తున్నారు. అవి హరియాణ రాష్ట్రం నుండి వచ్చే లోపలే చాలావరకు బర్రెలు చనిపోవడమో, లేదా ఆరోగ్యపరిస్థితి చాలావరకు క్షీణించడమో జరుగుతోంది. అక్కడకు ఒక హరిజనుడు రూ.3,000లు ఖర్చుపెట్టుకుని వెళ్ళి బర్రెలను తెచ్చుకునే బదులు దగ్గరగాను, ప్రక్కన ఉన్న తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి తెచ్చుకోవచ్చు కదా! అవే బర్రెలు, అవే పాలు. కాబట్టి, ఈ రాష్ట్రాల నుంచి బర్రెలను కొనుగోలు చేయవలసిందిగా తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్:** అధ్యక్షా, తమ ద్వారా ఒక సజెషన్ తెలియజేయదలచుకున్నాను. నేషనలైజ్ అయిన తరువాత బ్యాంకులు ప్రజల వద్దకు వెళ్ళాలనేది ప్రభుత్వం ఉద్దేశం. కానీ, బ్యాంకర్ల వైఖరిలో పేదప్రజల పట్ల ఎలాంటి సానుభూతి లేదు. నీరవ్ మోదీ లాంటి బ్యాంకు కుంభకోణాలు చేసేవారికి వేలకు వేల కోట్ల రూపాయలు ఇస్తారు. కానీ, వాళ్ళకే కేంద్ర ప్రభుత్వాలు కూడా మద్దతు పలుకుతాయి. బ్యాంకింగ్ వ్యవస్థ అంతా కూడా కేంద్రానిదే. ఆ నీరవ్ మోదీ లాంటి వాళ్ళు దాదాపు రూ.30,000కోట్లు దోచుకుంటే, వారి మీద ఎటువంటి చర్యలూ ఉండవు. అదే పేదవాళ్ళు ఒక బీసీనో, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఋణాలు ఇవ్వవలసి వస్తే, ఆ ఋణాలు ఇవ్వమన్నా బ్యాంకులు ఇవ్వవు. ప్రభుత్వం మంజూరు చేసినా బ్యాంకులు పేదవాళ్ళని 10సార్లు వాళ్ళ చుట్టూ తిప్పుకుంటాయి. చివరికి ఋణాలను మంజూరు చేసినందుకు చెక్కు వేసినందుకు ప్రభుత్వాన్ని, బ్యాంకుల వాళ్ళని ప్రజలు తిట్టడం తప్పితే, ఏ విధమైన ఉపయోగం ఉండదు. అందువలన ఈ బ్యాంకింగు వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ముఖ్యంగా పేదవారి కోసం తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను. ముఖ్యంగా స్త్రీ బ్యాంకు అని ఒకటి ఉంది. ఇది మన ప్రభుత్వ కార్యదర్శి రావత్ గారికి కూడా తెలుసు. అటువంటి ఒక దళిత బ్యాంకును ఒకదానిని నెలకొల్పి ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను దానిలోకి పూల్ చేసి, ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. అలాగే, ఎస్సీ కార్పోరేషన్ వద్దు. ఎందుకంటే అది ఫెయిల్యూర్ వ్యవస్థ, సక్రమంగా పనిచేయడం లేదు. అసలు ఆ కార్పొరేషన్ సవ్యంగా లేదు. అలా కాకుండా, ఒక డిఫరెంట్ బ్యాంకింగ్ వ్యవస్థను లేదా కో-ఆపరేటివ్ బ్యాంకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎస్సీల వరకు ఋణాలను ఇచ్చే ఏర్పాటు చేయకపోతే ప్రస్తుతం ఉన్నటువంటి బ్యాంకింగ్ వ్యవస్థ పేదవారికోసం పనిచేయదు. అందువల్ల ప్రభుత్వం దీనికి సంబంధించి ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

అధ్యక్షా, అదేవిధంగా ఈ ల్యాండ్ పర్చేజింగ్ స్కీములో ఒక ప్రత్యేక యంత్రాంగం ఉంది. ఇప్పుడు ఉన్న రెవెన్యూ వ్యవస్థ సరిపోదు. ఇప్పుడు ఉన్న వాళ్ళు వెరిఫై చేయరు, వెరిఫై చేయాలంటే లంచాలు, ఆ ప్రాసెస్ అంతా

అవ్వాలంటే బాగా ఆలస్యమవుతోంది. తద్వారా ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తోంది. ఇది మంచి పని చేస్తూ చెడ్డపేరు తెచ్చుకోవడం అవుతోంది. అందువల్ల వీటిల్లో రిటైర్డ్ అధికారులను, లేకపోతే ఎన్‌జీవోలను ఈ బ్యాంకులలో నియమించి, ఆ ల్యాండ్ పర్చేజింగ్ స్కీమును భారీస్థాయిలో అమలుచేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. దాని ద్వారా దళిత బ్యాంకింగ్ ఒకటి, ల్యాండ్ పర్చేజింగ్ స్కీం మీద ప్రభుత్వం ఎక్కువగా దృష్టి పెట్టవలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ రాము సూర్యారావు (మైకు లేకుండా):** అధ్యక్షా, దయచేసి ఈ పేదవారి సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయవలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ నక్కా ఆనందబాబు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు ఇచ్చిన సూచనలు, సలహాలు కొంతవరకు వాస్తవమే. మండల స్థాయిలో సెలెక్షన్ కమిటీ సెలెక్ట్ చేసి పంపినటువంటి వారి పేర్లలో బ్యాంకుల వాళ్ళు ఇబ్బంది పెడుతున్న మాట వాస్తవం. కానీ, ఎక్కడికక్కడే మా ప్రభుత్వం శ్రీ నారా చంద్రబాబు నాయుడిగారి ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బిసి గానీ, జిల్లా స్థాయిలో డిఎల్‌బిసిలు జరిపి బ్యాంకర్ల పైన మానిటర్ చేసుకుంటూ వారిని మోటివేట్ చేస్తూ ముందుకెళ్తున్నాం. అయినా కూడా బ్యాంకింగ్ వ్యవస్థలో లోపాలు ఉన్నాయి. వాళ్ళు పూర్తిగా సహకరించని మాట వాస్తవం. ఇవే కాకుండా బ్యాంకు లింకేజి లేకుండా ఎన్ఎస్ఎఫ్‌డిసి (National Scheduled Castes Finance and Development Corporation) గానీ, ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి (National Safai Karamcharis Finance & Development Corporation) గానీ, ఇతర లోన్లకు సంబంధించి అంటే గతంలో డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వ హయాములో రద్దు చేయబడినటువంటి స్కీములను మరళా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో వాటిని పునరుద్ధరించి అందరికీ అందిస్తున్నాము.

అధ్యక్షా, అదేవిధంగా ఈ ల్యాండ్ పర్చేజింగ్ స్కీములో కూడా గతంలో మూడు లక్షల రూపాయలు ఉన్నటువంటి ఈస్కీము క్రింద ఈనాడు రూ.15 లక్షల రూపాయల వరకు కూడా చెల్లించి, కొనుగోలు చేయమని చెప్పి ఆదేశాలు ఇచ్చాము. ఇక్కడ ఈ సెలెక్షన్ ఆఫ్ ప్రాసెస్‌లో కొంత ఆలస్యం జరుగుతోంది. స్థానికంగా ఉన్నటువంటి జిల్లా కలెక్టరు గారు, ఆర్‌డీఓ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు లబ్ధిదారులను మరియు ఈ భూములను కూడా ఎంపిక చేయవలసిన అవసరం ఉంది. దీనిని త్వరితగతిన చేయడానికి చర్యలు తీసుకుంటున్నాము. తప్పనిసరిగా ఈ ల్యాండ్ పర్చేజింగ్ స్కీమును కూడా ఈ ప్రభుత్వ హయాములోనే అమలుచేస్తామని ముఖ్యమంత్రిగారు కూడా పదేపదే చెబుతున్నారు. పేదవారికి, భూమి లేని నిరుపేదలకు ముఖ్యంగా భూమిని అందించడానికి ఈ స్కీమును ముందుకు తీసుకువెళ్ళమని ముఖ్యమంత్రిగారు కూడా చెప్పారు. తప్పనిసరిగా వీటిని అమలుచేస్తాము. అదేవిధంగా గౌరవ సభ్యులు చెప్పినట్లుగానే ఈ దళిత బ్యాంకును కూడా ఏర్పాటు చేస్తే బాగుండేది కానీ, బడ్జెట్‌కు ముందుగా ఇటువంటి సూచనలు వస్తే ఈ బడ్జెట్ అలొకేషన్స్‌లోనే కొంత ప్లాన్ చేసి ఉంటే బాగుండేది. ఏది ఏమైనా సరే ఈ అంశాలను ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్ళి, రెవ్యూ చేసి తగిన చర్యలు తీసుకుంటామని తమ ద్వారా గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను.

ఉ.11:00

MR. CHAIRMAN: Question No.10274, Minister for Social Welfare and Tribal Welfare.

<u>దళితుల హక్కులను కాపాడుట</u>

ప్రశ్న నెం. 10274(90)

**సర్వశ్రీ బొడ్డు నాగేశ్వరరావు, విటపు బాలసుబ్రమ్మణ్యం, రాము సూర్యారావు, ఎం.ఎల్.సి.లు.,**

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం మరియు సాధికారత మరియు గిరిజన సంక్షేమం మరియు సాధికారత శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) గుంటూరు జిల్లా గొట్టిపాడులో దళితులపై దాడులు మరియు సాంఘిక బహిష్కరణ లాంటివి ఏమైనా చోటు చేసుకున్నాయా;

ఆ) ఈ విషయం పై ప్రభుత్వం వద్ద సమగ్ర నివేదిక ఏదైనా ఉన్నదా;

ఇ) ఈ విషయంపై తీసుకున్న చర్య ఏమిటి;

ఈ) దళితుల హక్కులను కాపాడటానికి తీసుకున్న చర్యలు ఏమిటి?

**గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం మరియు సాధికారత, గిరిజన సంక్షేమం మరియు సాధికారత శాఖ మంత్రి (శ్రీ నక్కా ఆనంద బాబు):**

**అ)** అవునండీ.

**ఆ)** అవునండీ.

**ఇ)** గొట్టిపాడు పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ ప్రకారం 341, 324, 143, 506 ఐసిసి మరియు సెక్షన్. 3(జి) (ఆర్) (ఎస్) మరియు 3(ఐఐ) సెక్షన్ ఎస్‌సి / ఎస్‌టి (పిఓఎ) చట్టం క్రింద నేరం నెం. 1/2018 గా ఒక కేసు నమోదు చేయడమయింది. 01-01-2018 తేదీన గొట్టిపాడు గ్రామాన్ని జిల్లా కలెక్టరు మరియు గుంటూరు పోలీస్ సూపరింటెండెంట్ సందర్శించారు. 31-03-2018 తేదీన గౌరవనీయులైన జాతీయ ఎస్‌సి కమీషన్ సభ్యుడు కూడా సందర్శించారు.

**ఈ)** గుంటూరు జిల్లా కలెక్టరు గారి ద్వారా 7 మంది బాధితులకు 25 శాతం ఆర్థిక సహాయం మంజూరు చేసి చెల్లించడమయింది.

గ్రామంలో శాంతి భద్రతలను నిర్వహించడానికి 01-01-2018 నుండి 31-01-2018 వరకు సి.ఆర్.పి.సి 144 సెక్షన్ క్రింద నిషేధిత ఉత్తర్వులను విధించడమైనది.

ఆ గ్రామంలో 01-01-2018 నుండి ఇప్పటివరకు 8 మంది కానిస్టేబుళ్లలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేయడమైనది.

**శ్రీ బొడ్డు నాగేశ్వరరావు:** అధ్యక్షా, ఇది చాలా విచిత్రమైన పరిస్థితి, కృష్ణా, గుంటూరు జిల్లాలు రెండూ రాజధాని కేంద్రంలో ఉన్నాయి. ఇప్పటికి కూడా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం పెద్ద గొట్టిపాడులో అనవసరంగా పెద్ద ఎత్తున దళితుల మీద దాడి జరిగిన మాట వాస్తవం. దానిని అంగీకరించినందుకు చాలా సంతోషం. ఏదైనా సమగ్ర నివేదిక ఉన్నదా అని అడిగాను. నివేదిక ఇప్పించమని కూడా అడుగుతున్నాము.

మూడవది గొట్టిపాడు పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ పెట్టి కేసు నమోదు చేశామన్నారు. ఎంత మందిని అరెస్టు చేశారో పేర్కొనలేదు. అంటే ఈ ప్రభుత్వం దళితులకు ఉపశమనం కలిగిస్తుంది తప్ప, ఆ దాడులకు పాల్పడిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నాను. ఖచ్చితంగా దానికి సమాధానం చెప్పవలసిన అవసరం కూడా ఉంది. కాబట్టి కేసు నమోదు చేస్తే పని అయిపోతుందా? ప్రశ్నలకు సమాధానంగా అవునండీ, అవునండీ అని చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదు చేశారు కానీ అరెస్టులు లేవు. దానితోపాటు ఎస్సీ జాతీయ కమీషన్ సభ్యుడు అక్కడకు వెళ్లిన తరువాతే ఈ చర్యలు తీసుకున్న పరిస్థితి, పెత్తందారులను కాపాడే పరిస్థితి వచ్చింది. ఖచ్చితంగా ఆ దాడికి పాల్పడినవారిని అరెస్టు చేయాలని మీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. ఏడుగురు బాధితులకు సహాయం చేశామని మంత్రి గారు చెప్పారు చాలా సంతోషం. అదే సందర్భంలో శాంతి భద్రతల నిర్వహణ కోసం ఆ గ్రామంలో పికెట్ పెట్టారు. ఆ గ్రామంలో వారిని ఎవరూ వెళ్లి పలకరించకుండా, వెళ్లే వారు ఎవరైనా ఉంటే వారిని అప్రజాస్వామిక వాదులుగా వెంటనే అరెస్టు చేస్తూ, శాంతి భద్రతలు కాపాడుతున్నామని చెబుతున్నారు. దీనిని నేను చాలా తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ దాడికి ఎవరైతే కారకులో వారిని వెంటనే అరెస్టు చేయాలని ఈ సభ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ రాము సూర్యారావు:** అధ్యక్షా, దళిత పక్షపాతి అని మన ప్రియతమ ముఖ్యమంత్రి గారు ఒక పేరు సంపాదించుకున్నారు. ఆయన దళితుల్లోని రెండు వర్గాలకు న్యాయం చేకూరాలని అన్ని చర్యలు తీసుకుంటున్నారు. వారికి ఇచ్చే పదవుల విషయంలో గానీ, వారి సౌకర్యాల విషయంలో గానీ దయచేసి మంత్రి గారు అలాగే మిగిలిన వారు కూడా ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి. 70 సంవత్సరాల భారతదేశ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ఇలాంటి సంఘటనలు జరగడం చాలా బాధకరమైన విషయం. వారికి తగిన న్యాయం చేకూర్చాలని మీ ద్వారా మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ కత్తి నరసింహా రెడ్డి:** అధ్యక్షా, ఆధునిక సమాజంలో కూడా దళితులపై దాడులు, వివక్షత ఉండడం చాలా బాధాకరం. దాని వలన సమాజం అభివృద్ధి కాకుండా, తిరోగమనంగా భావించాల్సిన అవసరం ఉంది. గుంటూరు జిల్లాలోని గొట్టిపాడు, తూర్పు గోదావరి జిల్లాలోని గరగపర్రు, శ్రీకాకుళం జిల్లా లక్ష్మీపురంలో జరిగిన సంఘటనలపై ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునారావృతం కాకుండా ఉంటాయని మీ ద్వారా మంత్రి గారికి తెలియజేస్తున్నాను.

**శ్రీ నక్కా ఆనంద బాబు:** అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీల మీద జరిగే అత్యాచారాలు, దౌర్జన్యాలను నిరోధించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. భారతదేశంలోనే అత్యాచారాలను, దౌర్జన్యాలను తొలగించడానికి మొట్టమొదటిగా ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఏర్పాటు చేసింది తెలుగుదేశం ప్రభుత్వం నారా చంద్రబాబు గారి నాయకత్వంలోనే అని గుర్తు పెట్టుకోవాలి. మేము ఎక్కడా కూడా బేర్ చేయము. గొట్టిపాడులో గానీ, గరగపర్రులో గానీ జరిగిన సంఘటనలు చాలా దురదృష్టకరం. ఇక్కడ ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేని సంఘటన. అక్కడ ఎవరైతే దోషుగా నిర్ధారించబడ్డారో, ఎవరైతే ఆరోపణలు ఎదుర్కొటున్నారో వారందరినీ అరెస్టు చేయడం జరిగింది. అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుంది కానీ, ఎవరినీ అక్కడికి వెళ్లనీయకుండా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వీటన్నింటినీ గౌరవ సభ్యులు గుర్తుంచుకోవాలి. అక్కడ ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుంటే, కొంత మంది ఆ సంఘటనలను రెచ్చగొట్టే విధాలుగా వారి రాజకీయ విధానాలను నిరూపించడం, వారి హక్కులను ఉల్లంఘించే చర్యలు ఇక్కడ చెయ్యలేదు. తప్పకుండా ఇటువంటి కార్యక్రమాలు పునరావృతం కాకుండా ఈ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. అక్కడ శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి. ఇంకా ఏమైనా చర్యలు తీసుకోవాలన్నా చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటామని గౌరవ సభ్యులకు మీ ద్వారా తెలియజేస్తున్నాను.

**MR. CHAIRMAN**: Question No.10444, Minister for Roads and Buildings.

<u>కావలి పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి</u>

ప్రశ్న నెం. 10444(82)

**శ్రీ బీద రవిచంద్ర, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో రైల్వే వంతెన నిర్మాణాన్ని ఎప్పటిలోగా పూర్తి చేస్తారు;

ఆ) వంతెన నిర్మాణంలో భూమిని కోల్పోయిన వారికి ఎప్పటిలోగా పరిహారం చెల్లిస్తారు?

**గౌరవనీయులైన రోడ్లు, భవనాల శాఖ మంత్రి (శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడు):**

అ) వీలైనంత త్వరగా కావలిలో ఆర్.ఓ.బి నిర్మాణాన్ని పూర్తిచేయడమవుతుంది.

ఆ) భూమి సేకరణ అధికారి భూసేకరణ అవార్డును జారీ చేసిన తర్వాత ఆర్.ఓ.బి నిర్మాణంలో భూమిని కోల్పోయిన వారికి నష్ట పరిహారం చెల్లించడమవుతుంది.

ఉ.11.10

**శ్రీ బీద రవిచంద్ర (నామినేటెడ్):** అధ్యక్షా, దీని విషయంలో భూములకు సంబంధించి, అంటే వాస్తవానికి ల్యాండ్ అక్విజిషన్‌కు అయ్యేది రూ.5.5 కోట్లు. ఇప్పుడు మారిన రేట్ల ప్రకారం రూ.16.5 కోట్లు వచ్చింది. దీని మీద రెవిన్యూ వారేమో రూ.11 కోట్లు పెరిగింది కాబట్టి దాని మీద క్లియర్‌గా ఇన్‌స్ట్రక్షన్స్ కావాలని అడుగుతున్నారు. అప్పటికీ ల్యాండ్ అక్విజిషన్ అవార్డు పాస్ చేసేందుకు జిల్లా కలెక్టర్ గారు, జాయింట్ కలెక్టర్ గారు కూడా ఇన్స్పెక్ట్ చేసి, రైతులు, అక్కడున్న వ్యాపారులందరితో మాట్లాడి ఫైనలైజ్ చేశారు. ఇది 2009లో ప్రారంభమయ్యింది. మామూలుగా రైల్వే వాళ్లు నిర్మాణం చేపడితే ఆలస్యమౌతుంటుంది. కానీ, ఇక్కడేమో రైల్వే వాళ్లు నిర్మాణం పూర్తి చేసి రెండున్నర సంవత్సరాలు అయిపోయింది. రెండున్నర సంవత్సరాల క్రితమే రైల్వే వాళ్లు పూర్తి చేసారు. ఇప్పుడు ముగ్గురు ప్రిన్సిపల్ సెక్రటరీలు మారారు. ప్రతి అధికారి మారినప్పుడల్లా రిమార్క్స్ అడుగుతూనే ఉంటారు. గతంలో మా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా, ఆర్ అండ్ బి శాఖా మంత్రిగా శిద్ధా రాఘవరావు గారు ఉన్నప్పుడు వారు కూడా చెప్పారు, రిమార్క్స్ అడిగారు. అన్నీ అప్పుడు సబ్మిట్ చేశాము. మళ్లీ అయ్యన్నపాత్రుడు గారు వచ్చాక ఆయన దృష్టికి కూడా తీసుకువెళితే ఆయన కూడా చెప్పారు. ఇన్నిసార్లు డిపార్టుమెంట్‌లో అధికారులు మారినప్పుడల్లా చెబుతున్నాము. కానీ, ఎందుకు ఆ వివరాలు క్రింద నుండి అవసరమౌతాయో తెలియడం లేదు. సంవత్సరాలు జరిపేస్తున్నారు. 2016 జనవరి, 03వ తేదీన ముఖ్యమంత్రి గారు నెల్లూరు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు, ఆరు నెలల్లో ఆర్‌ఓబి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. 2016, జనవరి, 03న ఆ మాట చెప్పారు. అప్పటి నుండి క్రిందకి, పైకి తిప్పుతూనే ఉన్నారు. నేను అధికారుల్ని కూడా కలిశాను. రెండున్నర సంవత్సరాలు గడిచినా వారికి డౌట్‌లు ఎందుకు వస్తున్నాయో తెలియదు. ఇప్పటికే రెండున్నర సంవత్సరాలు గడుస్తోంది కాబట్టి, దాన్ని త్వరగా పూర్తి చేయమని మీ ద్వారా మంత్రి గార్ని కోరుతున్నాను.

**MR.CHAIRMAN:** Minister garu, this pertains to Kavali only.

**శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడు:** అధ్యక్షా, అధికారుల తాలూకు నిర్లక్ష్యానికి ఈ ఆర్‌ఓబి ఒక ఉదాహరణ. రెవిన్యూ అధికారులు, ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యానికి ఇది ఒక ఉదాహరణగా నేను మనవి చేస్తున్నాను. అధ్యక్షా, ఈ విషయాన్ని ఒకసారి పరిశీలిద్దాము. దీంట్లో చూస్తే కావలి పట్టణంలో ఆర్‌ఓబి కొరకు తేది.11.02.2009లో అంటే 9 సంవత్సరాల క్రితం ఎగ్జిక్యూటివ్ శాంక్షన్ ఇవ్వడం జరిగింది. అంటే 9 సంవత్సరాల క్రితం. అప్పుడు వేసిన ఎస్టిమేషన్స్ ఏమిటంటే – రూ.31 కోట్లతో ఎస్టిమేషన్ తయారు చేశారు. దీంట్లో రూ.5.50 కోట్లు ల్యాండ్ అక్విజిషన్‌కు ఖర్చు అవుతుందని ఒక ఎస్టిమేషన్ తయారు చేశారు. దీనికి 2009లో అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చారు. టెక్నికల్ శాంక్షన్ 2012లో ఇచ్చారు. 2012కి, 2009కి మధ్య ఎంత గ్యాప్ ఉంది అధ్యక్షా? పెద్ద నిర్లక్ష్యం. చాలా బాధాకరమైన విషయం ఇది. దీనికి టెక్నికల్ శాంక్షన్ ఇచ్చిన తరువాత భవాని కన్‌స్ట్రక్షన్స్ నెల్లూరు వారికి 6 శాతం లెస్‌తో టెండరు దక్కింది. పని పూర్తి చేయాలని ఒక అగ్రిమెంట్ వ్రాసుకున్నారు. 2014కి పని పూర్తవ్వాలనేది అగ్రిమెంట్‌లో ఉన్న

కండీషన్. పాపం కాంట్రాక్టరు గారు పనులు స్టార్ట్ చేశారు. ట్రాఫిక్‌ని డైవర్ట్ చేయడం కోసం బైపాస్ వేశాడు. బైపాస్‌కు వెళ్లిన తరువాత, భూసేకరణ జరగలేదని చెప్పి అధికారుల చుట్టూ తిరిగి తిరిగి విసుగెత్తి నాకు ఈ కాంట్రాక్టు వద్దు, క్లోజ్ చేసేయ్యమని లెటర్ పెట్టుకున్నాడు.

**మిస్టర్ ఛైర్మన్:** ఏం చేద్దాము?

**శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడు:** ఆ విధంగా లెటర్ పెట్టుకుంటే, ప్రభుత్వం అప్పుడు ఏం చేసిందంటే – కాంట్రాక్టు క్లోజ్ చేసింది. తరువాత అక్కడ లోకల్‌గా ఉన్న నెల్లూరు ఎస్.ఇ. గారు, సీఈ గారికి ఒక లెటర్ వ్రాశారు. ఏమని రాశారంటే – 2008–2009లో అప్పటి రేట్ల ప్రకారం ఎస్టిమేషన్ వేశాము, ఇప్పుడు మనం 2014కు వచ్చేశాము, అందువల్ల, ఎస్ఎస్ఆర్ రేట్స్ మారిపోయాయి, అందుచేత, రేటు పెరుగుతోంది కాబట్టి, ప్రభుత్వం మళ్లీ కొత్త ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం టెక్నికల్ శాంక్షన్ ఇవ్వాలని వారు కోరడం జరిగింది. దాని ప్రకారం చూస్తే, రూ.31 కోట్ల నుండి, ఇప్పుడున్న ప్రస్తుతం ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం రూ.43 కోట్లకు పెరిగింది. ఎస్.ఇ. గారు సి.ఇ. గారికి ఎప్పుడు పంపించారంటే – రివైజ్డ్ శాంక్షన్స్ కోసం నెల్లూరు ఎస్.ఇ. గారు తేది.03.11.2016న పంపారు. పక్కనే ఉన్న నెల్లూరు ఎస్.ఇ. నుండి మన రాష్ట్రానికి అంటే హెడ్‌క్వార్టర్స్‌కు రావడానికి 2016లో పంపిస్తే, ఇప్పటివరకు ప్రభుత్వం శాంక్షన్ ఇవ్వలేదు. ప్రభుత్వమంటే ఎవరు అధ్యక్షా? నేనే కదా.

**మిస్టర్ ఛైర్మన్:** మరి మీరే యాక్షన్ తీసుకోవాలి.

**శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడు:** అదే చెప్పేది వినండి సార్. పొరపాటంతా అక్కడే ఉంది. అందుకే ఫ్రీగా మాట్లాడుతున్నాను. ప్రభుత్వమంటే నాకు ఆ ఫైలు రావాలి కదా? 2016లో ఎస్.ఈ. గారి నుండి సీ.ఈ.కి వస్తే, ఇప్పటివరకు మినిస్టర్ దగ్గరకు ఫైల్ రాలేదు. ఇప్పుడు మినిస్టర్‌కు ఫైలు రావాలి, అప్రూవల్ ఇవ్వాలి, ఫైనాన్స్ డిపార్టుమెంటుకు వెళ్లాలి, వాళ్లు అప్రూవల్ ఇవ్వాలి, తరువాత టెండర్స్ పిలవాలి, వర్క్స్ స్టార్ట్ చెయ్యాలి. అందుచేత, మిమ్మల్ని కోరేదేమంటే – ఈవిధంగా చాలా డిలే జరుగుతోంది. రెవెన్యూ డిపార్టుమెంటు, ఆర్ అండ్ బి డిపార్టుమెంటులో డిలే అవుతున్నటువంటి సందర్భాలు చాలా ఉన్నాయి. ఇన్నిసార్లు అంటే 15 రోజులకు ఒకసారి రెవ్యూ పెట్టినా కూడా ఫైల్స్ కదలడం లేదు. అందుచేత, తమరిని నేను రిక్వెస్టు చేసేదేమంటే దీనికి ఎక్కడో ఒకచోట ఫుల్‌స్టాప్ పెట్టాలి. ఎందుచేతనంటే అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఖజానాపైన కోట్లాది రూపాయల భారం పడుతోంది.

**మిస్టర్ ఛైర్మన్:** అది మీ పనే కదా.

**శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడు:** అంతే అధ్యక్షా. కానీ, తమరిని నేను రిక్వెస్ట్ చేసేదేమంటే – తమకున్న అధికారాలను ఉపయోగించి, ఇటువంటి కేసుల మీద అంటే ఇదొక ఉదాహరణ. ఒక ఎంక్వైరీ వేసి, దీని మీద రిపోర్టు తీసుకుని, ఆ ఎంక్వైరీలో ఎవరు బాధ్యులో తెలిస్తే అటువంటి అధికారుల మీద యాక్షన్ తీసుకుని రికవరీ చేస్తేనే తప్ప ఫలితం రాదు.

**మిస్టర్ చైర్మన్:** కమిటీ వేస్తారా?

**శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడు:** మీరే వెయ్యాలి అధ్యక్షా. నేను కాదు.

**మిస్టర్ చైర్మన్:** మీరు అడిగితే వేస్తాను.

**శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడు:** వెయ్యండి.

**MR.CHAIRMAN:** As you like it.

SRI.CH. AYYANNAPATRUDU: As a Minister, నేను ప్రపోజ్ చేస్తున్నాను. కమిటీ వెయ్యండి.

**మిస్టర్ చైర్మన్:** గవర్నమెంట్ ఇష్టపడితే నాకు అభ్యంతరం లేదు.

**శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడు:** అధ్యక్షా, లేకపోతే హౌస్ కమిటీ వేయండి. మీకున్న అధికారాలను ఉపయోగించి హౌస్ కమిటీ వేయండి సార్. మీకు అధికారాలున్నాయి. వేయండి సార్. ఎక్కడా భయం లేకుండా ఇంత డబ్బు వేస్ట్ అవుతుంటే ఎలా?

**మిస్టర్ చైర్మన్:** ఓ.కె. దీని మీద కమిటీ వేస్తున్నాను. Thank you. Now, we will take up Short Notice Questions. సభ్యులు శ్రీ కరణం బలరామకృష్ణమూర్తి గారూ

**శ్రీ కరణం బలరామకృష్ణమూర్తి (శాసనసభా నియోజకవర్గం):** మినిస్టర్ గార్ని చెప్పమనండి. దాంట్లో క్లారిఫికేషన్స్ ఉంటే అడుగుతాను.

**మిస్టర్ చైర్మన్:** మీ ఇష్టం. ఎందుకంటే నేను ప్రొసీజర్ చెబుతున్నాను. మినిస్టర్ గారూ... మీరే చెప్పండి.

## చెక్ డ్యామ్‌ల నిర్మాణం

స్వల్ప వ్యవధి ప్రశ్న నెం.100 (90-ఎ)

**శ్రీ కరణం బలరామ కృష్ణ మూర్తి, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా;

అ) ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ, చిలకలేరు వాగులపై చెక్ డ్యామ్‌ల నిర్మాణ ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించినదా;

ఆ) అయినచో, ఇప్పటికే మంజూరైన, ఇంకనూ మంజూరు కావాల్సిన చెక్‌డ్యామ్‌ల, వివరములు ;

ఇ) ఆ విషయంలో తీసుకున్న చర్యలు ఏమి?

గౌరవనీయులైన జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు) :

అ) అవునండీ.

ఆ) ఇప్పటికే మంజూరు అయిన చెక్‌డామ్‌ల వివరాలుః

<u>గుండ్లకమ్మ నదిపై</u>

1) పెద్దనాగులవరం – ముగింపు దశలో ఉంది.

2) దారి మడుగు – చేపట్టడం జరగలేదు.

3) కీర్తిపాడు – డిజైన్లను ఖరారు చేయాల్సి ఉంది.

4) ।ర్వానుప్పలపాడు – డిజైన్లను ఖరారు చేయాల్సి ఉంది.

5) రామాపురం – జిల్లా కలెక్టరు గారు నీరు–చెట్టు క్రింద మంజూరు చేశారు.

<u>చిలకలేరు వాగుపై</u>

1) పోలవరం – పూర్తి అయినది.

2) కమ్మవారి పాలెం – పూర్తి అయినది.

3) వేములబండ – పూర్తి అయినది.

ఇంకనూ మంజూరు చేయవలసినవి ఏమి లేవు.

గుండ్లకమ్మ నది. చిలకలేరు వాగులపై ఎ.పి.ఎస్.ఎ.సి. ఎటువంటి చెక్‌డామ్‌లను నిర్మించలేదు. అందువల్ల ప్రతిపాదనలేవీ లేవు.

ఇ) మంజూరు చేయబడిన చెక్‌డామ్‌లను త్వరగా పూర్తిచేయుటకు అన్ని చర్యలను చేపట్టడమయినది.

**శ్రీ కరణం బలరామకృష్ణమూర్తి:** అధ్యక్షా, మంత్రి గారు చెప్పిన సమాధానంలో ప్రపోజల్స్ ఏమీ లేవని చెబుతున్నారు గాని, అది కరెక్టు కాదు. ఎందుకంటే, ప్రపోజల్స్ వచ్చాయి గానీ గవర్నమెంట్‌లో పెండింగులో ఉన్నాయి. ఈ విషయాన్ని డిపార్టుమెంటు వాళ్లు మంత్రి గారి దృష్టికి ఎందుకు తీసుకురాలేదో నాకు అర్థం కావడం లేదు. ముందు గుండ్లకమ్మ డ్యాంకు సంబంధించి చర్చలోకి వద్దాము. ప్రపోజల్స్ చాలా రావడం జరిగింది. మన ముఖ్యమంత్రి గారు ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ ప్రాజెక్టు విజిట్‌కు వచ్చినప్పుడు, వారితోబాటు మన మంత్రివర్యులు కూడా ఉన్నారు. ఆ సమయంలో వారు రెండు చెక్‌డ్యాంలు ఇస్తామని ప్రామిస్ చేసి శాంక్షన్ చేయడం కూడా జరిగింది. అయితే,

దాదాపు మూడు సంవత్సరాలు దాటిపోయింది. కానీ, ఇంతవరకు డిజైన్లు ఖరారు కాలేదంటున్నారు. ముఖ్యమంత్రి గారు, మంత్రి గారు ఇద్దరూ ప్రామిస్ చేసి మూడున్నర సంవత్సరాలు అవుతోంది. ఇంతవరకు ఆ డిజైన్లు ఎందుకు ఫైనలైజ్ చేయలేకపోతున్నారో అర్థం కావడం లేదు.

రెండవదేమంటే – గుండ్లకమ్మ ప్రాజెక్టుని డౌన్‌స్ట్రీమ్, అప్‌స్ట్రీమ్ అని రెండు పార్ట్‌లుగా విభజించుకోవాలి. డౌన్‌స్ట్రీమ్‌లోకి వచ్చేటప్పటికి కీర్తిపాడు దగ్గర ఒకటి, ।ర్వానుప్పలపాడు దగ్గర ఒకటి చొప్పున చెక్‌డ్యాంలు ఉన్నాయి. ఈ రెండుచోట్లా అంతకుముందు నీళ్లు క్రిందకు వెళ్లిపోతూ ఉండేవి, అప్పుడు కోస్తా అంతటా నీళ్లు ఉండేవి. ఈ డ్యాం కట్టిన తరువాత, డ్రింకింగ్ వాటర్‌కు పెద్ద సమస్య అయిపోయింది. దాని మీదున్న లిఫ్ట్ ఇరిగేషన్స్‌కు కూడా నీరు రాని పరిస్థితి అయిపోయింది. దానివల్ల చెక్‌డ్యామ్స్ ఏర్పాటు ప్రాధాన్యత గురించి మేం చెప్పడంతో వారు కూడా అంగీకరించడం జరిగింది. అందుకు వారికి ధన్యవాదాలు చెబుతున్నాను. ఒకేసారి వెంటనే ఈ చెక్‌డ్యామ్‌లని టేకప్ చేయలేకపోతున్నారు కాబట్టి, గుండ్లకమ్మ డ్యాం మెయిన్ గేట్ల నుండి నీళ్లివ్వాల్సిన పరిస్థితి వస్తోంది. దాని ఇంపార్టెన్స్‌ని దృష్టిలో పెట్టుకుని, ఎప్పటిలోపు ఈ చెక్‌డ్యాములను పూర్తి చేస్తారో చెప్పవలసిందిగా మీ ద్వారా నేను మంత్రి గార్ని కోరుతున్నాను.

ఉ.11.20

అధ్యక్షా, దీనితోపాటు అప్‌స్ట్రీమ్‌లో వెలమవానిపాలెం దగ్గర ఒక చెక్‌డ్యాం నిర్మాణంలో ఉన్నది. అది భవనాశి ట్యాంకుకు నీరు వెళ్లే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. చెక్‌డ్యాం పూర్తిచేశారు గానీ, లీడింగ్ ఛానెల్ ఏదైతే ఉన్నదో దానిని పూర్తి చేయలేదు. 6 సంవత్సరాలు అయింది కానీ, ఇప్పటికీ పూర్తిచేయలేదు. కాంట్రాక్టరు ఏమైపోయాడో తెలియదు. పనులు నత్తనడకన నడుస్తున్నాయి. అదేమంటే, కోర్టు డిస్ప్యూట్ ఉందని ఒక మాట చెబుతున్నారు. దీనివల్ల ఒరిజినల్ ఆయకట్టు కూడా సఫర్ అవుతోంది. భవనాశి చెరువు కింద ఉన్న దాదాపు 6 వేల ఎకరాల ఆయకట్టు సాగులో ఉన్నది. ఇప్పుడు అన్నీ అబ్‌స్ట్రక్షన్స్ వచ్చి నీరు వచ్చే సోర్సెస్ అన్నీ block అయిపోయాయి. సాగర్ నీరు ఇవ్వాల్సిన అవసరం ఉందని మంత్రిగారిని తమ ద్వారా గుర్తుచేస్తున్నాను. వీటితోపాటు అప్‌స్ట్రీమ్‌లో కట్టవలసినవి చాలా ఉన్నాయి. ప్రభుత్వానికి నేను కూడా రిప్రజెంటేషన్ ఇచ్చాను. ముఖ్యమంత్రిగారికి అలాగే, జలవనరుల శాఖ మంత్రిగారికి కూడా ఇచ్చాను. వాటిని పరిశీలన చేయవలసిందిగా కోరుతున్నాను. అనుమతులు కావాలంటే మైనర్ ఇరిగేషన్ ।ఫ ఇంజనీరుకు పంపవలసి ఉంటుంది. గతంలో హైదరాబాదులో ఉన్నప్పటి నుండి ఈ ప్రాసెస్ నడుస్తున్నది. ఇప్పుడు అనుమతులు ఇచ్చేందుకు జిల్లాకు ఒక ।ఫ్ ఇంజనీర్‌ను ఏర్పాటు చేశారు. వాళ్లకు కొంత అవగాహన ఉంటుందనే ఉద్దేశంతో ఆ విధంగా చేశారు. మరి వారి స్థాయిలో డిలే కాకుండా మంజూరు చేయవలసిన అవసరం ఉన్నది. మూసీ నది పక్కన వేములపాడు గ్రామం ఉన్నది. అక్కడ ఒక చెక్‌డ్యాం దాదాపు 75 శాతం వరకూ పని అయింది, గేట్లు పెట్టలేదు, నిరుపయోగంగా ఉన్నది. అయితే ఆ చెక్‌డ్యాంకు వెంట్ చాలలేదని మళ్లీ కట్టారు. అయినా, ఇప్పటివరకూ దిక్కూ దివాణం లేకుండా ఉన్నది. మొన్న నీరు వస్తే ఆపడానికి కూడా లేకుండా పోయింది. ఇటువంటివి

ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో వాటెన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. దీనితోబాటు ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో మాకు 56 మండలాలు ఉన్నాయి. 55 మండలాలను కరవు మండలాలుగా డిక్లేర్ చేయడం జరిగింది. దీనివల్ల పరిస్థితి ఎంత తీవ్రంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వానికి పంపిన లిస్టు నా దగ్గర ఉన్నది అధ్యక్షా. కాబట్టి మంత్రిగారు శ్రద్ధ తీసుకుని పెండింగ్‌లో ఉన్నవాటిని త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు:** గౌరవ సభ్యులు శ్రీ కరణం బలరామకృష్ణమూర్తిగారు సీనియర్ శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులుగా కూడా పనిచేశారు. 45 సంవత్సరాలు సుదీర్ఘ రాజకీయ అనుభవం గలవారు. వారి జిల్లాలో ఉన్న ఇబ్బందులు గానీ, చేసిన పనులు, చేయాల్సిన పనులు చెప్పారు. జిల్లాలో దగ్గర దగ్గర APSAC వారు ప్రకాశం జిల్లాలో 993 చెక్‌డ్యాంలను గుర్తించడం జరిగింది. చిన్నచిన్నవి 821 చెక్‌డ్యాంలు, మీడియం చెక్‌డ్యాంలు 87, పెద్ద చెక్‌డ్యాంలు 85 ఉన్నాయని గుర్తించారు. జలసంరక్షణ ఉద్యమంలో ఈ 993 చెక్‌డ్యాంలను జలవనరుల శాఖ కింద మేము, పంచాయతీ రాజ్ మరియు రూరల్ డెవలప్‌మెంట్ శాఖలు కలిపి చేయవలసి ఉంటుంది. రూరల్ డెవలప్‌మెంట్ శాఖ కింద చిన్న చెరువులు అంటే సుమారు 50 ఎకరాల లోపు ఆయకట్టు కింద ఉన్న పనుల నిమిత్తం ఉపాధి హామీ కూలీలకు పెద్ద ఎత్తున ఉపయోగపడాలని మంత్రి నారా లోకేశ్ గారు రూ.8,500 కోట్లు జలసంరక్షణకు కేటాయించి ఖర్చుపెట్టడం జరిగింది.

ముఖ్యమంత్రిగారు సోమవారం పోలవారం అనే సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ, జల సంరక్షణ కార్యక్రమం క్రింద ఏప్రిల్, మే నెలల్లో అన్ని జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాలలో నేను తిరుగుతాను ఎక్కడ చెక్‌డ్యాంల నిర్మాణం జరుగుతున్నాయి, ఎక్కడ మొదలు పెట్టబోతున్నారో పరిశీలిస్తానని చెప్పడం జరిగింది. అందుకు సంబంధించి రూరల్ డెవలప్‌మెంట్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, జలవనరుల శాఖ బాధ్యతలు తీసుకుని పనిని వేగవంతం చేయమన్నారు. జలసంరక్షణ కార్యక్రమంలో 116 రోజుల ఉద్యమంలో 47 రోజులు జరిగింది. దగ్గర దగ్గర రూ.450 కోట్లు వివిధ జల సంరక్షణా కార్యక్రమాల క్రింద పూడికతీత, చెక్‌డ్యాంలు రిపేర్లు చేయడం వంటి వాటికి ఖర్చుచేయడమైనది. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో APSAC వారు 6,363 రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు గుర్తించారు. వీటిలో 5,513 చిన్న స్ట్రక్చర్లు, మీడియం 525, పెద్దవి 325 గుర్తించారు. ఈ 6,363 స్ట్రక్చర్లు, 993 చెక్‌డ్యాంలను మేము పూర్తి చేయడం జరుగుతుంది. గౌరవ సభ్యులు బలరామకృష్ణమూర్తిగారు చెప్పినట్లు మార్కాపురం దగ్గర పెద్దనాగులవరం చెక్‌డామ్‌ను రూ.14 కోట్లతో చేపట్టాము. అది ముగింపు దశలో ఉంది. దారిమడుగుకు సంబంధించి కూడా రివైజ్డ్ ఎస్టిమేట్స్ సుమారు రూ.26 కోట్లతో మొదలు పెడతాము. సభ్యులు కీర్తిపాడు చెక్‌డ్యాం గురించి అడిగారు. అది కూడా సిడిఓ దగ్గర డిజైన్స్ వెంటనే క్లియర్ చేసి రూ.14 కోట్లతో పనులు పూర్తిచేసేలా చూస్తాము. అలాగే । ర్యానుప్పలపాడు, నాగులుప్పలపాడుకు సంబంధించి రూ.14 కోట్లు అడ్మినిస్ట్రేటివ్ అప్రూవల్ ఉన్నది. వెంటనే డిజైన్స్ ఫైనల్ చేసి పూర్తిచేయిస్తాము. రామాపురం, దొనకొండ ప్రాంతంలో కూడా జిల్లా కలెక్టర్ నీరు-చెట్టు కింద చెక్‌డ్యామ్ అనుమతుల కోసం కోటి రూపాయలతో పరిపాలనా అనుమతులు ఇవ్వడమైనది. గుండ్లకమ్మ నిర్మాణం జరిగిన

తరువాత ఒంగోలు పట్టణానికి నీరు వెళ్లడానికి లిఫ్ట్ ఇరిగేషన్, చెక్‌డ్యాంల ఆవశ్యకత ఉన్నది. గౌరవసభ్యులు చెప్పిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని మనవిచేస్తున్నాను. సంబంధిత శాఖలు ఏవైతే ఉన్నాయో మైనర్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్, రూరల్ డెవలప్‌మెంట్, అలాగే నీరుచెట్టు కింద పనిచేస్తున్న శాఖలతో సహా అందరం కలిసి తప్పకుండా నిర్మాణాలు చేపడతామని తెలియచేస్తున్నాను.

**శ్రీ కరణం బలరామకృష్ణమూర్తి:** గుండ్లకమ్మ ప్రాజెక్టు గురించి చెప్పలేదు.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు:** వచ్చే నెల నేను జిల్లా సమీక్షకు వెళతాను. తప్పకుండా ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటాము. అలాగే, జిల్లా వాసులు ఎదురుచూసే వెలిగొండ టన్నెల్ కూడా ఈ వారంలో టెండర్లు పిలుస్తాము.

<u>రాష్ట్రానికి రైల్వే జోన్</u>

స్వల్ప వ్యవధి ప్రశ్న నెం.104 (90-బి)

**సర్వశ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు, ద్వారపురెడ్డి జగదీశ్వర రావు, ఎం.ఎల్.సి.లు.,**

గౌరవనీయులైన రవాణా శాఖమంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా:

అ) రాష్ట్రానికి రైల్వే జోన్‌ను కేటాయించమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడమయినదా;

ఆ) అయినచో, ఈ విషయములో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన పురోగతి ఏమిటి?

**గౌరవనీయులైన రవాణా, బీసీ సంక్షేమం మరియు సాధికారత, చేనేత మరియు జౌళి శాఖ (శ్రీ కె. అచ్చెన్నాయుడు):**

అ) అవునండీ.

ఆ) రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన రైల్వే బోర్డు ఈ విషయాన్ని పరిశీలించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇంకా నిర్ణయం తీసుకోవలసి ఉంది.

**శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు (ఉపాధ్యాయ నియోజకవర్గం - శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం-2014 లో షెడ్యూల్ - 13, మౌలిక వసతులు-8 ప్రకారం నూతనంగా ఏర్పడుతున్న రాష్ట్రంలో విభజన జరిగిన తేదీ నుండి 6 నెలల లోపు భారతీయ రైల్వే వారు కొత్త రైల్వే జోన్ ఏర్పాటు కొరకు పరిశీలించి ఆ మేరకు సత్వర నిర్ణయం తీసుకోవాలని స్పష్టంగా పేర్కొనబడింది. ఇప్పటికి 6 నెలలు కాదు కదా, నాలుగు సంవత్సరాలు గడిచిపోయింది. విశాఖపట్టణానికి రైల్వే జోన్ రాలేదు. మన రాష్ట్రంలో ఎటువంటి ప్రాంతీయ విభేదాలు లేకుండా విశాఖపట్టణంలో రైల్వే జోన్ వస్తుందని అందరం ఎదురు చూస్తున్నాము. ముఖ్యమంత్రిగారు రైల్వే మంత్రిగారికి ది.8-12-2014 నాడు, మరియు ది.26-2-2016 నాడు రెండు లేఖలు రాసి సత్వరమే రైల్వే జోన్‌ను ఇవ్వాలని కోరడమైంది. కేంద్రమంత్రిగారికి రాసినా రెస్పాన్స్ లేదని నేరుగా ప్రధానమంత్రిగారికే

12-1-2018 నాడు ముఖ్యమంత్రిగారు లేఖ రాశారు. ప్రభుత్వ పరంగా ముఖ్యమంత్రిగారు, రవాణాశాఖ మంత్రిగారు నిరంతరం పర్స్యూ చేస్తున్నా కూడా కేంద్రం నుండి ఉత్తరాంధ్ర ప్రజల ఆశాకిరణమైన రైల్వే జోన్ మాత్రం నేటికీ రాకపోవడం బాధాకరం. దీనిపై ఎలా ప్రతిస్పందించాలో మాకు అర్థం కావడం లేదు. మా నాయకులు వస్తుంది, వస్తుంది అంటున్నారు కానీ ఎప్పుడు వస్తుందో స్పష్టత లేదు. ఇటీవల సంబంధిత మంత్రులు, అధికారులు చేస్తున్న ప్రకటనలు చూస్తే భయం వేస్తున్నది. అదేమిటంటే విశాఖపట్నం జోన్‌కు అంతగా ఆక్యుపెన్సీ ఉండదు, అక్కడ కేవలం అధికారి కుర్చీ వేసి ఉంచాలని చెబుతున్నారు. అది చాలా బాధాకరంగా ఉన్నది. ఉత్తరాంధ్రప్రజల మనోభావాలు దెబ్బతినేలా ఆ వ్యాఖ్యలు ఉన్నాయి. సరే, మాటలు వస్తాయి, ఇటువంటివన్నీ తప్పదు కానీ ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రిగారి కోరిక మేరకు, రాష్ట్రప్రజల తాలూకు ఆకాంక్షల మేరకు రైల్వేజోన్‌ను ప్రకటించాలని కోరుతున్నాను. రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రానికి అసలంటూ ఒక రైల్వే జోన్ ఒకటి ఉండాలి కాబట్టి ఆ రకంగా అయినా క్రైటీరియా తీసుకుని విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం తక్షణమే రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరుతున్నాను.

ఉ. 11.30

**శ్రీ కె.అచ్చెన్నాయుడు:** అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అడ్డగోలుగా విభజన చేసేటప్పుడు, ఆరోజు ఎన్నికలు జరిగితే ప్రజలు చంద్రబాబునాయుడుగారి మీద అచంచలమైన విశ్వాసంతో అధికారంలోకి తీసుకువచ్చారు. ఆరోజు కూడా బీజేపీ పార్టీతో పొత్తుపెట్టుకోవడానికి కారణమేమంటే రాష్ట్రానికి కేంద్రప్రభుత్వ సహాయం చాలా అవసరం. ఆ సహాయం తీసుకోవడానికే ఆరోజు బీజేపీ, తెలుగుదేశం కలిసి పనిచేయడం జరిగింది. ఆరోజు విభజన చట్టంలోని విషయాలు కానీ, రాజ్యసభలో అప్పటి ప్రధానమంత్రిగారు, అప్పటి ప్రతిపక్షపార్టీ అయిన బిజెపి నాయకులు ఇచ్చిన హామీలుకానీ నెరవేరుతాయనే ఒక ఆశతోనే బిజెపితో నాలుగు సంవత్సరాలు కలిసి పనిచేశాం. బీజేపీతో నాలుగు సంవత్సరాలు ఉన్నారు ఎందుకు విడిపోయారని కొంతమంది అవగాహనలేకుండా మాట్లాడుతున్నారు.

అధ్యక్షా, ఇది సందర్భం కాబట్టి కొన్ని విషయాలు చెప్పాలి. తెలుగుదేశం పార్టీ అంటే ఒక పద్ధతి ప్రకారం 35 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉంది. మేము ఈ రాష్ట్రంలోని సమస్యలు, విభజనచట్టంలోని అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీలు నెరవేర్చమని నాలుగు సంవత్సరాలుగా ప్రయత్నం చేసినా చివరి బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, చివరి బడ్జెట్‌లో ఒక్క కార్యక్రమం కూడా అమలుజరగలేదని చంద్రబాబునాయుడుగారే ముందుగా కేంద్రప్రభుత్వాన్ని మన పార్లమెంట్ సభ్యులతో నిలదీసిన విషయం కూడా ఒకసారి మనం గుర్తుచేసుకోవాలి. అయితే మళ్ళీ రెండోసారి సమావేశాలయ్యేటప్పుడు కొంతవరకైనా న్యాయం జరుగుతుందని, కొంతవరకైనా న్యాయం చేసి రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తారనే ఉద్దేశంతో చాలా ప్రయత్నాలు చేశాం. అప్పుడు కూడా మనకు ఎటువంటి సహకారం లభించనందున ముందుగా మన రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు బయటకు వచ్చారు. చిట్టచివరికి ఫైనాన్స్ బిల్లులోనైనా సరే కొంత అయినా సహాయం చేస్తారని చివరి నిమిషం వరకూ ప్రయత్నం చేశాం. అప్పటికీ చెయ్యకపోతే ఎన్‌డిఏ ప్రభుత్వం నుంచి తెలుగుదేశంపార్టీ బయటకు వచ్చింది.

అధ్యక్షా, ఉత్తరాంధ్ర ఎం.ఎల్.సి ఎన్నికలప్పుడు మా ఎం.ఎల్.సిలకోసం కూడా మేము అంతగా కష్టపడలేదు. ఉత్తరాంధ్ర ఎం.ఎల్.సిగారిని కొంచెం ఆలోచన చేసి మాట్లాడమని కోరుతున్నాను. ఆయన ఈమధ్య చాలా ఎక్కువగా మాట్లాడుతున్నారు. ఆనాడు లోకేశ్‌బాబు, ముఖ్యమంత్రిగారు ఆదేశాలతో మనం ఒక ఆశయంతో వారికి అవకాశమిచ్చాం. తప్పనిసరిగా గెలిపించుకోవాలని నెలరోజులు చాలా కష్టపడ్డాము. ఆయనకు కూడా తెలుసు. ఎవరివల్ల గెలిచారో, ఎవరెవరి నుంచి సహకారమందిందో ఆయనకు కూడా తెలుసు. సాక్షాత్తూ ఆయనకూడా నన్ను ఎం.ఎల్.సి గెలిపించండి. రైల్వేజోన్ తెచ్చే బాధ్యత నేను కూడా తీసుకుంటానని మాధవ్‌గారు, ఆరోజు ప్రచారానికి వచ్చిన వీర్రాజుగారు, కామినేని శ్రీనివాస్‌గారు అందరూ కూడా మాట్లాడారు. అది ఒక ప్లస్ అయ్యి కూడా కొన్ని ఓట్లు అదనంగా పడిన సంగతి మనం గుర్తుపెట్టుకోవాలి.

అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్‌కు ఏ ఒక్క అవసరానికైనా ఇతోధికంగా సహాయం చెయ్యాలనే ఆలోచన ఉంటే అడ్డంకులు ఏమీ ఉండవు. కానీ చెయ్యకూడదనే ఆలోచన ఉండడంవల్ల మనకు చాలా అడ్డంకులు సృష్టిస్తున్నారు. అందులో ఒకటి, రెండు చెప్తాను. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా అడిగితే 14వ ఆర్థికసంఘం ఇవ్వద్దన్నారు కాబట్టి ప్రత్యేకహోదా ఇవ్వడంలేదని అందరూ చెప్పారు. ఈమధ్యన రాజ్యసభలో బిజెపి మంత్రి స్టేట్‌మెంట్ ఇస్తూ 14వ ఆర్థికసంఘం ఎక్కడా కూడా ప్రత్యేకహోదా ఇవ్వద్దని చెప్పలేదన్నారు. మీరు ఇవ్వడానికి ఇష్టంలేకపోతే ఇష్టంలేదని చెప్పచ్చు కానీ మామీద ఎందుకు అంటున్నారని ఆర్థికసంఘంలోని సభ్యులు బయట మాట్లాడుతున్నారు. సాక్షాత్తూ మంత్రిగారే అడగలేదు, ఇవ్వద్దని చెప్పలేదని మాట్లాడారు. ఈ విషయం ఎందుకు చెప్తున్నానంటే చట్టంలో రైల్వేజోన్ పెట్టారు. ఆరు మాసాల్లో రైల్వే జోన్ ఇవ్వాలని ఆరోజు చట్టంలో పెట్టారు. అయితే, నిన్నటివరకూ రైల్వే జోన్ మనం అడిగితే ఇవ్వడానికి ఇష్టంలేక, ఒడిశా ప్రభుత్వం ఒప్పుకోవడంలేదని ఆరోజు ఉన్న రైల్వే మంత్రిగారు, ఈరోజు ఉన్న రైల్వే మంత్రిగారు, బిజెపి నాయులు చెప్పారు.

**మిస్టర్ చైర్మన్:** ప్లీజ్, కంప్లీట్ చెయ్యండి.

**శ్రీ కె.అచ్చెన్నాయుడు :** అధ్యక్షా ఒడిశా ఎం.పిలు కూడా అయిదు రోజుల ముందు ఒక సమావేశం ఏర్పాటుచేసుకుని "అయ్యా, మీకు ఇవ్వాలంటే ఇవ్వండి. మామీద ఎందుకు తప్పు చెప్తున్నారు. మేమెప్పుడూ వద్దని చెప్పలేదు" అని ఒక లేఖ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే జోన్ ఇవ్వండి మాకు కూడా న్యాయం చెయ్యండని ఒడిశా పార్లమెంట్ సభ్యులు కూడా చెప్పారు.

(గౌరవసభ్యులు శ్రీ సోము వీర్రాజు, శ్రీ పి.వి.ఎన్ మాధవ్‌గారు తమ తమ స్థానాల్లో నిలబడి అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

మీరు కావాలని ఏదో ఒక నెపం పెట్టుకుని ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చెయ్యాలని ఏకైక ధ్యేయంతో పనిచేస్తున్నారు. ఇది మంచి విధానం కాదు.

**మిస్టర్ చైర్మన్:** త్వరగా పూర్తిచెయ్యండి.

**శ్రీ కె.అచ్చెన్నాయుడు :** అధ్యక్షా, చట్టంలో రైల్వే జోన్ అని పెట్టారు. ఆంధ్రప్రదేశ్ కొత్త రాష్ట్రానికి రైల్వే జోన్ అన్నారు. కానీ ఏ ప్రాంతంలో పెట్టాలో చెప్పలేదు. మళ్ళీ ఆంధ్రప్రదేశ్‌లోనే మన మధ్య మనకు తగవులు పెట్టాలని చాలా ప్రయత్నం చేశారు.

**మిస్టర్ చైర్మన్:** ప్లీజ్ కంప్లీట్ చెయ్యండి.

**శ్రీ కె.అచ్చెన్నాయుడు :** అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు తేరుకుని ఇది ఆలస్యమైతే బాగుండదని, వెంటనే దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాలని, ఒకపక్క ఉత్తరాంధ్ర, మరొకపక్క గుంటూరు, ఇంకొకపక్క రాయలసీమ వాళ్ళు అడుగుతున్నారని, ఆరోజు మనలో మనకి తగవులు పెట్టి అన్యాయం చేశారు. మళ్ళీ ఇప్పుడు ఎక్కడ పెట్టాలనే అంశంలో కూడా మనలో మనం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రిగారు 8.12.2014న ఒక లేఖ, 26.6.2016న మరో లేఖ రాశారు. ఇలా స్పష్టంగా ఆ లేఖలు రాస్తూ విభజన చట్టంలో పెట్టిన రైల్వే జోన్ విషయంలో మాకు రెండో ఆలోచన లేదనీ, విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటుచెయ్యమని ఆయన లేఖలో రాశారు. సౌత్ సెంట్రల్ జోన్ సికింద్రాబాద్‌లో 'సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు' మొత్తం ఆరు డివిజన్లున్నాయి. అదేవిధంగా వాల్తేర్ డివిజన్ ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ భువనేశ్వర్‌లో ఉంది. ఉత్తరాంధ్రలో ఉన్నటువంటి జిల్లాలన్నీ విశాఖ డివిజన్‌లో ఉన్నాయి. విడిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు మొత్తం నాలుగు డివిజన్లున్నాయి. విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటుకు పరిశీలన చేయమని స్పష్టంగా, ఎక్కడా గందరగోళం లేకుండా ముఖ్యమంత్రిగారు చెప్పారు. అలా ముఖ్యమంత్రిగారు చెప్పిన తరువాత, ఒక ఏడు మంది సభ్యులతో రైల్వే బోర్డువారు ఒక కమిటీ కూడా వేశారు. అయితే ఇప్పటివరకూ దానికి అతీగతీ లేదు. అందుకే వీటన్నింటినీ చేసి ఇది చేశామని బిజెపి నాయకులు చెప్పుకోవాలి. అలాకాకుండా చెయ్యకుండానే ఇంకా ఇదిగో వస్తుంది, అదిగో వస్తుంది, ఆరుమాసాల్లో ఇస్తామని చెప్పడం, చట్టంలోపెట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయినా దానిమీద ఒక్క అడుగుకూడా ముందుకు వెయ్యకుండా ఏదోరకంగా ఆపుచెయ్యాలని నిన్నటివరకూ ఒడిశా మీద తోస్తే, ఒడిసా వాళ్ళు కూడా తమకేమీ అభ్యంతరం లేదంటున్నా కూడా ఇంకా జోన్ ఇవ్వడంలేదంటే ఇది కేవలం ఆంధ్రప్రదేశ్‌మీద కక్షపెట్టుకుని చేస్తున్నారు. ఆరోజు కాంగ్రెస్ పార్టీ చేసింది, ఈరోజు బీజేపీ కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఏదైనా చేస్తే చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో మళ్ళీ ఈ దేశంలో పెద్ద సంస్థ వస్తుంది. దానివల్ల తమకు నష్టం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ అన్యాయం చేస్తున్నారో అనేది మాకు తెలియడంలేదు. ఇప్పుడిప్పుడే అవన్నీ బయటపడుతున్నాయి.

**మిస్టర్ చైర్మన్:** ప్లీజ్, కంప్లీట్ చేయండి.

**శ్రీ కె.అచ్చెన్నాయుడు :** ఈరోజు కుటిల రాజకీయాలు చేస్తున్నారు. మీరైనా, మేమైనా, ఎవరమైనా సరే ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన పౌరులం. మనకు ఇంకొక సమస్యకానీ, రాజకీయాలుకానీ వద్దు. ఒకళ్ళ గురించి ఒకళ్ళు మాట్లాడుకోవడం వద్దు. విమర్శలు చేసుకోవద్దు. మనందరి నినాదం ఒకటిగా ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌కు చట్టంలో పెట్టిన అంశాలు కానీ, రాజ్యసభలో ఇచ్చిన హామీలు కానీ, ప్రధానమంత్రిగా మోదీగారు ఈ రాష్ట్రానికి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలనుకానీ పరిష్కరించుకోవడానికి మనందరమూ కలిసి పనిచెయ్యాలి తప్ప ఈ రకంగా నష్టం చెయ్యడం భావ్యంకాదు. మళ్ళీ ఒకసారి శాసనపరిషత్తు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాం. మీమీద నమ్మకం పోతుంది. ప్రజా ప్రభుత్వాలమీద విశ్వాసం పోతుంది. చట్టసభల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఇంక ప్రభుత్వాల మీద విశ్వాసం ఎక్కడుంటుంది? కాబట్టి ఇప్పటికైనా సరే మీరు ఏదైతే మాట ఇచ్చారో, ఏదైతే చట్టంలో పెట్టారో వీలైనంత తొందరగా విశాఖపట్నంలో రైల్వే జోన్ ఏర్పాటు చెయ్యమని రాష్ట్రప్రభుత్వం తరఫున, రాష్ట్ర ప్రజల తరఫున ప్రత్యేకంగా ఉత్తరాంధ్ర ప్రజల తరఫున కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.

ఉ.11.40

**డా. గాదె శ్రీనివాసులు నాయుడు:** అధ్యక్షా, రాష్ట్రం విడిపోయి చాలా నష్టపోయాము కాబట్టి రైల్వే జోను ఏర్పాటుచేయాల్సిందిగా ఒక తీర్మానం చేసి పంపిస్తే బాగుంటుంది.

**శ్రీ కె. అచ్చెన్నాయుడు:** అధ్యక్షా, ఒక తీర్మానం చేస్తే బాగుంటుంది.

**మిస్టర్ ఛైర్మన్:** ముఖ్యమంత్రిగారు తీర్మానం చేస్తారులే. Paper included in the agenda is deemed to have been laid on the Table of the House.

## 3. PAPER LAID

"A copy of the 1st Annual Report of the Andhra Pradesh Urban Greening and Beautification Corporation Limited for the year 2015-16, as required under Section 394 of the Companies Act, 2013."

Now Special Mentions.

## 4.సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావనలు

**శ్రీ బొడ్డు నాగేశ్వరరావు:** అధ్యక్షా, గౌరవనీయ మంత్రివర్యులు అచ్చెన్నాయుడుగారు అంగన్‌వాడీల గౌరవ వేతనాల పెంపుదలలో సభ్యుడిగా ఉండి, ఆయన చూపిన చొరవవలన అంగన్‌వాడీ వర్కర్లకు రూ.7,000/–, హెల్పర్స్‌కు రూ.4,500/–కు పెంచి మేలు చేశారు. మరలా 10వ పిఆర్‌సీ వచ్చింది. జి.ఓ.నెం.151 ప్రకారం 50% వేతనాలు పెంచి ఇచ్చే వెసులుబాటు ఉంది కాబట్టి గౌరవ మంత్రివర్యులు శ్రీ నారా లోకేశ్, శ్రీ కె. అచ్చెన్నాయుడుగార్లు చొరవ తీసుకుని వర్కర్లకు రూ.10,500/–, హెల్పర్స్‌కు రూ.6750/–లకు పెంచాలని వారు ప్రశాంతయుతంగా ఆందోళన

చేశారు. సదరు అంశాన్ని మీద్వారా మంత్రివర్యుల దృష్టికి తీసుకువస్తూ, వారి వేతనాలు పెంచాలని, వారికి బోధనకు సంబంధించిన పనినే ఇవ్వాలని, మిగిలిన సమస్యలను కూడా ప్రత్యేక ప్రస్తావన ద్వారా ప్రభుత్వానికి అందజేస్తున్నాను. వాటిని పరిశీలించి న్యాయం చేయాలని మీద్వారా మంత్రివర్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ రాము సూర్యారావు:** అధ్యక్షా, రవాణా శాఖ అధిక లోడు వాహనాలకు అనుమతి ఇచ్చే విషయంలో ఆరు టైర్ల లారీపై 10 టన్నులు, 10 టన్నుల వాహనంపై 15 టన్నులు, 12 టన్నుల వాహనంపై 20 టన్నులు మాత్రమే రవాణా శాఖ అనుమతులు ఇవ్వాలి. కాని వాహనాలలో 5 నుండి 15 టన్నుల వరకూ అదనంగా రవాణా చేస్తున్నారు. దానివలన రోడ్లు దెబ్బతినడమే కాకుండా ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. సదరు అంశంపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రత్యేక ప్రస్తావన ద్వారా మీద్వారా సంబంధిత శాఖ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కత్తి నర్సింహారెడ్డి:** అధ్యక్షా, సెప్టెంబరు 2004వ సంవత్సరం నుండి రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలలు, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలు, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో అ తి తక్కువ మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు నియమించబడ్డారు. వీరికి అటు పాత పెన్షను వర్తింప చేయలేదు, జి.ఓ.నెం.655 ప్రకారం ఎన్‌పియస్ కూడా వర్తింప చేయలేదు. అందువల్లన వీరు గాలిలో ఉన్నట్లుగా ఉన్నారు. కాబట్టి 01-09-2004 తరవాత ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కళాశాలల్లో నియమించబడిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బందికి కూడా జి.ఓ.నెం.655 వర్తింప చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**MR. CHAIRMAN:** Tea break for ten minutes.

(The House then adjourned at 11.43 a.m.)

మ.12.00

(తేనీటి విరామానంతరం సభ మధ్యాహ్నం గం.12.04 ని.లకు పునః ప్రారంభమైంది.)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు.)

**MR. CHAIRMAN:** Short discussion on Welfare.

## 5. "సంక్షేమం" పై లఘు చర్చ

**శ్రీమతి పి. శమంతకమణి:** అధ్యక్షా, సంక్షేమంపై లఘుచర్చలో మాట్లాడేందుకు నాకు అవకాశం ఇచ్చినందుకు మొదటగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఆర్థిక సమానత్వం ఉన్నప్పుడే సామాజిక సమానత్వం ఉంటుందని ఆనాడు డా.బి.ఆర్. అంబేద్కర్ గారు మన రాజ్యాంగంలో లిఖించడం జరిగింది. అది నిజమే అధ్యక్షా. ఎప్పుడైతే ఆర్థికంగా అభివృద్ధి చెంది ఉంటారో వారి మతం గానీ, వారి కులం గానీ సంఘంలో కనపడదు. సంఘంలో ఉన్నవారు,

సమాజంలో ఉన్నవారు ఒక మనిషికి విలువను ఇస్తున్నారంటే, ఒక మనిషిని గౌరవిస్తున్నారంటే చాలా వరకు ఆయన వెనుక ఉన్న ఆర్థిక వనరులను బట్టి, వారి స్టేటస్‌ని బట్టి గౌరవించడం సహజం. అదేవిధంగా ఈరోజు మన ముఖ్యమంత్రిగారు సాంఘిక సంక్షేమం గురించి ముఖ్యంగా దళితులు, వారి అభివృద్ధి, ఆర్థిక సమానత్వం గురించి ఒక మహాసంకల్పం తీసుకున్నారు కాబట్టే, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేసి ఆ సబ్‌ప్లాన్‌కు కావలసిన నిధులను ఇవ్వడం జరిగింది.

అధ్యక్షా, మీరు, నేను చాలా సీనియర్లు కాబట్టి, చాలా ప్రభుత్వాలు చూశాము. అయితే, గత ప్రభుత్వాలు సాంఘిక సంక్షేమానికి నిధులను ఇచ్చే వారే తప్ప, ఈ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఎక్కడా ఉండేది కాదు. ఏదో ఒక బర్రెనో, గొర్రెనో ఇచ్చి సాంఘిక సంక్షేమం ద్వారా మేము అభివృద్ధి చేస్తున్నాము. కొన్ని ఇండ్లు ఇచ్చి, వాటిని ఆవాసాలుగా, గృహాలుగా మీరుండండి అని చెప్పడం జరిగింది తప్ప, అసలైన వనరులను కల్పించి, వారి సమానత్వం కోసం కృషి చేసింది మాత్రం కేవలం మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారని ఘంటాపథంగా మనం చెప్పొచ్చు. ఆనాడు ఇందిర ఆవాస్ యోజన కింద గుడిసెలు ఇచ్చేవారు. ఆ తరువాత అక్కడక్కడ ఇళ్లు కట్టి ఇవ్వడం జరిగింది. కానీ, ఈ రోజు పక్కా గృహాలను నిర్మించే దిశగా, వాటి నిధుల నుంచి ఒక్కొక్క మండలానికి ఇన్ని గృహాలు, జిల్లాకు ఇన్ని గృహాలు, రాష్ట్రం మొత్తం మీద దళితులకు ఇన్ని పక్కా గృహాలు తప్పనిసరిగా నిర్మించాలనే ఒక మహాసంకల్పంతో ఇవ్వడమే కాకుండా, త్వరితగతిన వాటి నిర్మాణం పూర్తి చేయడానికి అధికారులకు ప్రతిసారి సూచనలు చేస్తున్నారు.

**MR. CHAIRMAN:** No Minister is in the House. (Addressing the Deputy Secretary) Satyanarayana garu.....

(At that juncture, the Hon'ble Chairman was seen giving directions to the Deputy Secretary)

**శ్రీమతి పి. శమంతకమణి:** మీరు సభకు రాగానే మేము అదే అన్నాము అధ్యక్షా. ఒక్క మంత్రి గారు కూడా సభలో లేరు.

**మిస్టర్ ఛైర్మన్:** (శమంతకమణి గారిని ఉద్దేశించి) మీరు మాట్లాడుతుండండి, రికార్డుల్లో ఉంటుంది. షరీఫ్ గారు, మంత్రిగారిని రమ్మని చెప్పండి.

**శ్రీమతి పి. శమంతకమణి:** అధ్యక్షా, వాటికోసం....

**శ్రీ కె.ఇ. ప్రభాకర్:** అధ్యక్షా, మన సభ్యులు మాట్లాడుతున్నప్పుడు వారు చెప్పిన పాయింట్లు నోట్ చేసుకోవడానికి మంత్రులు ఉంటే బాగుంటుంది. దయచేసి వారందరికీ కబురు పంపించాల్సిందిగా మిమ్మల్ని కోరుతున్నాను.

**శ్రీమతి పి. శమంతకమణి:** అధ్యక్షా ఎ-బ్యాచ్ అని, బి-బ్యాచ్ అని ఉన్నాయి కదా.

**మిస్టర్ చైర్మన్:** అవి విప్‌లు చూసుకోవాలి.

**శ్రీమతి పి. శమంతకమణి:** అధ్యక్షా, ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రులు ఉంటున్నారు కానీ, చర్చ జరిగేప్పుడు ఉండడం లేదు.

**శ్రీ అంగర రామమోహన్ (స్థానికసంస్థలు – పశ్చిమగోదావరి):** అధ్యక్షా, సభ్యులు మాట్లాడేప్పుడు ఒక్క మంత్రిగారు కూడా లేకపోవడం ఏమీ బాగాలేదు.

**శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్:** అధ్యక్షా, ఇప్పుడు వస్తున్నారు.

**MR. CHAIRMAN:** Please call him, I say.

**శ్రీమతి పి. శమంతకమణి:** అధ్యక్షా, వాళ్లు వచ్చాకే మాట్లాడతాను.

**శ్రీ బొడ్డు నాగేశ్వర రావు:** అధ్యక్షా, అధికారులు కూడా లేరు.

**మిస్టర్ చైర్మన్:** మీరు మాట్లాడుతుండండి, వాళ్లు వచ్చేస్తారు.

**శ్రీ కత్తి నరసింహా రెడ్డి:** అధ్యక్షా, అధికారులు కూడా ఎవరూ లేరు.

**శ్రీమతి పి. శమంతకమణి:** ఎవరున్నారు అధ్యక్షా, మేము మాట్లాడడానికి?

**మిస్టర్ చైర్మన్:** రికార్డులలోకి వెళుతుంది.

**శ్రీమతి పి. శమంతకమణి:** అధ్యక్షా, ఇది పెద్దల సభ. దీనిని గౌరవించకపోతే ఎలా?

**మిస్టర్ చైర్మన్:** షరీఫ్ గారూ, మీరు చూడండి. ఏ మంత్రిగారూ సభలో లేకపోతే ఎలా?

**శ్రీమతి పి. శమంతకమణి:** అధ్యక్షా, పెద్దలసభ అని ఎలాంటి గౌరవం లేకపోతే ఎలా? రావాలి కదా.

**మిస్టర్ చైర్మన్:** ఖచ్చితంగా రావాలి.

మ.12.10

**శ్రీమతి పి. శమంతకమణి:** అధ్యక్షా, ఈరోజున పక్కా గృహాలను నిర్మించడమే కాకుండా, వాటికి మధ్యలో ఆరోగ్యకరమైన వాతావరణం, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలనేది మన ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. అందుచేతనే ప్రతి కాలనీలో సిమెంటు రోడ్లను వేయడమే కాకుండా, మంచినీటిని సరఫరా చేయడం, ఓవర్‌హెడ్ ట్యాంకులను కట్టించడం, ప్రతి ప్రాంతంలో కూడా కావలసిన విధంగా ఎల్ఈడీ బల్బులను పట్టపగలల్లే ఏర్పాటు చేయడం జరుగుతోంది. ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమం కూడా త్వరితగతిన పూర్తి చేయడం, ప్రతి కాలనీ

కూడా ఈరోజున చాలా చక్కని వాతావరణంలో ఉంది అనడానికి మన దళితులందరూ ముఖ్యమంత్రిగారిని అభినందించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా తమ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఆరోజుల్లో అయితే అశుభ్రతతో, అనాగరికంతో ఎక్కడా కూడా వారికి గౌరవం ఇచ్చేవారు కాదు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఆయా ప్రాంతాలకు వెళితే మీ కాలనీలు అక్కడ ఉన్నాయి పోయి చూడండి, అక్కడకు వెళ్ళమని అనేవారు. ఈరోజున ఆయా గ్రామాలకు చేరువలో ఉండడమే కాకుండా, గ్రామాలలో వాతావరణం ఏ విధంగా ఉందో, ఎస్సీ కాలనీలలో కూడా అదేవిధమైన వాతావరణం నెలకొని ఉంది. ఈరోజున దానికి గల కారణం ఆర్థిక సమానత్వం. ఫైనాన్షియల్ ఈక్వాలిటీ. ఈరోజున ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన కార్యక్రమం దళితులకు ఎంతో అభివృద్ధి కార్యక్రమంగా ఉంది. ఆరోజుల్లో అయితే కూలీలు రావాలంటే చాలావరకు వచ్చేవారు. ఈనాడు గ్రామీణ ప్రాంతంలోని కూలీలకు చాలావరకు తక్కువగా వస్తున్నారు. కారణం ఈ ఉపాధి హామీ పథకమే. ఉదయం 6.30 నిముషములకు బయటకు వెళితే, రాత్రి గం.9.30ల వరకు రావడం, వారికి కావలసిన జాబ్‌కార్డులను ఏర్పాటు చేయడం, వాటి వల్ల రోజూఅటెండెన్స్ రావడం జరుగుతోంది. తద్వారా వారానికి ఒకసారి వారు చేసిన పనికి ఆ కూలీ డబ్బులను ఇవ్వడం జరుగుతోంది. రోజుకు రూ.150లు ఇస్తున్నారు. నూరు రోజుల పాటు లేక నూట యాభై రోజులు పని రోజులుగా వారికి పనులను ఏర్పాటు చేసి, వాటి ద్వారా దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ఈ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది.

ఈరోజున మనం వారి గృహాలను గమనిస్తే ప్రతి ఇంటిలో ఒక ఫాను, టీవి వారికి కావలసిన వనరులు ఉన్నాయి. ఈరోజున మనం వాళ్ళ ఇంటికి వెళితే కుర్చీలు వేసి, ఫాను వేసి గౌరవం ఇస్తుంటే, దళితులకు మేము ఎంత ఋణపడి ఉన్నామో నాకే చాలావరకు ఆశ్చర్యకరంగా ఉంటుంది. చాలావరకు వారికి ఋణపడి ఉన్నాము. ఎందుకంటే, ఏ రోజు అయితే సమానత్వంగా మేము ఉన్నామో, మేము కూడా ఈ సమాజంలో మనుషులమని, తలెత్తుకుని తిరిగే విధానం కనపడుతోంది. దీనికి ప్రభుత్వం బాధ్యత చాలా ఉందని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఈనాడు ఒక పరిశ్రమలో, ఒక డిపార్టుమెంటులో చూసినా మనకు ఈ రిజర్వేషన్ల ద్వారా కావలసిన విధానానికి ఈరోజున నీరు-చెట్టు విషయంలో కానీ, గ్రామాలలో కూడా ఎక్కడ చూసినా కూలీలు కల్పిస్తున్నారంటే దళితులే ఎక్కువ శాతం ఆ సంక్షేమాన్ని అనుభవిస్తున్నారు. తమ ద్వారా ఒక విషయం మనవి చేసేది ఏమిటంటే – గతంలో ముఖ్యమంత్రిగారు ఉన్నప్పుడు లిడ్‌క్యాప్ ఉండేది. చెప్పుల షాపులు ఉండేవి. దళితులకు ఉపయోగకరంగా ఉండడానికి వారికి కావలసిన విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ క్రింద వారికి చెన్నైలో ట్రైనింగ్‌ను ఇప్పించడం జరుగుతోంది. తద్వారా దళితులైన నిరుద్యోగ యువకులకు అక్కడకు తీసుకువెళ్ళి, వారికి ట్రైనింగ్‌ను ఇచ్చి, మళ్ళా వారు ట్రైనింగ్ తీసుకుని వచ్చిన తరువాత, వారికి సబ్సిడీ క్రింద షాపులు ఇవ్వడం జరుగుతోంది. అప్పట్లో మినిమమ్, మీడియం, మెగా పార్కులను కూడా ఆరోజుల్లో ఏర్పాటు చేయడం జరిగింది. చనిపోయే స్థితిలో ఉన్న లిడ్‌క్యాప్‌ను ఈనాడు సజీవంగా తీసుకురావడం జరిగింది. ఈరోజున అది మరలా శిథిలావస్థకు పోతోంది. లిడ్‌క్యాప్‌ను మరలా పునర్నిర్మితం

చేయండి. మీరు కట్టించిన కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టిన మెగా, మీడియం, మినిమమ్ పార్కులు అన్ని ఇప్పుడు శిథిలస్థితికి పోతున్నాయి. వాటన్నింటిని విధిగా పునరుద్ధరించి ఈ దళిత యువతకు సహాయం చేయవలసిందిగా తమ ద్వారా నేను ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎందుకంటే, ఎప్పుడైతే వాళ్ళు ఆ నైపుణ్యం తెలుసుకొని ఉంటారో, అందుకు కావలసిన సర్టిఫికేటును పొంది ఉంటారో, వాళ్ళు కూడా ఈ షాపులను ఏర్పాటు చేసుకుని, లేదా ఒక స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ క్రింద పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని తద్వారా వాళ్ళు తయారు చేసిన బూట్లను పోలీసు డిపార్టుమెంటు వారికి టైఅప్ చేస్తే వారికి మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పించిన వారవుతారని ఈ సందర్భంగా తమ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఇక సంక్షేమ కార్యక్రమాలన్నింటిలో ముఖ్యమైనది ఈరోజున గమనిస్తే – సంక్షేమ కార్యక్రమాలలో ముఖ్యమంత్రిగారు దళిత మహిళలకు ఒక తండ్రిగా, అన్నగా ఆయన వారి వెంట ఉన్నారనడంలో ఎలాంటి అసత్యం లేదు. నేను ఎందుకు చెబుతున్నానంటే ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలు ఇంకా చాలా ఉన్నాయి. అటువంటి సమయంలో అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా దళిత మహిళలకు పోషకాహారం ఇవ్వడం జరుగుతోంది. ఆ పోషకాహారం తీసుకొనడం ద్వారా ఆరోగ్యకరమైన సంతతిని ఇవ్వడానికి మరియు ఆ సంతతి ఆరోగ్యకరంగా ఉంటేనే ఈ సమాజం కూడా ఆరోగ్యకరంగా ఉంటుందని, వారి ఆలోచనలు కూడా ఆరోగ్యకరంగా ఉంటాయనే ఉద్దేశంతోనే ఈరోజు పోషకాహారాన్ని ఈ ప్రభుత్వం వారికి అందివ్వడం జరుగుతోందని తమ ద్వారా మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ఈ పోషకాహార విలువలు ఉన్నప్పటికీ మామూలుగా పల్లెల్లో జరిగే విధానం చూసినప్పుడు చాలా కష్టతరంగా ఉంటుంది. వాటికి సంబంధించి తమ ద్వారా నేను ఈ ప్రభుత్వానికి విన్నవించేది ఏమిటంటే – జిల్లాలలో ఉన్న మహిళా ఎం.ఎల్.ఎ.లు, ఎం.ఎల్.సి.లతో ఒక కమిటీ వేసి వారి ద్వారా అప్పుడప్పుడు ఆయా ప్రాంతాలలో ఆకస్మికంగా తనిఖీ చేస్తే, వాటి ద్వారానైనా భయపడి సరైన పోషకాహారాన్ని ఇవ్వడానికి ముందుకు రావడం జరుగుతుంది. లేకపోతే, చాలావరకు గమనిస్తే కోడిగ్రుడ్లు ఇస్తామని అంటున్నారు. కానీ, నాకు ఆ సైజుని చూస్తే – మా చిన్నప్పుడు మేము గోలీకాయలు ఆడేవాళ్ళం. రెండు సన్న గోలీలను ఒక లావు గోలీతో కొట్టేవాళ్ళం. ఈ లావు గోలీ వెళ్ళి ఆ చిన్న గోలీని తగిలితే ఆ రెండు చిన్న గోలీలను మాకు ఇచ్చేవాళ్ళు. ఆ విధంగా ఒక పెద్ద గోలీ ఏ సైజులో ఉందో, ఆ విధంగానే కోడిగ్రుడ్లు ఉన్నాయి తప్ప, కోడి గ్రుడ్లు ఆకారంలో ఇవ్వవలసిన గ్రాములో ఇవ్వవలసిన సైజులో లేవు. అది చాలా స్పష్టంగా కనపడుతోంది. అదేమంటే రెండు గ్రుడ్లు ఇస్తామని అన్నారు. అవేం గ్రుడ్లు అధ్యక్షా. రెండు గ్రుడ్లు కలిసినా ఒక గ్రుడ్డుకు సమానం కాదు.

అధ్యక్షా, ఈ ప్రభుత్వం ఇచ్చే డబ్బుకు, ప్రభుత్వం చేసే సంక్షేమ కార్యక్రమాలకు సరైన న్యాయం జరగాలి. ఎప్పుడైతే సరైన న్యాయం జరుగుతుందో, అప్పుడు ప్రభుత్వ విధానాలు సక్రమంగా అమలులోకి వస్తాయి. ప్రజలు కూడా చాలా సంతోషిస్తారు. అంతేగానీ మేము పోషకంగా ఉన్నాము, ఉద్యోగులము, మీరు ఏ విధంగానైనా ఉండండి అంటే ఎలా ? కాబట్టి, ఈ ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేస్తే, చాలావరకు ఉపయోగకరంగా ఉంటుందని నేను అనుకుంటున్నాను.

అధ్యక్షా, ఇక తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కి సంబంధించింది. ఇది ఎంతో గౌరవప్రదమైన పథకం. అప్పట్లో అంతా అనేవారు - తొలికాన్పు కోడలిని పుట్టింట్లో చేసుకోమని, మలి కాన్పు వచ్చే లోపల కొడుకుకు తల్లి బాగా స్ప్రింగ్ ఎక్కించేది. ఏమంటే - నాయనా, నాకు వయస్సు మళ్ళిపోయింది. ఇప్పుడు శనక్కాయలు పీకే సమయం కాబట్టి, మళ్ళా నీ భార్యకు రెండవ కాన్పును మనము ఎక్కడ చేస్తాము? కాబట్టి, వాళ్ళ పుట్టింటికి పొమ్మని అనేది. కానీ, ఇప్పుడు ఈ తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా మేము ఫోన్ చేయగానే మీ ఇంటికి ఒక వాహనం వచ్చి, నిన్ను, నీ కోడలిని వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్ళి సుఖ ప్రసవం చేయించి బిడ్డకు కావలసిన చక్కని కిట్టును కూడా ఇస్తున్నారు. అప్పట్లో అయితే పాత । రలో, పాత పంచెలో చింపి పసిపిల్లలను ఎత్తుకునేవారు. ఆ పాతగుడ్డలే పిల్లలకి కప్పేవారు. ఇప్పుడు ఏ మహిళ చేతిలో కూడా ప్రభుత్వం ఇచ్చే ఈ చక్కటి కిట్టు వలన పసిపిల్లలకు మంచి ఆరోగ్యకరమైన బెడ్డు ఉంటుంది. ఆ బెడ్డులో పసిపిల్లలను పడుకోబెట్టి, ఆ తల్లులు పసిపిల్లలను ఆసుపత్రులకు తీసుకురావడం జరుగుతోంది. ముఖ్యమంత్రిగారు ఆ పిల్లలకు ఒక తండ్రిగా, ఏ విధంగా ఉండాలో మన ముఖ్యమంత్రిగారు ఈ సంక్షేమ పథకం క్రింద ఆయన కొనసాగుతున్నారు.

అధ్యక్షా, చంద్రన్న బీమా పథకానికి సంబంధించి చూస్తే, ఒక ఆడపిల్లకు పెళ్ళి చేసిన తరువాత, ఆ తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో ఉంటారు. వాళ్ళు ఎన్నో కలలు కంటారు. నా బిడ్డ ఫలానా ఇంటికి కోడలుగా వెళ్ళింది, నా బిడ్డ జీవితం చాలా బాగుంటుందని, కానీ, దురదృష్టవశాత్తో, మరి ప్రమాదవశాత్తు ఆ అబ్బాయి చనిపోతే ఆ దళిత మహిళకు ఇక తోడు ఎవరుంటారు? తల్లిదండ్రులకు ఒక ప్రక్క బాధ, అన్నదమ్ములకు ఒక ప్రక్క బాధ, అత్తమామలకు ఒక ప్రక్క బాధ ఉంటుంది. ఇన్ని రకాల బాధలలో ఆమె ఉన్నప్పుడు ఈ చంద్రన్న బీమా పథకం ద్వారా వారికి కావలసిన ఆర్థిక సహాయం ఇచ్చి, తల్లీ నీకు అన్నగా నేను తోడు ఉంటున్నానని, నీవు ధైర్యంగా ఉండు, నీ పిల్లలను నువ్వు కాపాడుకో. నీ పిల్లలకు నువ్వు తండ్రిగా, తల్లిగా, నువ్వే ధైర్యంగా ఉండి, నీకు ఈ ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక వనరుల ద్వారా నువ్వు అభివృద్ధి వైపు కొనసాగమని ధైర్యం చెబుతున్నారు.

అధ్యక్షా, ఇక మరొక అంశం ఈ వృద్ధాప్య పింఛను. ఇందులో మనకు తెలియని విధానమేమీ కాదు. కేవలం దళితులలోనే కాదు, ఆర్థిక ఇబ్బందులున్న ప్రతి కుటుంబంలో కూడా పిల్లల ఆదరణకు, వారి ప్రేమకు, అభిమానానికి దూరమై ఏదో ఒక చెట్టు క్రిందనో, రచ్చబండ దగ్గరనో పడేసేవాళ్ళు. ఇన్నేళ్ళు నువ్వు బ్రతికావు. ఇంకా ఎంత కాలం బతకాలని ఉన్నావు? ఇంకా ఎంత సేవ చేయించుకోవాలని కోడలు మూడు సార్లు ముక్కు, మూతి ఇటు ప్రక్క అటు ప్రక్క తిప్పేది. కానీ, ఈనాడు ఈ వృద్ధాప్య పింఛను వల్ల కోడళ్ళు పది గంటలు అయ్యే లోపలే లే అత్తా, ముఖం కడుక్కో అత్తా, ఉడుకు, ఉడుకు ముద్ద చేశా, వంకాయ కూర చేశా, తిందువురా అని అంటారు. దానికి కారణం ఏమిటంటే - ప్రభుత్వం ఇచ్చే ఈ వృద్ధాప్య పింఛనే. ఆ వృద్ధాప్య పింఛను వల్ల ప్రతి ఒక్క వృద్ధురాలు తను తినే ప్రతి ముద్ద వెనుక "నాయనా చంద్రబాబు నాయుడు గారూ, నూరేళ్ళు బ్రతుకు తండ్రి, నీ ఆయుష్షు పెరుగు గాక అని, శతమానం భవతి" అని ఆశీర్వదిస్తున్నారు. కాబట్టి, ఈ వయస్సులో కూడా ముఖ్యమంత్రిగారు ఆరోగ్యకరంగా ఉండి, ఎలాంటి అలసట లేకుండా, వారి ఆలోచనలో ఏ మాత్రం వెనుకంజ వేయకుండా దృఢ సంకల్పంతో ఈ రాష్ట్రాన్ని

ముందుకు తీసుకువెళుతున్నారంటే ఎంతో మంది వృద్ధుల యొక్క ఆశీర్వాదము, శతమానం భవతి అని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

మ.12.20

అధ్యక్షా, మరి ముఖ్యంగా ఈ రోజు మనం లాండ్ పర్చేజింగ్ స్కీమ్ విషయానికి వస్తే ఈ లాండ్ పర్చేజింగ్ స్కీమ్ క్రింద గత ప్రభుత్వాలు దళితులకు ఇచ్చిన భూములన్నీ రాళ్ల గుట్టలే. ఆ గుట్టల్లో రైతు, అతని భార్య, పిల్లలందరూ కలిసి రాళ్లు ఎత్తేసి, దానిని లెవల్ చేసుకునే సరికి ఆ రైతు ముసలి వాడు అయిపోతున్నాడు. ఇటువంటి భూమిని ఇచ్చారని అడిగితే ఏదో పాస్ బుక్ తీసుకో, ఏదో బ్యాంకుకు వెళ్లి పది వేలు ఇస్తారు తెచ్చుకో అనే మనస్తత్వాలు కలిగిన ప్రభుత్వాలు ఇంతకు ముందు ఉన్నాయి. కానీ ఈ రోజు మన ముఖ్యమంత్రి గారు వ్యవసాయం మీద ఆధారపడిన దళితులు ఆర్థికంగా బలపడాలంటే వాళ్లకు మంచి సాగు భూమి ఇవ్వాలనే మహా సంకల్పంతో, వెట్ లాండ్ కానీ, డ్రై లాండ్ కానీ ఇవ్వడం జరుగుతోంది. ఈ లాండ్ పర్చేజింగ్ స్కీమ్ వలన దళిత రైతులందరూ వ్యవసాయంపై దృష్టి పెట్టడం ద్వారా కొన్ని కుంటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయి.

అధ్యక్షా, మరొక విషయం ఏమిటంటే వెలుగు-డ్వాక్రా గ్రూపులు. ఈ వెలుగు డ్వాక్రా గ్రూపులను మనం గమనించినట్లయితే డ్వాక్రా గ్రూపులలో ఉన్న మహిళలకు చదువు రాకపోయినా కోట్లాది రూపాయలకు లెక్కలు చెప్పడం జరుతోంది. దీని వలన ప్రతి మహిళ కూడా చైతన్యవంతురాలు అయింది. మహిళా సమాఖ్య ద్వారా తాము ఎంత డబ్బు పొదుపు చేశాము, ఎంత డబ్బు వాడుకున్నాము, ఇంకా ఎంత డబ్బు ఉంది అని తెలుసుకోవడం ద్వారా ఈ రోజు వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి చాలా మంచి వెలుగు దారి. ఎందుకంటే ఈ రోజుల్లో మద్యం త్రాగి భర్త భార్యను కొట్లడానికి రాని పరిస్థితిలో ఉన్నారు. ఏ మగాడయినా చెయ్యెత్తి కొట్టడానికి వస్తే, ఏ చూసినాములేరా, ఊరికే ఉండు చెయ్యిదించు, నువ్వు తెచ్చి నాకు ఇచ్చినావా, నేను స్త్రీ నిధి ద్వారా మూడు రోజుల్లో రూ.2లక్షలు తెచ్చి నీ బిడ్డకు పెళ్లి చేశాను. నీకు ఒక ఎకరా భూమి కొనిచ్చినా, ఊరుకోవయ్యా ఊరికే మీసాలు తిప్పుతున్నావని ఈ రోజు మహిళ ధైర్యంగా అడగడానికి ముందుకు వస్తోంది. అధ్యక్షా, చూడండి ఈ రోజు మహిళల్లో ఇంత ఉత్సాహం కల్పించి, ఇలా సాధికారతను పెంపొందింప చేసింది కేవలం మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారే. ఈ సంక్షేమ కార్యక్రమాలు అన్నీ కూడా దళితులకే ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి. ఈ రోజు దళిత తేజం తెలుగుదేశం కార్యక్రమం ద్వారా మేము కాలనీలన్నీ తిరుగుతున్నాము. వారి దగ్గరకు వెళ్లినప్పుడు వారి ఆర్థిక వనరులు, వారి సంక్షేమం, వారి పిల్లలు ఉన్న తీరు గమనిస్తే పిల్లలను చదివించుకోవడంలో చాలా వరకు ముందుకొస్తున్నారు.

అధ్యక్షా, ఈ రోజు చంద్రన్న పెళ్లి కానుక పథకాన్ని మొన్న ఉగాది నుంచి తీసుకువచ్చి ప్రతి దళిత మహిళకు పెళ్లి సమయంలో ఆ తల్లిదండ్రులు బాధపడకూడదనే, ఏ విధంగా అయితే ముస్లిం పిల్లలకు వివాహ సమయంలో

పెళ్లి కానుకగా ఇస్తున్నారో, అదే విధంగా దళిత మహిళలకు కూడా రూ.40,000లను ఇచ్చి ఆర్థికంగా సహాయం చేయడం ద్వారా పిల్లల వివాహాల సమయంలో అప్పులు చేసుకోకుండా చక్కగా వివాహాన్ని జరుపుకుంటున్నారు.

అధ్యక్షా, చిట్టచివరిగా మన పెద్దలు ఉపన్యాసాల్లో చాలా వరకు సరస్వతీ దేవికి పూజ చేస్తే బాగా చదువు వస్తుందని, లక్ష్మీ దేవికి పూజ చేస్తే ధనం వస్తుందని, పార్వతీ దేవికి పూజ చేస్తే ధైర్యం వస్తుందని చెపుతుంటారు. కానీ నేను గమనించింది ఒక్కటే. మన ఈనాటి ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి అయిన చంద్రబాబు నాయుడు గారు దళిత వాడల్లో ఉన్న సరస్వతి చదువు మానేసి పశువులకు కాపలా కాస్తుంటే వారి కోసం "మళ్లీ బడికి రా" అనే పథకం పెట్టి ఆ అమ్మాయిని దగ్గరకు తీసి సరస్వతీ నువ్వు మళ్లీ చదువుతావమ్మా అని అడిగితే సార్ నేను చదువుతాను సార్ అనే విధానానికి తీసుకొచ్చి ఈ రోజు సరస్వతీ దేవిని నిజమైన సరస్వతీ దేవిగా చేయడమే కాకుండా ఆ అమ్మాయి మరలా ఇతర దేశాల్లో చదువుకోవడానికి రూ.10లక్షల వరకు ఇవ్వడం జరుగుతోంది.

అధ్యక్షా, వెలుగు డ్వాక్రా గ్రూపుల ద్వారా లక్ష్మీ దేవిని నిజమైన లక్ష్మీ దేవిగా తీర్చిదిద్దడం జరుగుతోంది. దుర్గా అనే అమ్మాయిని పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న వారిలో చాలా భాగం మహిళలు ఉన్నారు. ఈ రోజు సగ భాగం పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్నారు. చివరకు మహిళలు కూడా ఆటో డ్రైవర్లుగా ఆటోలు నపడపానికి కూడా ముందుకు రావడం జరుగుతోంది. వారి వెన్నంటే ఉండి మీరు ముందుకు రావాలనే ధైర్యాన్ని కల్పించింది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారే కాబట్టి, ఈ రోజు దళితులు సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ ఉపయోగించుకుంటూ ముందుకు వచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందడం వల్లన ఈ రోజు నారా చంద్రబాబు నాయుడు గారిని ప్రతి ఒక్కరూ 'శతమానం భవతి' అంటున్నారనడంలో ఎలాంటి అసత్యం లేదని నేను తెలియజేస్తూ ముగిస్తున్నాను.

మ.12.30

**శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, గిరిజన సంక్షేమంపై మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఈ రోజు అడవి తల్లి బిడ్డలు చక్కగా చదువుకోగలుగుతున్నారంటే, మైదాన ప్రాంతాలకు వచ్చి తిరుగుతున్నారంటే అందుకు మహానుభావుడు శ్రీ నందమూరి తారక రామారావు చేసిన కృషేనని నేను మనవిచేస్తున్నాను. అడవిబిడ్డలు అడవిలోనే ఉండకూడదు, వారు కూడా పాఠశాలలకు వెళ్లి చదువుకోవాలి అనే ఉన్నతాశయంతో ఎన్.టి.ఆర్‌గారు మారుమూల గిరిజన ప్రాంతాలలో స్కూళ్లు పెడితే ఆనాడు చాలా మంది నవ్వుకున్నారు. ఇక్కడ స్కూళ్లకు ఎవరు వెళతారు, అవన్నీ వృథా అని అనుకున్నారు. అయితే, అదే పాఠశాలలకు ఈనాడు టెస్ట్‌లు నిర్వహించి ఎవరికి ఎక్కువ మార్కులు వస్తే వారినే జాయిన్ చేసుకునే స్థితికి తీసుకువచ్చినటువంటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి గిరిజనులందరి తరఫున ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

అధ్యక్షా, మారుమూల ప్రాంతాలలో చదువుకునేందుకు నాలుగైదు కి.మీ. నడచి వెళ్లాలంటే ఎవరూ కూడా వెళ్లలేని స్థితిలో, తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిపోతే, పిల్లలు ఇంట్లోనే ఖాళీగా ఉన్న పరిస్థితుల్లో ఆనాడు స్కూళ్లు

పెట్టడం వల్ల పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. ముఖ్యంగా పాఠశాలలు లేని సమయంలో బాల్యవివాహాలు జరిగేవి. 12, 13 సంవత్సరాలకే పెళ్లిళ్లు చేసి వారి బ్రతుకులు అన్యాయమవుతున్న తరుణంలో ఈ పాఠశాలలు పెట్టడం వల్ల పిల్లలందరూ చక్కగా చదువుకోగలుగుతున్నారు. ఈనాడు 44,345 మంది గిరిజన విద్యార్థులు అన్ని పాఠశాలల్లోనూ చదువుకుంటున్నారంటే అది కచ్చితంగా ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ కార్యక్రమంలో ముఖ్యమైన కార్యక్రమంగా నేను భావిస్తున్నాను. విద్యార్థులు కంప్యూటర్‌తో బాటు అన్ని సౌకర్యాలతో విద్యను అభ్యసించాలంటే కచ్చితంగా వారికి గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూల్స్ ఉండాలని వాటిని ఏర్పాటు చేసి, గిరిజనులు అభివృద్ధి చెందడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. రెసిడెన్షియల్ స్కూల్స్ కట్టడానికి ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయించినందుకు గిరిజనులు అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వారు ఇంకా నైపుణ్యం పెంచుకోవడానికి వై.టి.సి. భవనాలను నిర్మించి అందులో గిరిజన యువతకు శిక్షణనిప్పించి ఉపాధి సౌకర్యాలను కల్పించేందుకు తోడ్పడుతున్నారు. పదవ తరగతి పాసయినా, తప్పినా, ఇతరత్రా కారణాలవల్ల చదువు ఆపిన వాళ్లకైనా వై.టి.సి. భవనాలలో శిక్షణనిప్పించి వాళ్లకు ఉద్యోగం వచ్చే వరకు ప్రభుత్వం పూర్తిగా శ్రద్ధ తీసుకోవడం జరుగుతోంది.

అధ్యక్షా, ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్‌సీస్ క్రింద సహాయం అందించి విదేశాలలో చదువుకునే అవకాశాలను కూడా కల్పిస్తున్న ప్రభుత్వానికి మరొక్కసారి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. గిరిజనులు ఎక్కువగా నివసించే ప్రదేశాలలో ఐ.టి.డి.ఎలను ఏర్పాటు చేసి వాటి ద్వారా చదువుకోవడానికే కాకుండా వ్యవసాయానికి కూడా ఈ ప్రభుత్వం పూర్తి సహకారం అందచేస్తున్నది. మామిడి, జీడిమామిడి, ప్రత్యేకంగా చెప్పకునే అరకు కాఫీ పంటలకు చేయూతనిచ్చి గిరిజనులు వ్యవసాయంలో ముందుండడానికి, వ్యవసాయ పరికరాలు కొనుక్కోవడానికి 90 శాతం సబ్సిడీ ఇస్తూ వారికి సహకారం అందజేస్తున్నది. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ద్వారా రింగ్ రోడ్లు వేయడానికి, ఔటర్ రింగ్ రోడ్లు వేయడానికి ఖర్చు చేసిన గత ప్రభుత్వాలతో పోల్చుకుని చూసినప్పుడు ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ నాలుగు సంవత్సరాలలో రూ.10,000 కోట్లను ఎస్టీలకు త్రాగునీరు, రోడ్లు తదితర అవసరాలకు వెచ్చించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారిదేనని మనవిచేస్తున్నాను.

ప్రతి మారుమూల పల్లెటూర్లో కూడా మంచినీరు రావాలనే సంకల్పంతో మంచినీటి కోసం రూ.156 కోట్లను కేటాయించి అందరికీ త్రాగునీటిని అందించిన ఘనత కూడా ఈ ప్రభుత్వానిదే అధ్యక్షా. గతంలో ఎక్కడైనా ఇళ్లు ఇచ్చే కార్యక్రమం జరిగితే ముందుగా బాగా పలుకుబడి ఉన్నవాళ్లకే వచ్చేవి. కానీ, ఈ ప్రభుత్వం ఇళ్లను ఇచ్చే కార్యక్రమంలో కచ్చితంగా ఎస్టీలకు ఒక కోటా పెట్టి ఆ కోటాలోనే ఇళ్లను ఇవ్వాలి, ఇవ్వకపోతే వాటిని అలాగే ఉంచేయండి అని చెప్పడం జరిగింది. మారుమూల గ్రామాలలో, హిల్‌టాప్‌లో ఉన్న గ్రామాలలో కూడా ఎక్కడ ఎస్సీలు, ఎస్టీలు ఉన్నారో చూసి వారికి ఇళ్లను కేటాయించి, అలాగే వారికి ఐటిడిఎల ద్వారా అవసరమైన ఆర్థిక సహాయాన్ని ముందే అందిస్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగారు చొరవ చూపిస్తున్నారు.

అధ్యక్షా, అటవీ హక్కుల చట్టం వచ్చిన తరువాత గిరిజనుల భూమి పూర్తిగా వాళ్ల ఆధీనంలోనే ఉండి వాటిని సాగుచేసుకోవడం జరుగుతున్నది. భూమిలేని నిరుపేదలకు భూమి కొని ఇవ్వడం కూడా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో ఒక భాగమేనని నేను మనవిచేస్తున్నాను. 1956వ సంవత్సరంలో జిసిసిని ఏర్పాటు చేసి దాని ద్వారా గిరిజనులు పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేసి గిరిజనులకే పూర్తిగా డబ్బులు వచ్చే విధంగా చేయడమవుతున్నది. గిరిజనులు పండించిన ఉత్పత్తులను అమ్మడం ద్వారా వచ్చిన సొమ్ము గిరిజనులకే వచ్చే విధంగా జిసిసి పనిచేస్తున్న విషయాన్ని మనం మరచిపోలేము.

అధ్యక్షా, పెన్షన్ల గురించి చెప్పాలంటే కొండమీద గ్రామాలలో ఉండే ఎస్టీలకు 50 సంవత్సరాల తరువాత ఆరోగ్యం పాడయ్యే ప్రమాదముంటుంది. అందువల్ల ప్రత్యేకంగా కొన్ని వర్గాల వారికి 55 సంవత్సరాలకే పెన్షన్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికే దక్కుతుంది. మారుమూల గిరిజన గ్రామాలలో ఐసిడిఎస్‌ల ద్వారా, గిరిగోరుముద్దలు కార్యక్రమం ద్వారా పౌష్టికాహారం ఏర్పాటు చేయడం జరిగింది. గిరిజన పిల్లలు ఎక్కడెక్కడ ఉన్నారో వారి కొరకు రూ.40 కోట్లతో ఫుడ్ బాస్కెట్స్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న మహిళలందరికీ కూడా రూ.100 కోట్లు కేటాయించి శానిటరీ నాప్కిన్స్ ఇవ్వడం ద్వారా మహిళల ఆరోగ్య రక్షణ పట్ల ఈ ప్రభుత్వం ముందడుగు వేస్తున్నది. తద్వారా గిరిజన గ్రామాలలో, గిరిజన ప్రాంతాలలోని అమ్మాయిలకు చాలా సౌకర్యంగా ఉంటున్నది.

అలాగే, ఇంతమంచి కార్యక్రమాలలో రాష్ట్రప్రభుత్వం అన్ని విధాలుగా గిరిజనులకు అండగా నిలుస్తున్న తరుణంలో మాకు ఒక్క లోటు మాత్రం మిగిలింది అధ్యక్షా. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాలలో చాలా ఎక్కువగా గిరిజనులు ఉంటారు. అరకు పార్లమెంటరీ నియోజకవర్గం అయింది. మాకు గిరిజన యూనివర్సిటీ ఇస్తామన్నారు. మమ్మల్ని త్రిశంకు స్వర్గంలో ఉంచారు. ఇస్తున్నారో లేదో తెలియదు, శాంక్షన్ అయిందో లేదో తెలియదు, అసలు వస్తుందో రాదో ఎవరికీ తెలియదు. ఆ రోజు గిరిజన యూనివర్సిటీ వస్తుందంటే అందరం చాలా సంతోషించాము. ఎందుకంటే పిల్లల్ని దూర ప్రాంతాలకు పంపించి చదివించలేక చిన్నతనంలోనే చదువు మాన్పించే పరిస్థితి మనం చూశాము. ఎప్పుడైతే పాఠశాలల్లో పదవతరగతి వరకూ విద్యాబోధనను పెంచారో అప్పుడు పిల్లలు కూడా పదవతరగతి వరకూ చదువుకున్నారు. ఎప్పుడైతే రెసిడెన్షియల్ స్కూల్స్ పెట్టారో అప్పుడు ఇంటర్ వరకూ చదువుకున్నారు. ఆ తరువాత డిగ్రీ కళాశాలలు పెడితే డిగ్రీవరకూ చదువుకున్నారు. కాబట్టి గిరిజన యూనివర్సిటీ పెడితే కచ్చితంగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తారు. ఈ సమయంలో నేను చెప్పవలసిన విషయమేమింటే అధ్యక్షా, గిరిజన యూనివర్సిటీకి 526 ఎకరాల స్థలాన్ని రాష్ట్రప్రభుత్వమే కొనుగోలు చేసి ఇక్కడ గిరిజన యూనివర్సిటీ కట్టవచ్చు అని చూపించింది. కానీ, ఈ నాలుగేళ్లలో కేవలం రూ.10 కోట్లు మాత్రమే శాంక్షన్ చేశారు. దానితో కనీసం కాంపౌండ్ వాల్ కూడా కట్టుకోలేము. కాబట్టి, యూనివర్సిటీని ఇస్తున్నట్లో, ఇవ్వనట్లో మాకు అర్థం కావడం లేదు.

రాష్ట్రప్రభుత్వం చేస్తున్నటువంటి అన్ని సంక్షేమ కార్యక్రమాల్లో గిరిజన యూనివర్సిటీ కోసం రూ.5 కోట్లు మంజూరు చేసి ఈ రాష్ట్రప్రభుత్వం ముందుకు వచ్చింది. గిరిజన పిల్లలు ఎవరైతే చక్కగా చదువుకుంటున్నారో వాళ్లందరికీ అంబేద్కర్ ఓవర్సీస్ ద్వారా విదేశాలకు పంపించడమవుతున్నది. అలాగే, ఐఎఎస్, ఐపిఎస్, గ్రూప్-1, గ్రూప్-2, రాయాలనుకుంటున్నవారికి ఉచితంగా మెటీరియల్‌ను అందించి, శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి, శిక్షణనిచ్చిన ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

అధ్యక్షా, పేద గిరిజనులు ఆడపిల్లల పెళ్లిళ్లు చేయాలంటే అప్పులపాలయ్యేవారు. అటువంటిది ఈనాడు గిరిజన మహిళలకు గిరిపుత్రిక కల్యాణ పథకం ద్వారా చంద్రబాబు నాయుడు గారు ఒక తండ్రిగా, అన్నగా ఆడపిల్లలను ఆదుకున్న తరుణంలో మా అందరి తరపున ధన్యవాదాలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మ.12.40

**శ్రీ అంగర రామ్మోహన్:** అధ్యక్షా, సంక్షేమం మీద మాట్లాడే అవకాశం నాకు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్న ప్రబోధంతో మన ఆంధ్రుల ఆరాధ్య దైవం స్వర్గీయ ఎన్టీ రామారావు గారు ఎక్కువగా ప్రభోదిస్తూ, సంక్షేమానికి మొట్టమొదటి నిర్వచనం చెప్పి

ఈ రాష్ట్రప్రజల మనస్సును దోచుకున్నారు. అదేవిధంగా, ఎన్టీఆర్ గారి పార్టీలో మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు కూడా సంక్షేమానికి పెద్దఎత్తున అవకాశాలిస్తూ పేదలకు చేయూతనిస్తున్నారు. ప్రధానంగా ఈనాడు ఒకపక్క విభజన కష్టాలు వెంటాడుతున్నా, ఆ కష్టాలను అధిగమిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్న ఘనత ఈనాడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వానికే దక్కింది. రాష్ట్ర విభజన నాటికి రూ.16,000 కోట్లు రెవిన్యూ లోటు ఉన్నప్పటికీ కూడా సంక్షేమ కార్యక్రమాలను పెద్దఎత్తున అమలుచేస్తున్న విషయాన్ని మనమందరం కూడా గమనించాలి. ప్రతి సంవత్సరం రూ.65,000 కోట్లు కేవలం సంక్షేమం కోసమే ఖర్చుపెడుతున్న విషయాన్ని మనమంతా అభినందించాల్సిన అవసరముంది. మూడున్నర సంవత్సరాల కాలంలో, రెండు లక్షల కోట్లు సంక్షేమానికి ఖర్చుపెట్టిన విషయాన్ని కూడా మనమంతా గమనంలోకి తీసుకోవాలి.

ఇతర రాష్ట్రాలు కూడా మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నాయి. ఇవాళ ఎన్టీఆర్ వైద్యం, రైతు రుణమాఫీ, చంద్రన్న బీమా, ఎన్టీఆర్ భరోసా వంటి కార్యక్రమాల్ని ఇతర రాష్ట్రాల వారు వచ్చి చూసి, సర్వే చేసి వెళ్లడం కూడా మనమంతా గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు పెద్దఎత్తున అమలుచేస్తూ, క్రింద వరకు పేదవారికి వాటి ఫలాలును అందజేస్తూ, సర్వేల్లో కూడా వారు సంతృప్తిని పొందుపరచడమన్నది చాలా ఆనందదాయకమైన విషయంగా తెలియజేస్తున్నాను.

ప్రధానంగా మొదటి నుండి కూడా వెనుకబడిన వర్గాల వారికి అత్యధికమైన ప్రాధాన్యత ఇస్తూ, ఆనాటి ఎన్టీ రామారావు గారి నుండి మొదలుకుని, ఈనాటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి వరకు కూడా పెద్ద ఎత్తున వీళ్ల ప్రయోజనం కోసం అత్యధికమైన కేటాయింపులు చేశారు. సుమారు రూ.25,000 కోట్లు గత మూడు సంవత్సరాల్లో ఖర్చుపెట్టిన విషయాన్ని మనం ఎవ్వరూ కూడా మరువలేము. ఈ సంవత్సరం మన ఆర్థికశాఖామంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు గారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.4,700 కోట్లు బీసీల సంక్షేమం కోసం ఖర్చుపెట్టడం జరుగుతోంది. కులవృత్తులు, చేతివృత్తులు క్షీణించిపోతున్న పరిస్థితిలో వాటిని మళ్లీ పునరుద్ధరించాలన్న సంకల్పంతో చేనేత కార్మికులకు గాని, మత్స్యకారులకు గాని, ఫెడరేషన్లకు గాని ఎక్కువ నిధులివ్వడం జరుగుతోంది. రూ.750 కోట్లు ఖర్చుపెట్టి ఇవాళ ఈ ఆదరణ పథకాన్ని మళ్లీ తీసుకువచ్చి, పనిముట్లు ఇవ్వడానికి కూడా నిర్ణయం తీసుకోవడాన్ని గొప్ప నిర్ణయంగా తెలియజేస్తున్నాను. గతంలో ఫెడరేషన్లు నామమాత్రంగానే పనిచేసేవి. డా.వై.ఎస్.రాజశేఖర రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 5 సంవత్సరాల్లో కేవలం రూ.39 కోట్లు మాత్రమే ఖర్చుపెడితే, రెండు సంవత్సరాల్లో రూ.278 కోట్లు మన ప్రభుత్వం ఖర్చు చేసిన విషయాన్ని ఎవ్వరూ కూడా మరువరు. ఈ సంవత్సరం కూడా రూ.600 కోట్లు ఫెడరేషన్లకు కేటాయించడమన్నది చిన్న విషయమేమీ కాదు. ఒకప్పుడు జీతభత్యాలు ఇవ్వడానికే ఫెడరేషన్లు అన్న విధంగా ఉండేవి. కానీ, ఇప్పుడు బీసీ కార్పోరేషన్లు, ఫెడరేషన్లు ఆర్థికంగా బలోపేతమై బీసీ వర్గాల వారి జీవన ప్రమాణాలు మారే విధంగా కృషి చేస్తున్నాయి.

అలాగే, మన ప్రభుత్వం ఎడ్యుకేషన్ విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని, దాదాపుగా రూ.2,200 కోట్లు కేటాయించి, బీసీ విద్యార్థులు చదువుకు దగ్గరయ్యే విధంగా, వెనుకబడిన వర్గాల వారికి ఉపయోగపడే విధంగా ఈ సంవత్సరం కూడా కేటాయింపులు చేశారు. ఈ విధంగా ఆర్థికంగా వెనుకబడ్డ వారి సంక్షేమానికి కూడా రూ.100 కోట్లు కేటాయించారు. సంచార జాతులకు గతంలో రూ.60 కోట్లు కేటాయించినప్పటికీ, అవి క్రింది స్థాయిలో ఖర్చు కాలేదు. ఆ రూ.60 కోట్లు గత సంవత్సరం ఖర్చుకు నోచుకోలేదు. అవి ఈ సంవత్సరం ఖర్చుపెట్టి, వాళ్లు బాగా వెనుకబడి ఉంటారు కనుక.. చిన్న చిన్న జాతులు అంటే పాములుపట్టే వాళ్లు, బుట్టలు అల్లేవాళ్లు, గంగిరెద్దులు ఆడించేవారు. ఇలాంటి కులాలన్నీ సంచార జాతుల్లో ఉన్నాయి కనుక, వాళ్లని ఆదుకునేందుకు అవసరమైతే గత సంవత్సరం రూ.60 కోట్లు ఖర్చు పెట్టుకునే పరిస్థితి కనపడలేదు గనుక, ఈ సంవత్సరం కేటాయించిన దాంతో కలిపి రూ.160 కోట్లు ఖర్చుపెట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

అలాగే, వెనుకబడిన కులాల్లో ఆడపిల్లల పెళ్లికి రూ.35,000 కేటాయించడం జరుగుతోంది. ఈరకంగా పెళ్లికి డబ్బులు కేటాయించడం వల్ల గృహహింస గాని, లేకుంటే బాల్యవివాహాలను అరికట్టడానికి గాని, అనేక కార్యక్రమాల్ని నిరోధించడానికి గాని ఇవాళ వాళ్లకెంతో ఉపయోగపడుతోంది. పెళ్లి చేయడమే చాలా భారమయ్యే పరిస్థితుల్లో, ఇవాళ ఆడపిల్లల పెళ్లిళ్లకోసం నిధులు కేటాయిస్తూ, 40,000 మంది వధూవరులకు ఉపయోగపడే విధంగా రూ.100 కోట్లు కేటాయించిన విషయాన్ని గమనిస్తే, సంక్షేమ రంగంలో పెద్దఎత్తున బీసీలకు ప్రాధాన్యత కల్పిస్తున్న విషయాన్ని

ఎవ్వరూ మరువలేరనే విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ విధంగా వెనుకబడిన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న పరిస్థితులను మనమందరం గమనంలోకి తీసుకోవాల్సిన అవసరముందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఎస్సీల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులను కేటాయించడంతోబాటు, గత నాలుగు సంవత్సరాల్లో రూ.29000 కోట్లు కేటాయించి ఎస్సీ సబ్‌ప్లాన్‌ని సమర్థవంతంగా అమలుచేస్తున్న పరిస్థితులను గమనిస్తే, ఎస్సీలందరూ కూడా చాలా సంతోషపడాల్సిన విషయం ఇది. ఎస్సీ కార్పొరేషన్‌లో గతంలో రూ.68 కోట్లకు మించి ఖర్చుపెట్టుకునే పరిస్థితి ఉండేది కాదు. మరి గత సంవత్సరం చూస్తే, రూ.2200 కోట్లు ఎస్సీ లబ్ధిదారులకు ఖర్చుపెట్టిన విషయం మరువరాని విషయంగా తెలియజేస్తున్నాను.

అలాగే, షెడ్యూల్డ్ ట్రైబ్స్ విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటూ వాళ్లకి 70 ఏళ్లు స్వాతంత్ర్యం వచ్చినా కూడా త్రాగడానికి కనీసం నీళ్లు కూడా లేని పరిస్థితిలో, కనీస సౌకర్యాలు కూడా లేని పరిస్థితిలో ఇవాళ రోడ్లకు, త్రాగునీటికి రూ.1500 కోట్లు ప్రత్యేకంగా కేటాయింపులు చేసినందుకు ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా అభినందిస్తున్నాను. ఈ సంక్షేమ కార్యక్రమాల అమలులో కేంద్ర ప్రభుత్వం ఒక రకంగా సహకరించకపోయినా కూడా, మన రాష్ట్రంలో ఉన్న ఆదాయంతో మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఇన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నందుకు ఈ సభ ద్వారా ఆయన్ని పూర్తిగా అభినందిస్తూ, మేమందరం కూడా బలపడుతున్నామని ఈ సందర్భంగా తెలియజేస్తూ, నాకీ అవకాశమిచ్చినందుకు మీకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అధ్యక్షా.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం (ఉపాధ్యాయ నియోజకవర్గం – చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు):** అధ్యక్షా, సంక్షేమాన్ని గురించి చర్చ జరుగుతున్నప్పటికీ నా వరకు నేను గిరిజన సంక్షేమానికి మాత్రమే పరిమితమౌదామని అనుకున్నాను. మేము బిజినెస్ అడ్వయిజరీ కమిటీలో కూడా ప్రత్యేకించి గిరిజన సంక్షేమం మీద చర్చను చేపట్టాలని కోరాము. గతంలో కూడా ఈ చర్చ పెద్దగా జరగలేదు. ఆంధ్రప్రదేశ్‌లో 5 జిల్లాల్లో షెడ్యూల్డు ప్రాంతం ఉంది. మిగతా 8 జిల్లాల్లోని మైదాన ప్రాంతాల్లో గిరిజనులు ఉన్నారు. సుమారు 34 తెగలు ఉంటే, 24.45 లక్షల జనాభా అంటే 5.33 శాతం జనాభా మన రాష్ట్రంలో ఉంది. మీరిచ్చిన లెక్క ప్రకారం చూస్తే, రూ.8641 కోట్లు ఈ నాలుగేళ్లలో ఖర్చుపెట్టినట్లు ఉంది. ఈ మొత్తం సొమ్మును గిరిజనులకు గనుక పంచినట్లయితే నాలుగేళ్లలో కలిపి రూ.31000 పైచిలుకు వచ్చి ఉంటుంది. దీన్నిబట్టి మనం గొప్పగా చెప్పుకున్నప్పటికీ, వాస్తవానికి ఒక గిరిజనుడికి సగటున ఎంత దక్కిందనేది గనుక చూసినట్లయితే చాలా తక్కువ మొత్తం. నేను రెండు, మూడు విషయాల్ని ఈ సందర్భంగా చెప్పదలచాను. గిరిజనుల గురించి, వాళ్ల సంక్షేమాన్ని గురించి మాట్లాడుకునేటప్పుడు మొదట వారిపట్ల అపారమైన ప్రేమ, వారి సంస్కృతి పట్ల, జీవన విధానంపట్ల, చరిత్ర పట్ల గొప్ప గౌరవం ఉన్నప్పుడు మాత్రమే ఇది సాధ్యమౌతుంది.

అలా కాకుండా ఏదో పథకాలను అమలుచేయడం వరకు పరిమితమైనట్లయితే, ఎంత దూరం పోయినా అంతే ఉంటుంది.

ఉదాహరణకు ఈ రాష్ట్రంలో ఉన్న చెంచులు. కర్నూలు ప్రాంతంలో ఉండే చెంచులు గురించి మీకు తెలుసు. ఆంధ్రప్రదేశ్‌లో మైదాన ప్రాంతాలను మినహాయిస్తే తెలుగు మాట్లాడేటటువంటి ఏకైక గిరిజన తెగ చెంచులు. అంతేకాదు. వాళ్ల తెలుగును గనుక ఎవరైనా జాగ్రత్తగా క్రోఢీకరించగలిగినట్లయితే వారిది ఆదిమ తెలుగు. తెలుగులోని మూలపదాల్ని మొత్తాన్ని అందులో నుండి చూడొచ్చు. ఒక సాధారణ చెంచు నాయకుడి దగ్గరకు వెళ్లి మాట్లాడినట్లయితే, సగర్వంగా వాళ్లు ఏమని చెబుతారంటే – శ్రీశైలం మల్లన్నకి, శ్రీ కృష్ణ దేవరాయలకైనా దారి చూపించిన వాళ్లం మేమే. అడవుల్లో మా నాయకులు, మా కార్యకర్తలు ఎవరినైనాసరే తీసుకువెళ్లి మేము చూపించేవాళ్లము. శ్రీశైలం మల్లన్నను ఆ రకంగా నిలబెట్టాము, జనానికి పరిచయం చేశామని గర్వంగా చెప్పుకుంటారు వారు. యాదగిరి నరసింహస్వామికి మా ఆడపడుచుని ఇచ్చాము, ఆయన మా అల్లుడని చెప్పి వారు చెప్పుకుంటారు. వాళ్లకీ ఒక చరిత్ర ఉంది. వాళ్లకీ ఘనమైన వైభవము, ప్రాభవము ఉన్నాయి.

అధ్యక్షా, నేను ఒక సందర్భంలో గుమ్మలక్ష్మీపురం అడవుల్లో ఒక సందర్భంగా తిరుగుతూ ఉండేటప్పుడు, ఒక ఆశ్చర్యకరమైన విషయాన్ని అక్కడున్న అస్సాంకు చెందిన ఒక కార్యకర్త నాకు చెప్పాడు. అక్కడ ఒక పెద్ద చెక్‌డ్యాం లాంటిది కట్టాలని అనుకున్నారు. అలా అనుకుంటే ఆ కాంట్రాక్టరు కొద్ది రోజులు పనిచేసిన తరువాత పనులు ఆపేసి తన దారిన తాను వెళ్లిపోయాడు. విషయం ఏమిటంటే అక్కడ ఒక పెద్ద బండ ఉంది. ఆ బండను పగులగొడితే గాని చెక్‌డ్యాం నిర్మించడం సాధ్యం కాదు, మాకు ప్రత్యేకంగా బడ్జెట్ ఇవ్వండని ఆయన అడిగారంట. అప్పుడే పనులు వదిలేసి వెళ్లిపోయారు. కొన్ని రోజుల తరువాత ఈ అస్సాం నుండి వచ్చిన సామాజిక కార్యకర్త ఏమి చెయ్యాలని, అక్కడి గిరిజనులందర్నీ కూర్చోబెట్టి అడిగితే, ఆ పని మాకు అప్పజెప్పండి మేం ఆ బండను పగులగొట్టేస్తామని అన్నారంట. మీరు ఎలా పగులకొడతారని అడిగితే – ఆశ్చర్యకరంగా వాళ్లు మాకు కావాల్సింది కొంచెం కిరోసిన్ మాత్రమే అన్నారంట. బండ చుట్టూ పెద్ద ఎత్తున మంటపెట్టి, మంటలు వచ్చి బండ బాగా కాలేదాకా ఉంచి, ఆ బండ మీద నీళ్లుపోసి, అది కొంచెం పగిలితే మళ్లీ దాంట్లో కొంచెం గుడ్డపీలికలు పెట్టి, కిరోసిన్ పోసి, మళ్లీ తగులపెట్టి, మళ్లీ నీళ్లు పోసి, మళ్లీ తగులబెట్టి, మళ్లీ నీళ్లు పోసి.. ఇలా మొత్తానికి 5 రోజుల్లో ఆ బండను కాస్తా సాధారణ గిరిజనులు పగుల గొట్టేశారని చెప్పినప్పుడు నాకు ఆశ్చర్యమే కాదు, గొప్ప ఆవేశం కూడా కలిగింది.

మ. 12.50

అధక్షా, అలాగే సమ్మక్క, సారమ్మ వ్యవహారం వంటివి చాలా చెప్పవచ్చు. భారతదేశంలో స్వరాజ్యం కొరకు పోరాడి, బలిదానాలు చేసినవారిలో అందరికంటే మొదట గిరిజనులున్నారు. అటువంటివారే అల్లూరి సీతారామరాజు. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని, గిరిజన అధికారులను ఒకటి కోరుతున్నాను. గిరిజన శాఖ అధికారులు ఇక్కడ ఉన్నారని

అనుకుంటున్నాను. Haimendorf అనే Austrian Anthropologist ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన గిరిజనుల మీద చాలా కాలం పరిశోధనలు చేశారు. పరిశోధనలే కాదు వాళ్ళ మధ్యలోనే ఆయన పదేళ్ళపాటు జీవించారు. తన కొడుక్కి అక్కడున్న లచ్చుపటేల్ అనే గిరిజనుడి పేరుకూడా పెట్టుకున్నారు. వాళ్ళ మధ్యలోనే ఆయన భార్య చనిపోతే గోండుల సంప్రదాయంలో ఆమెని సమాధిచేశారు. ఆఖరుకి అక్కడున్నటువంటి వాళ్ళందరూ కూడా ఇప్పటికీ జంగూబాయి అనే పేరుతో ఆమెను దేవతగా ఆరాధిస్తారు. అటువంటి Haimendorf ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గిరిజనులమీద మూడు గ్రంథాలు రచించారు. నేను కావాలనే ఇక్కడ వీరిగురించి ప్రస్తావిస్తున్నాను. 'The Reddis of the Bison Hills' అని భద్రాచలంలో ఉన్న కొండరెడ్లను గురించి, 'The Raj Gonds of Adilabad' అదిలాబాద్‌లోని గోండులకు సంబంధించి, 'The Chenchus of the Hyderabad State' అని మూడు గ్రంథాలు రాశారు.

అధ్యక్షా, నేను శాసనపరిషత్తు సభ్యునిగా ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు Haimendorf గారు రాసిన ఈ మూడు పుస్తకాలను మళ్ళీ ఒకసారి ముద్రించండి. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గిరిజనులకు సంబంధించిన అద్భుతమైన చరిత్రను ఆ గ్రంథాలలో ఆయన అమోఘంగా ప్రస్తావించారు. ఇంతకంటే గొప్ప గ్రంథాలు మళ్ళీ మనం తయారుచెయ్యలేక పోవచ్చు. దయ ఉంచి వాటిని తిరిగి ముద్రించండి అని అడిగి అడిగి మానుకున్నాను. ఈ మధ్యకాలంలో అయితే నాకు అవి ఇస్తే నేనే ముద్రిస్తానని కూడా అడిగాను. ఇప్పుడైనా ఆ పనిచేయమని చెప్పి ఇక్కడున్న గిరిజన శాఖామంత్రిగారిని, గిరిజన శాఖాధికారుల్ని అడుగుతున్నాను. ఎందుకు నేను ఈ విషయం చెప్పానంటే గిరిజనుల్లో పనిచెయ్యాలంటే వాళ్ళ మనుషులమని అనిపించుకోవాలి. వాళ్ళతో తాదాత్మ్యం చెందాలి. అలా కాకుండా ఊరికే అధికారులద్వారా, పథకాలద్వారా, రాజకీయ విన్యాసాలద్వారా గిరిజన అధికారం జరగదు. 2010-15 గిరిజన సాధికార విధానమని ఈ రాష్ట్ర ప్రభుత్వం ఒక గిరిజన విధానాన్ని ప్రకటించింది. ఆ ప్రకటించిన విధానంలో ఏవి ఉన్నాయి, అప్పుడు చూపించిన బలహీనతలేమిటి? ఏమి చెయ్యాలని లక్ష్యాలుగా పెట్టుకున్నారు? 2015 తరువాత ఎప్పుడైనా ఈ లక్ష్యాల్ని ఎంతదూరం మనం సాధించగలిగినాము? ఏమి చెయ్యగలిగినాము? ఏమి చెయ్యలేకపోయినాము? అనే ఒక సమీక్ష జరిగిందా. అలా ఏమీ లేకుండా దాన్ని గాలికి వదిలేశారు.

అధ్యక్షా, గిరిజన సమాజాల్లో అత్యల్ప అభివృద్ధి, స్వల్ప మౌలికసదుపాయాలు, ఔత్సాహిక దృక్పథం లేకపోవడం, సహజ వనరులపై నియంత్రణ లేకపోవడం, అన్ని అభివృద్ధి సూచికల్లో దిగువన ఉండడం, పెక్కుమంది మోసానికి గురి కావడం, ఉపాధి లేకపోవడం, విద్యకు అనువుకాకపోవడం, పౌష్టికాహారం లేకపోవడం, అభద్రతతో ఉండడమనేది రాష్ట్ర ప్రభుత్వం 2010 సంవత్సరంలో గిరిజన సాధికారత విధానాన్ని ప్రకటిస్తూ వారికి సంబంధించి ఆరోజు చెప్పిన లోపాలు. గిరిజనులకు సాధికారత కల్పిస్తామనీ, వారి భూములకు రక్షణ కల్పిస్తామనీ, అటవీహక్కుల చట్టాన్ని అమలుచేస్తామని, వారసత్వ సంప్రదాయాల్ని పరిరక్షిస్తామని ఇలా ఇంకా చాలా పెద్ద పెద్ద మాటలు చెప్పారు. అయినా, ఈరోజుకు కూడా గిరిజనులకు సంబంధించిన చిన్న చిన్న పథకాలుకూడా వారికి చేరడంలేదు.

అధ్యక్షా, గిరిజనులకు కావలసింది మంచి చదువు. మంచి చదువును అందించడానికి మనమేం చేస్తున్నాము? గిరిజన పాఠశాలల్లోకి, గురుకులాల్లోకి, ఆశ్రమపాఠశాలల్లోకి, తండాల్లో ఉండే పాఠశాలల్లోకి వెళ్ళి అక్కడి పిల్లలకు విద్య ఎలా ఉందనేది పరిశీలించడం లేదు. అదేవిధంగా చలికాలంలో లంబసింగి వంటి ప్రాంతాల్లోనైనా వారికి దుప్పట్లు ఇవ్వగలుగుతున్నామా? వాళ్ళకొరకు మనమేం చేస్తున్నామని ప్రశ్నించుకోవాలి. వాళ్ళల్లో ఎంతమంది చదువుకున్నారు? చదువుకున్నవాళ్ళు ఏమైనారనే సర్వే చేసినట్లయితే మనకు ఎంతోకొంత తెలుస్తుంది.

అధ్యక్షా, కర్నూలు జిల్లాలో చెంచులకు సంబంధించి గిరిజనుల పిల్లలు పదవతరగతి, ఇంటర్మీడియట్‌దాకా చదువుకున్న పిల్లలు ఏమయ్యారనే దానిమీద నేను స్వయంగా ఒక సర్వే చేస్తే, ఆ చదువుకున్న వారిలో సగం మందికి పైగా మళ్ళీ ఉపాధి హామీ పథకానికి పోతున్నారే తప్ప అంతకంటే పైకి పోవడమనేది జరగలేదు. అది ఒక వాస్తవం. అలాగే 1/70 యాక్ట్ కానీ, 500 జనాభా దాటిన తండాలను పంచాయతీలుగా మార్చడం కానీ, భూములు, అటవీభూములపై వారికుండే హక్కులు కానీ, పెసా యాక్టు కానీ, పంచాయతీ వ్యవస్థలకు అధికారం ఇవ్వడంకానీ, ఇలా ఒక్కటంటే ఒక్కదాన్నైనా సరిగ్గా అమలుపరిచారా అని నేనైతే చాలా బాధాకరంగా అడుగుతున్నాను. చెంచులమీద నేను ప్రత్యేకంగా పరిశీలన చేశాను. హిందూ పత్రికలో కొద్దిరోజుల ముందర ఒక పెద్ద ఆర్టికల్ వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో అండమాన్ నికోబార్ దీవుల్ని అలా పక్కన పడేస్తే జనాభా తగ్గిపోతున్నటువంటి తెగ చెంచులు. ఎక్స్టెన్షన్‌కు గురవుతున్న తెగ ఇదే అని ఆ ఆర్టికల్‌లో వచ్చింది.

అధ్యక్షా, మాట్లాడడం ఆపేమంటే ఆపేస్తాను. ఆర్థికమంత్రిగారు ఇప్పుడు బడ్జెట్‌మీద కనుక సమాధానం చెప్పేటట్లుగా ఉంటే రేపు అవకాశం ఇస్తే మాట్లాడతాను. ఎందుకంటే మాకు కూడా ఏదైనా తాయిలాలు దొరుకుతాయని ఆర్థికమంత్రిగారి మీద ఆశతో ఉన్నాము కదా! కావాలంటే నేను మళ్ళీ మాట్లాడతాను. కొత్త సమాచారాన్ని నేను చెప్పాలనుకున్నాను.

**మిస్టర్ చైర్మన్:** కంప్లీట్ చేయండి మీరు. ఇంకా నాలుగు నిమిషాలు ఉంది.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం:** అధ్యక్షా, చెంచుల పరిస్థితి గురించి అధ్యయనం చేయడానికి మేము ఒక కార్యకర్తల బృందంతో ఆ ప్రాంతాలకు వెళ్తే మా కార్యకర్త ఒకరు వీళ్ళకి ఏమీ చేయాల్సిన అవసరంలేదు. అన్నం తినడం నేర్పిస్తే చాలన్నారు. భారతదేశంలోని గిరిజనుల్లో అత్యంత వెనుకబడిన వాళ్ళు కావడమే గాకుండా, వీరికి సంబంధించి ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ నివేదికకూడా ఒకటి ఉంది. డాక్టర్ రాజ్యలక్ష్మిగారు ఎం.ఎల్.సిగా మాతోపాటు ఉండేవారు. ఆమెను ఆ కమిటీకి వేస్తే ఆవిడ ఒక నివేదికను ఇచ్చారు. 30 సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికి చెంచులకు పునరుత్పత్తి శక్తి లేకుండా పోతోందని ఆ నివేదికలో ఇచ్చారు. కన్నీళ్ళు పెట్టుకునే విషయం ఇది. అంటే బిడ్డల్ని కనే శక్తిని వాళ్ళు కోల్పోతున్నారని ఆ నివేదికలో ఉంది. ఎంత బాధాకరమైన పరిస్థితి ఇది. లోతట్టులో ఉన్న చెంచులకు ఇప్పటికీ కూర వండుకుని తినడమనేది తెలియదు. అటువంటి బాధాకరమైన పరిస్థితి ఉంటోందని ఆ నివేదికద్వారా తెలిసింది. వాళ్ళ ఆహారం గురించి ఇలాగే చర్చ జరిగిన తరువాత వాళ్ళకు కొంతకాలంపాటు ఫుడ్

బాస్కెట్ ఒకటి ఇచ్చారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా రాజశేఖర రెడ్డిగారు ఉన్నారు. నువ్వు మాట్లాడినందువల్ల వారికి ఫుడ్ బ్యాస్కెట్స్ ఇస్తున్నామని వారు చాలా సంతోషంగా చెప్పారు. మూడు, నాలుగు సంవత్సరాలు ఆవిధంగా ఇచ్చిన తరువాత వాళ్ళందరికీ పౌష్టికాహారం వచ్చి వాళ్ళందరూ ఊబకాయంతో బాధపడుతున్నట్లుగా తెలుసుకున్నారో ఏమో నాకైతే తెలియదుకానీ మొత్తంమీద దాన్ని ఒక నాలుగైదు సంవత్సరాలపాటు మానేశారు. మళ్ళీ ఇప్పుడు ఈ సంవత్సరంలో దాన్ని ప్రారంభించారు. అందుకు నేను సంతోషపడుతున్నాను. అది ఇచ్చిన తరువాత వాళ్ళల్లో ఏ అభివృద్ధి వచ్చిందని మీరు అంచనా వేసి, సర్వేచేసి, నిర్ధారణకు వచ్చి ఆపేశారని అని ఆ ప్రభుత్వాన్ని నేను అడగడంలేదు. ఏ ప్రభుత్వమైనా ఏ నిర్ధారణతో దాన్ని ఆపిందని నేను ప్రశ్నించదలచుకున్నాను.

అధ్యక్షా, ఇది చాలా బాధాకరమైన విషయం. అభివృద్ధికి సంబంధించిన విషయం ఎలా ఉంటుందంటే ఎన్.టి.రామారావుగారు, ఎస్.ఆర్ శంకరన్ గారు వీళ్ళిద్దరూ గుమ్మలక్ష్మీపురం ప్రాంతానికి ఒకసారి పర్యటనకు ఆ అడవుల్లోకి వెళ్ళారు. ఆ గిరిజనులను చూసినప్పుడు ఏం చేస్తే వీళ్ళకి న్యాయం జరుగుతుందని సీరియస్‌గా ఒక చర్చ జరిగింది. శంకరన్‌గారు మహానుభావుడనే విషయం మీకు తెలిసిందే. వాళ్ళు అలా ఆలోచించి ఒకేసారి పదివేలమంది గిరిజనులకు క్వాలిఫికేషన్ ఉందా, లేదా అనే దానితో నిమిత్తం లేకుండా ఉపాధ్యాయులుగా ఉద్యోగాలిచ్చారు. ఆ తరువాత వారికి శిక్షణ ఇచ్చారనేది వేరే విషయం. ఇప్పుడు నిజంగా గిరిజనుల్లో అభివృద్ధి చెందినటువంటి వాళ్ళెవరంటే మొదటిదశలో ఆ పదివేలమందే ఉంటారు. మీరిచ్చిన సైకిళ్ళు, మీరిచ్చే గోరుముద్దలు, మీరు ఇచ్చిన చిన్న చిన్న ప్రోత్సాహకాలు తాత్కాలికమే తప్ప శాశ్వతంగా, సమగ్రంగా వారు అభివృద్ధి చెందాలంటే ఏం చెయ్యగలుగుతున్నాం. అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనుల అభివృద్ధికొరకు చాలా గొప్పగా కృషి చేసిన ఒకానొక మహానుభావుడు వెన్నెలకంటి రాఘవయ్యగారు. ఆయన యానాదులమీద ప్రత్యేకంగా కృషి చేశారు. ఆయన నెల్లూరు జిల్లాకు సంబంధించిన వ్యక్తి. ఆయన 'యానాదులు' అనే ఒక పుస్తకాన్ని రాశారు.

మ.01.00

అధ్యక్షా, ఆయన 1950-60 సంవత్సరాల మధ్య కాలంలోనే గిరిజన అభివృద్ధికి ఏం చేయాలో అద్భుతమైన ప్రణాళికను, వ్యూహాన్ని వివరించారు. 300 మంది గిరిజనులను ఒకచోట చేర్చడం, వారందరికీ రెండెకరాల భూమిని ఇవ్వడం, ఒక పాఠశాలను ఏర్పాటు చేయడం, చేపలు పట్టేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయడం, మొత్తం మీద ఐదారు సంవత్సరాల కాలంలో వారి జీవితాలలో తీవ్రమైన మార్పులు వచ్చే విధంగా సమగ్రమైన ప్రణాళిక పెట్టి గాంధీ గిరిజన సంఘం, మరొక గిరిజన సంఘం అనే పేర్లతో ఏర్పాటు చేశారు. He is a model. అలాంటి మోడల్స్‌ను ఎన్నుకోవడం లేదు.

అధ్యక్షా, శ్రీశైలంలో ఉండే చెంచులు ఏమని అడుగుతారంటే మమ్మల్ని ఆ శివరాత్రి పర్వదినంనాడు తప్ప మిగిలిన సమయాలలో కనీసం ఊడ్చేందుకు కూడా ఉపయోగించడం లేదు, అక్కడుండే ఉద్యోగాలు మాకు ఇవ్వండి,

ఆయన మా మల్లన్న, ఆయనకు మొదటి పూజ చేసేది మేమే అని అంటున్నారు. అక్కడుండే నాలుగవ తరగతి ఉద్యోగాలైనా వారికి కల్పించగలుగుతున్నామా? భూమి అనేది ఇవ్వకుండా, నైపుణ్యంతో కూడిన చదువు చెప్పించకుండా ఆ తరవాత వారికి ప్రత్యేకమైన ఉపాధి కల్పించకుండా స్థిరమైన ఆదాయం వచ్చే సంస్కృతిలోకి వారిని నెట్టకుండా, పీస్‌మీల్ వ్యవహారాల వలన ఎంత చేసినా ఉపయోగం ఉండదు.

నెల్లూరు జిల్లాలో ఉన్న చల్లా యానాదులు, నక్కలోళ్లు, పాకీ యానాదులను ఎవరైనా చూసినట్లయితే మన నాగరిక ప్రభుత్వాలన్నీ వాళ్ల కాళ్లమీద పడి దండం పెట్టాలనేలా ఉంటారు. ఎందుకంటే ఎవరైనా ఆంత్రోపాలజిస్టు వారిని చూసినట్లయితే, వారు మన పూర్వీకులు, వారి నుండి వచ్చాము, అసలు మనం అనేటటువంటిది వారి రూపం వారినుండే వచ్చింది, ఎక్కడి నుండి వచ్చారో, ఏయే రకాలుగా బ్రతికారో, ఏయే మూలికలు సంపాదించారో తెలుస్తుంది.

వైద్యశాస్త్ర పితామహుడు చరకుడు ఈ వైద్యమంతా తనకు గిరిజనులు నేర్పించారని చాలా సులభంగా తన పుస్తకం మొదటి పేజీలో రాసుకున్నాడు. చరకుడు, శుశ్రూతుడు వంటి వైద్యపితామహులు గొప్పగా చెప్పిన గిరిజనులు నుంచి మనం ఏం నేర్చుకున్నాము? వారి పరిస్థితి చూసినట్లయితే 5వ తరగతి దాటి చదివిన వారు చల్లా యానాదులలో ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. వారి కోసం నెల్లూరులో ఒక ఐటిడిఎ ఉంది, ఏం చేస్తున్నది అనేది దేవుడికెరుక. వారి దగ్గరికి పోవడం మనకు సాధ్యం కూడా కాదు. అయితే ఐటిడిఏ వాళ్లు ఏమంటారంటే గిరిజనులు రాలేదని, అప్లై చేయలేదని అంటారు. గోచి కట్టుకుని ఉండేవాడు ఎక్కడికి వచ్చి అప్లై చేస్తాడు? వాళ్ల దగ్గరకు వెళ్లడం చేతకాక, అప్లై చేయలేదంటున్నారు. ఒకసారి వాళ్ల దగ్గరికి మన శాసనమండలి సభ్యులు కూడా వెళ్లి మాట్లాడితే బాగుంటుంది.

**మిస్టర్ చైర్మన్:** ముగించండి.

**శ్రీ విటపు బాల సుబ్రహ్మణ్యం:** ఆధునికంగా ఉండే రెండు విషయాలు మాట్లాడి ముగిస్తాను. మీరు చాలా వేగంగా ఉన్నారు, నేను కూడా హడావుడిగా వచ్చాను, హడావుడిగా మాట్లాడుతున్నాను. నోరు లేని వారి గురించి కాస్త ఎక్కువగా మాట్లాడుకుందాము, వాళ్ల గురించి మాట్లాడితే న్యాయం చేసినవాళ్లమౌతాము. మమ్మల్ని గురించి కూడా ఇంత పెద్ద సభ నాలుగు మాటలు మాట్లాడుతోంది, నలుగురూ వింటారు, అనే ఒక్కమాటైనా వాళ్లకు కొంత తృప్తిని కల్గిస్తుందని నేను అనుకుంటున్నాను. పెద్ద పెద్ద విషయాలు, పెద్ద పెద్ద సభలలో మాట్లాడుకుందాము. ఈ నాలుగు మాటలు వాళ్ల గురించి మాట్లాడాను, పని జరగకపోతే పోయిందనే తృప్తి అయినా మాకు ఉండాలి. లేకపోతే ఎందుకంటారు? కావాలంటే సంస్కృతంలో భారీ ఉపన్యాసాలు మాట్లాడమంటే మాట్లాడతాను. కానీ ఏం ఉపయోగం ఉంది, ఎవరి గురించి మాట్లాడాలో వారి గురించి, ఏం మాట్లాడాలో అది మాట్లాడడమనేది అవసరం.

అధ్యక్షా, ఏ ప్రాజెక్టు కట్టినా బయటకు వెళ్లిపోయి త్యాగాలు చేయాల్సినవాళ్లు గిరిజనులు. ప్రాజెక్టులకు ప్రారంభం మనం చేస్తాము, నీళ్లు మనం అనుభవిస్తాము, ఇళ్లు, భూములు, నివాస ప్రాంతాలతోపాటు వాళ్ల కల్చర్‌తో సహా

సర్వం ధ్వంసం కావడం జరుగుతోంది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు మండలాలలోని 137 గ్రామాలలో 34,672 కుటుంబాలు, తూర్పు గోదావరి జిల్లాలో ఐదు మండలాలలో 234 గ్రామాలలో 70,929 కుటుంబాలు మొత్తం 1,05,601కుటుంబాలు అక్కడి నుండి తరలిపోవాల్సిన అవసరముంది. పోలవరం ప్రాజెక్టు వలన ఎంత ఉపయోగం ఉంది, అది ఎంతమందికి వరం అనే దానిమీద నాకు భిన్నాభిప్రాయం లేదు. కానీ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తరవాత మనం కనే కలలో ఎక్కడైనా గిరిజనుల గురించి అందరి కంటే ముందు మాట్లాడుకోవడమనేది ఏమైనా ఉందా? వాళ్ల ప్యాకేజీకి సంబంధించి ఇంకా కనీసం 4వేల కుటుంబాలకు కూడా పునరావాసం కల్పించలేదు. 54శాతం పనులు పూర్తయ్యాయి అన్నప్పుడు పునరావాసం కూడా 54శాతం అయ్యి ఉండాలి. దానికి పెట్టిన బడ్జెట్‌లో పునరావాసానికి ఎంత ఖర్చవుతుందనే దానిమీద ఒక ప్రాధాన్యత ఉండాల్సిన అవసరం లేదా అని అడుగుతున్నాను. చిన్న చిన్న అంశాలు చాలా నా దృష్టికి వచ్చాయి.

చిట్టచివర ఒకే మాట చెప్పి ముగిస్తాను. గిరిజనులకు సంబంధించిన సమస్యలు తరతరాలుగా ఉన్నాయి. కొత్త సమస్యలు తీసుకురాకుండా ఉంటే మంచిదని అనుకుంటున్నాను. ప్రభుత్వం ఎందుకనో బోయల్ని కూడా ఎస్టీలలో కలపాలని ఒక నిర్ణయానికి వచ్చింది. మరొక అడుగు ముందుకు వేసి మత్స్యకారులను కూడా అందులో చేర్చాలన్నారు. అధ్యక్షా, 1994 **Anthropological Survey of India** ఏం చెప్పిందంటే **"The Scheduled Tribes"** అనేది ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ఒక పుస్తకం తీసుకుని వచ్చింది. బహుశా భారతదేశంలో ఉన్న గిరిజనుల మీద సాధికారమైన సర్వే, విశ్లేషణ విధాన పత్రాలు తయారు చేయడానికి కావాల్సిన పునాది ఏం చెప్పిందనేది ఏమైనా చూశారా? 2016లో ఆంధ్రా యూనివర్సిటీ మానవశాస్త్ర విభాగంపై సుబ్రమణ్యంగారు ఒక పత్రాన్ని తీసుకుని వచ్చారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంస్కృతి పరిరక్షణ విభాగం కూడా దీనితో కలిసింది. ఒకరకంగా ఇది అఫీషియల్ డాక్యుమెంటు. అందులో ఏం చెప్పారు? అలాగే ఇప్పుడు సత్యపాల్ కుమారి గారి రిపోర్టు ముందుకు తీసుకురావడం జరిగింది.

కొత్తగా ఎవరు ట్రైబల్ జాతి అని నిర్ధారించే కమిటీకి కారెం శివాజీ గారు నాయకుడని నాకు ఇప్పటివరకూ తెలియదు. ఇది చాలా నష్టం కలిగిస్తుంది. ఏజెన్సీలలో ఉండే వాల్మీకులు, మైదానాలలో ఉండే వాల్మీకులు ఒకటి కాదు. వాళ్లు వెనుకబడలేదని నేను అనలేదు. వాళ్లు వెనుకబడి ఉంటే వాళ్లకు ఏది చేయాలో అది చేయండి తప్ప గిరిజనులలో కొత్త కొత్త వారిని చేర్చే ప్రయత్నం చేసి వాళ్లు గొడవలు చేసి, వాళ్లమధ్య పెద్ద యుద్ధంగా మారి, మనం మాత్రం గట్టుమీద కూర్చొని ఉండి, గిరిజనులు, గిరిజనులు అనబడేవారు, పాత గిరిజనులు, కొత్తగా గిరిజనులం కాబోతున్నామనుకునే వారి మధ్య గొడవలు పెట్టడం తప్ప మరేమీ కాదు.

అంతేకాకుండా, రాబోయే 2019వ సంవత్సరపు ఎలక్షన్స్ సమయంలో ఎక్కడ బోయలు ఎక్కువగా ఉన్నారో అక్కడ ఎక్కువగా కేంద్రీకరిస్తున్నామని ఒకరిద్దరు మాట్లాడింది కూడా మేము విన్నాము. ఇదేనా మీరు చేయాల్సింది? ఏరకమైనటువంటి సాధికారమైనటువంటి సర్వే ద్వారా నిర్ధారణ ద్వారా వీరందర్ని గిరిజనులుగా మార్చాలని అనుకుంటున్నారో నాకు తెలియదు. వారు మన మొహం కూడా చూసి ఉండరు. చెంచులు నాకు తెలిసినంత

వరకూ 1952వ సంవత్సరం నుండి మొన్న మొన్నటి వరకూ ఒక్క ఓటు కూడా వేయలేదు. They never participated in the so called democratic process. ఎప్పుడూ వాళ్లు మన జోలికి కూడా రారు, వాళ్లు మన జోలికి రాకపోయినా, మనం వాళ్ల జోలికి వెళ్లి లేనిపోని గొడవ చేయడమనేది న్యాయం కాదని నేను అభిప్రాయపడుతున్నాను. తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు చాలా ఉన్నాయి. వాటన్నింటిని నేను ప్రస్తావించదలచుకోలేదు కాని, మళ్లీ చిట్టచివరగా నేను చెబుతున్నాను, ఆ మూడు పుస్తకాలను ముద్రించే బాధ్యత ప్రభుత్వం వారైనా తీసుకోవాలి లేదంటే ఆ పుస్తకాలు నాకు ఇవ్వండి, నేను ముద్రించి ఇక్కడున్న గౌరవ సభ్యులకు తలా ఒక కాపీ రాబోయే సమావేశంలో ఇచ్చేస్తాను. ధన్యవాదాలు అధ్యక్షా.

**మిస్టర్ ఛైర్మన్:** సంక్షేమంపై లఘు చర్చ మరలా తీసుకుందాము, ఇప్పుడు ఫైనాన్స్ మినిస్టర్‌గారు బడ్జెట్ మీద రిప్లై ఇస్తారు.

**శ్రీ యనమల రామకృష్ణుడు:** అధ్యక్షా, బడ్జెట్ రిప్లై ఇచ్చేముందు గౌరవ సభ్యులు శ్రీ విటపు బాల సుబ్రహ్మణ్యం గారు ఒక మంచి అంశం చెప్పారు. ఆ పుస్తకాల పేర్లు ఇస్తే we will direct the concerned Departments to get the books printed. No problem, లైబ్రరీకి కూడా సర్క్యులేట్ చేస్తాము. సుబ్రహ్మణ్యం గారూ, ఆ పుస్తకాల పేర్లు నోట్‌చేసి ఇవ్వండి.

**మిస్టర్ ఛైర్మన్:** సుబ్రహ్మణంగారూ, ఇప్పుడే ఆ పుస్తకాల పేర్లు రాసి ఇవ్వండి.

## <u>6.) 2018–2019 సంవత్సరానికి వార్షిక ఆదాయ – వ్యయ పట్టిక (బడ్జెట్)పై సాధారణ చర్చకు ఆర్థిక మంత్రి ప్రత్యుత్తరం</u>

**శ్రీ యనమల రామకృష్ణుడు:** అధ్యక్షా, బడ్జెట్‌మీద దాదాపు 23మంది మాట్లాడడం జరిగింది. శ్రీ పయ్యావుల కేశవ్, వి.వి.వి.చౌదరి, వి.బాలసుబ్రహ్మణ్యం, వై.వి.బి.రాజేంద్రప్రసాద్, పి.వి.ఎన్.మాధవ్, కె. నర్సింహారెడ్డి, జి. దీపక్ రెడ్డి, బొడ్డు నాగేశ్వర రావు, వై. శ్రీనివాసులు రెడ్డి, ఆదిరెడ్డి అప్పారావు, జి. శ్రీనివాసులు, డి. నాగేశ్వరరావు, డి. జగదీశ్వరరావు, శ్రీమతి పి.సునీత, శ్రీ ఆర్. సూర్యారావు, బి. అర్జునుడు, ఎ. రామ్మోహన్, డా.ఎ.యస్.రామకృష్ణ, జి. శ్రీనివాసులు నాయుడు, కె. రవికిరణ్ వర్మ, ఎమ్.వి.సత్యనారాయణ రాజు, బుద్ధా వెంకటేశ్వరరావు, చిక్కాల రామచంద్రరావు, పి. రామసుబ్బారెడి గార్లు దాదాపు 23మంది గౌరవసభ్యులు.

మ.01.10

2018–19 ఆర్థిక సంవత్సరపు బడ్జెటు మీద మాట్లాడడం జరిగింది. బడ్జెట్‌పై కౌన్సిల్‌లో చాలా సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. చాలామంది సభ్యులు చాలా క్షుణ్ణంగా చర్చించడమే కాకుండా, చాలా వివరాలు కూడా చెప్పడం జరిగింది. అవన్నీ కూడా ప్రభుత్వ పరిశీలనలోకి తీసుకుంటాము. ఎందుకంటే సమాజం గురించి, రాష్ట్రం

గురించి వారిచ్చినటువంటి విలువైన సూచనలను తీసుకుని, వాటిని వీలైనంతవరకు అమలు చేయడానికి ప్రభుత్వం పనిచేస్తుంది.

అధ్యక్షా, అదేవిధంగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో మన ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ రూ.1,91,063.61కోట్లు. మేము బడ్జెటు ప్రిపేర్ చేసేప్పుడు, చేసేముందు కూడా రాష్ట్రంలో ఉండే సమస్యలను, రాష్ట్రంలో ప్రజలకు ఉన్న సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకోవడమే కాకుండా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నాము. ప్రజాస్వామ్య చరిత్రలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ చేయలేదు. మొట్టమొదటిసారిగా చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో తెలుగుదేశం ప్రభుత్వం ఇంటింటికీ కార్యక్రమం పెట్టి మీకు ఏం సమస్య ఉంది, మీకేం కావాలని అడగడం జరిగింది. సాధారణంగా మనకు చాలామంది ప్రజాప్రతినిధులు ఉంటారు. నేను కూడా దాదాపు 35 సంవత్సరాల నుంచి రాజకీయాలలో శాసనసభ సభ్యుడిగా, శాసనమండలి సభ్యుడిగా, మంత్రిగా కూడా ఉన్నాను. మేము కూడా ఇంతకు ముందు జన్మభూమి కార్యక్రమం చేపట్టడం, ఆ జన్మభూమి కార్యక్రమానికి వచ్చిన వాళ్లు అర్జీలు ఇవ్వడం, అదేవిధంగా మంత్రులు గానీ, ఎమ్మెల్యేలు గానీ ఏ పార్టీ వాళ్లైనా వాళ్లు ఇచ్చే అర్జీలు తీసుకుని ప్రభుత్వానికి ఫార్వర్డ్ చేయడం చేశాము. మొట్టమొదటగా జన్మభూమి కార్యక్రమంతోపాటు, ఇంటింటికి కార్యక్రమాన్ని పెట్టి, ప్రజల సమస్యలు తెలుసుకుని, ఆ సమస్యలను పరిధిలోకి తీసుకోవడమే కాకుండా ఏదో విధంగా వాటిని పరిష్కరించాలనే ఉద్దేశంతో నాన్ ఫైనాన్షియల్ కమిట్‌మెంట్స్ అన్నీ కూడా చాలా వరకు పరిష్కరించడం జరిగింది. వివిధ శాఖలకు ఫైనాన్షియల్ కమిట్‌మెంట్స్ ఉంటాయి కాబట్టి, ఆయా శాఖలలో ఫైనాన్షియల్ పొజిషన్, లేకపోతే ఫైనాన్స్ డిపార్టుమెంటుకు రావలసినటువంటి పాలసీ డెసిషన్ తీసుకోవడం వంటివన్నీ ఉంటాయి కాబట్టి ఫైనాన్షియల్ కమిట్‌మెంట్‌కి సంబంధించినవన్నీ ప్రభుత్వం ఎగ్జామిన్ చేయడం జరుగుతోంది. అందుకే ఆరోజు ఇంటింటికి కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు చాలా స్పష్టంగా మా ముఖ్యమంత్రిగారు చెప్పడం జరిగింది. మేము ఏదైతే అర్జీలు ప్రజల దగ్గర నుండి తీసుకోవడం జరిగిందో, వాటన్నింటినీ కూడా పరిష్కరించడం కోసం 2018-19 బడ్జెట్‌లో వీలైనంతవరకు ఫైనాన్షియల్ కమిట్‌మెంట్స్‌తో అన్నీ కూడా పరిష్కరిస్తామని చెప్పడం జరిగింది. అవి పరిష్కరించాలనే ఉద్దేశంతోనే బడ్జెట్‌ను ఆ విధంగా రూపొందించాము. ప్రజలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడానికి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడానికి వీలుగా ఈ బడ్జెటును రూపొందించడం జరిగిందని ఈ సందర్భంగా గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, గత బడ్జెటు కంటే అంటే 2017-18 బడ్జెటు కంటే అదనంగా 21శాతం వృద్ధి రేటుతో దాదాపు లక్షా తొంభై ఒక్క వేల రూపాయల పైచిలుకు బడ్జెటును రూపొందించాము. ఇది ప్రజల సంక్షేమ బడ్జెటు. ఇందాక సుబ్రహ్మణ్యం గారు సంక్షేమం గురించి మాట్లాడారు. బేసిక్‌గా సంక్షేమాన్ని గురించే ఈ బడ్జెట్‌లో ఎక్కువగా నిధులు కేటాయించడం జరిగింది. ఈ బడ్జెటును గౌరవసభ్యులు చూసే ఉంటారు. దీనిలో బ్రాడ్‌గా మూడు కేటగిరీలు ఉంటాయి. ఎకనామిక్ సర్వీసెస్, సోషల్ సర్వీసెస్, జనరల్ సర్వీసెస్. ఈ మూడు కేటగిరీలను పరిశీలించినట్లయితే, సోషల్ సర్వీసెస్‌కే ఎక్కువ నిధులు కేటాయించడం జరిగింది. ఈ సోషల్ సర్వీసెస్‌లో హెల్త్ కేర్, ఎడ్యుకేషన్ మొదలైనవన్నీ

ఉంటాయి. దీనికి మేము కేటాయించింది దాదాపు 30.92శాతం గ్రోత్‌రేటు. గతంలో ఎప్పుడూ కూడా ఇంత గ్రోత్‌రేటు పెట్టలేదు. దాదాపు రూ.67,120.25కోట్లు సోషల్ సర్వీసెస్‌కి అలాట్‌మెంట్ చేశాము. దీనిలో వెల్ఫేర్‌కి సంబంధించిన అన్ని డిపార్టుమెంట్లు మెయిన్‌గా ఉంటాయి. అదేవిధంగా ఎకనామిక్ సర్వీసెస్ సెకండ్ ప్రయారిటి. ఎకనామిక్ సర్వీసెస్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గానీ, అగ్రికల్చర్‌గానీ, రూరల్ డెవలప్‌మెంట్ గానీ, ఎనర్జీ గానీ ఈ కేటగిరీలన్నీ ఉంటాయి. దీనికి 19.89శాతం గ్రోత్‌రేటు పెట్టాము. రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గానీ, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గానీ, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గానీ ఇవన్నీ కూడా ఉండవలసిన అవసరం ఉంది. దానికి కూడా ఈ సంవత్సరం రూ.67,830కోట్లు పైచిలుకు అలాట్ చేయడం జరిగింది. దీనిలో మనం చూసినట్లయితే, ఈ సంవత్సరం రూ.1,91,063.61కోట్ల బడ్జెట్‌లో బ్రాడ్‌గా మూడు కేటగిరీలు చేశాము. దీని తరువాత ఈ సంవత్సరంలో చాలా ముఖ్యమైన వెల్ఫేర్ స్కీములు, కొన్ని ప్రామిసెస్, మా ఎన్నికల మేనిఫెస్టోలో మిగిలినవి, తరువాత ఇంటింటికీ కార్యక్రమంలో వచ్చినవి, జన్మభూమి కార్యక్రమంలో వచ్చినవి, ముఖ్యమంత్రిగారు ప్రజలకు ఇచ్చినటువంటి హామీలు మొదలైనవన్నీ కూడా ఈ బడ్జెటులో ఇన్‌కార్పొరేట్ చేయడం జరిగింది. వీలైనంత వరకు ఆ సమస్యలన్నీ పరిష్కరించాలనేది ప్రభుత్వ ఆలోచనని గౌరవ సభ్యులకు ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. అవికాకుండా రెగ్యులర్‌గా ఉన్న స్కీములు కాకుండా ఈ సంవత్సరం అదనంగా 36 వెల్ఫేర్ స్కీములు చేపట్టడం జరిగింది. దానికి రూ.5,000కోట్లు అదనంగా పెట్టిన ఘనత కూడా ఈ ప్రభుత్వానిదేనని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. దానిలో ప్రధానంగా మెగా సీడ్ పార్కుకు రూ.100కోట్లు. అదేవిధంగా లైవ్‌స్టాక్ ఇన్సూరెన్స్. మనుషులకు ఇన్సూరెన్స్ ఉండడం అందరికీ తెలిసిందే. లైవ్‌స్టాక్ అనేది చాలా ప్రధానమైన అంశం. ఈనాడు అగ్రికల్చర్ గ్రోత్ రేటు బాగా పెరగాలంటే, సస్టైనబుల్ గ్రోత్ రేటు రావాలంటే లైవ్‌స్టాక్‌లో ఉన్నటువంటి ఫిషరీస్, డెయిరీస్, అదేవిధంగా మిగతా విషయాలు చూసినట్లయితే వాటికి చాలా ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. చనిపోయే పశువులుగానీ, అదేవిధంగా బర్డ్స్‌గానీ, ఇటువంటివన్నీ కూడా లైవ్‌స్టాక్ క్రిందకు వస్తాయి. ఏదో ఒక జబ్బు రావడం వల్ల చనిపోయే పరిస్థితి, లేదంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల చనిపోయేటువంటి వాటన్నింటికి ఇన్సూరెన్స్‌ను కొత్తగా ఇంట్రడ్యూస్ చేయడం జరిగింది. దానికి గాను రూ.50కోట్లు కేటాయించడం జరిగిందని గౌరవసభ్యులకు మనవి చేస్తున్నాను.

మ.01.20

అధ్యక్షా, బీసీలకు చంద్రన్న పెళ్ళి కానుక గతంలో ఎస్సీల వరకు ఉన్నది. ఇప్పుడు బీసీలకు కూడా ప్రవేశపెట్టాము. ఈ సంవత్సరం రూ.100కోట్లతో బీసీలకు చంద్రన్న పెళ్ళి కానుకను ప్రవేశపెట్టాము. అదేవిధంగా బీసీలకు దాదాపు రూ.750కోట్లతో ఆదరణ పథకం పెట్టడం జరిగింది. ఈ విధంగా క్రొత్త స్కీములన్నీ రూ.5,000కోట్లతో ప్రత్యేకంగా 36 స్కీములను ఈ సంవత్సరం ప్రత్యేకంగా మొదలుపెట్టి చేయబోతున్నామని ఈ సందర్భంగా తమ ద్వారా అందరికీ తెలియజేస్తున్నాను.

అందులో అతి ప్రధానమైనది యువతకు సంబంధించింది. ఎవరైతే నిరుద్యోగ యువత ఉన్నారో వారికి ఆర్థికంగా సపోర్టు ఇవ్వాలనే ఉద్దేశంతో వారికి సంబంధించి ఇప్పటికే జీఓఎం పనిచేస్తోంది. అందువలన రేపు ఆ జీఓఎం ఫైనలైజ్ చేయగానే ఈ యూత్ ఎకనామిక్ సపోర్టుకి రూ.1,000కోట్లు ఈ పథకంలో పెట్టడం జరిగింది. ఈ రాష్ట్రంలో ఎవరైతే నిరుద్యోగులు ఉంటారో వారందరికీ వీలైనంతవరకు కూడా అలవెన్సులు ఇవ్వడం కానీ, అలాగే ఎకనామిక్ సపోర్టు ఇవ్వడం కానీ ఇతరత్రా కొన్ని కోణాలలో ఆలోచిస్తున్నాము. భవిష్యత్తులో ఈ స్కీమును అమలుచేసిన తరువాత మన రాష్ట్రంలో నిరుద్యోగం అనేది లేకుండా చేయాలనేది ఈ ప్రభుత్వ ఆలోచన అని ఈ సందర్భంగా తమ ద్వారా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, సభలో కొంతమంది మాట్లాడినప్పుడు ఇది యాంబిషస్, బడా బడ్జెట్ అని మాట్లాడడం జరిగింది. ఎవరి యాంగిల్‌లో వాళ్ళు మాట్లాడారు. ఒకసారి అందరూ ఈ బడ్జెట్ ఫిగర్స్‌ని కనుక చూసినట్లయితే, గత మూడు, నాలుగు సంవత్సరాలలోను మరియు ఈ మూడు సంవత్సరాలను అంతకు ముందు సంవత్సరాలను సరిపోల్చి చూసుకున్నట్లయితే, ఒకసారి అంతా అర్థమవుతుంది. నేను కూడా ఇంతకు ముందు ఆర్థిక శాఖా మంత్రిగా శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారి నాయకత్వంలో ఒక టర్మ్‌లో ఉన్నాను. ఇప్పుడు నేను నాలుగవ బడ్జెట్‌ని ప్రవేశపెట్టాను. మొత్తం 10వ బడ్జెటుగా ప్రవేశపెట్టబోతున్నాను. అయితే ఎప్పుడు చూసినా బడ్జెట్‌లో ప్లాన్, నాన్-ప్లాన్ ఉండేది. ఎప్పుడూ కూడా ప్లాన్ బడ్జెట్‌లో అంటే అస్సెట్స్ క్రియేట్ చేసే బడ్జెట్‌లో ఎప్పుడూ యావరేజ్‌గా 15శాతం కోత ఉండేది. ఎప్పుడూ 100శాతం ఖర్చు పెట్టే ప్రశక్తే లేదు. ఎప్పుడూ యావరేజ్ మీద 15శాతం కోత ఉండేది. ఎప్పుడూ కూడా నూరు శాతం ఖర్చు పెట్టినటువంటి సందర్భాలు లేవు. అదేవిధంగా మొత్తం బడ్జెట్‌లో కూడా నూరు శాతం ఖర్చు పెట్టిన సందర్భాలు కూడా లేవు.

అధ్యక్షా, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కమిట్‌మెంట్లు ఎక్కువ ఉన్నాయి. అదేవిధంగా ఖర్చు కూడా ఎక్కువ అవుతుంది. అలాగే అప్పు చేసినప్పటికీ కూడా ఈ రాష్ట్రం క్రొత్త రాష్ట్రం కాబట్టి, విభజన తరువాత అనేక సమస్యలు వచ్చాయి. ఈ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రం వంతు రాష్ట్రం ప్రయత్నం చేయాలి. రాష్ట్రానికి కావలసినటువంటి నిధులను సేకరించుకోవాలనే ఉద్దేశంతో బడ్జెట్‌ను రూపకల్పన చేయడమే కాకుండా, ఇచ్చినటువంటి బడ్జెట్‌లో ప్రాపర్‌గా ఖర్చుపెట్టేటటువంటి విధానాన్ని కూడా అవలంబించాము. అందుకనే క్రొత్తగా సిఎఫ్ఎంఎస్ వచ్చింది. ఇప్పటివరకూ రిసీట్స్‌కి సంబంధించి లాంచ్ చేశాం. రేపో, ఎల్లుండో ఆ సిఎఫ్ఎంఎస్ ఎక్స్‌పెండిచర్‌కు సంబంధించినంతవరకు కూడా దానిని లాంచ్ చేస్తాం. మొత్తం ఈ ఫైనాన్షియల్ సిస్టమ్‌ని, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌ని స్ట్రీమ్‌లైన్ చేసి, పర్‌ఫెక్ట్‌గా ఎక్స్‌పెండిచర్ అయ్యేట్లు, అలాగే కరప్షన్ లేకుండా ఎక్స్‌పెండిచర్ అయ్యేటట్లు కూడా జాగ్రత్తలు తీసుకున్నాము.

అధ్యక్షా, 2015-16 సంవత్సరానికి సంబంధించి చూస్తే, 2014-15 సంవత్సరాలది మనం తీసుకోలేదు. ఎందుచేతనంటే అది పూర్తి సంవత్సరం కాదు కాబట్టి, మన రాష్ట్రం విడిపోయిన సంవత్సరం కాబట్టి, దానిని పరిధిలోకి

తీసుకోలేదు కానీ, 2015-16వ సంవత్సరం తీసుకుంటే, దాదాపు రూ.1,13,048కోట్లు, ఖర్చు అయింది రూ.1,49,434కోట్లు. 2016-17వ సంవత్సరం బడ్జెట్ చూస్తే రూ.1,35,688 కోట్లు, ఖర్చు అయింది రూ.1,66,698కోట్లు, 2017-18లో బడ్జెట్ - రూ.1,56,999కోట్లు, ఇప్పటి వరకు ఖర్చు అయ్యింది - రూ.1,59,822కోట్లు. అంటే ఇది ప్రతి బడ్జెట్‌లో మాట్లాడేటప్పుడు ఈ బడ్జెట్‌లో ఓవర్ యాంబిషన్ ఉంది, యాంబీషియస్‌గా పెట్టుకుంటున్నారు, సోర్సెస్ లేవనేది సాధారణంగా వచ్చే కామెంట్లే.

అధ్యక్షా, ఈ అంకెలను నేను ఎందుకు చదివానంటే - ఈ బడ్జెట్‌ను ఓవర్ యాంబిషన్‌తో పెట్టింది కాదు. ప్రజల కోరికలు తీర్చుకోవడానికి పెట్టినటువంటి బడ్జెట్ కాబట్టి, దగ్గర దగ్గరగా రెండు లక్షల రూపాయలు ఖర్చు పెట్టాలనే ఉద్దేశంతో ఈ బడ్జెట్‌ను తయారు చేసుకున్నాం. దానికి ఉదాహరణ ఓవర్ యాంబిషన్ కాదు. ఏ సంవత్సరం తీసుకున్నా అనుకున్న బడ్జెట్ కంటే అంటే అసెంబ్లీ పాస్ చేసిన బడ్జెట్ కంటే ఎక్కువ ఖర్చు పెట్టామనేది కూడా ఈ సందర్భంగా సభ్యులందరికీ చెప్పవలసిన అవసరం ఉంది. అందుచేత ఇందులో ఎవరికీ ఏ అనుమానం అక్కరలేదు. తప్పకుండా ఈ రూ.1,91,000కోట్లే కాదు. రెండు లక్షల కోట్ల రూపాయల వరకు ఖర్చు పెట్టేటటువంటి పరిధి ఈ బడ్జెట్‌లో ఉంటుందనేది కూడా మీకు ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, వీటికి సంబంధించి మేము ఎస్టిమేట్ చేసుకోవడానికి ఇంటర్నల్‌గా అనుకోవడం దాదాపుగా ఈ రిసీట్సే కాకుండా హాఫ్ బడ్జెట్ బారోయింగ్స్ వస్తాయి. వివిధ శాఖలలో ఉండే కార్పోరేషన్ల ద్వారా వాళ్ళు కూడా అప్పులు తీసుకురావడం, ఈ అభివృద్ధిలో పాలుపంచుకోవలసిన అవసరం ఉంది. మొత్తం మీద ఇవన్నీ చూసుకున్నట్లయితే, ఈ బడ్జెట్‌లో ఒక కోటి 91 లక్షల రూపాయల పై చిలుకు అయినా హాఫ్ బడ్జెట్ మొదలైనవన్నీ చూసుకున్నట్లయితే, తప్పనిసరిగా రూ.2 లక్షల కోట్లకు పైగా పేద ప్రజల గురించి, రాష్ట్రం అభివృద్ధి గురించి ఈ సంవత్సరం ఖర్చుపెట్టబోతున్నామని ఈ సందర్భంగా తమ ద్వారా మనవిచేస్తున్నాను. అందుచేత ఇది బడా బడ్జెట్ కాదు, ఊహాలకు అతీతమైన బడ్జెట్ కాదు, ఓవర్ యాంబిషన్ బడ్జెట్ కాదు, ఇది రియలిస్టిక్ బడ్జెట్. ప్రజల కోర్కెలు తీర్చే బడ్జెటు, సంక్షేమ బడ్జెట్ అని మరొకసారి చెప్పవలసినటువంటి అవసరం ఉందని ఈ సందర్భంగా తమ ద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఇక రెవెన్యూ డెఫిసిట్‌కి సంబంధించి చూస్తే - ఇక్కడ కూడా రెవెన్యూ డెఫిసిట్ ఉంది. అందుచేత ఈ విషయాన్ని గౌరవసభ్యులు కొంతమంది చెప్పారు. ఈ రెవెన్యూ సర్‌ప్లస్‌ని మీకు రూ.5,235కోట్లు అని చూపించారని అన్నారు. అవును, రెవెన్యూ సర్‌ప్లస్ ఉంటుందని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాం. ఎందుచేత అంటే, ఎప్పుడూ ఉంటుందా అంటే గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి రావలసినవి ఇంకా రూ.12,000కోట్లు 2014-15 సంవత్సరానికి సంబంధించిన డెఫిసిట్ గ్రాంట్ కూడా రావల్సి ఉంది. ఆ ప్రభుత్వం ఆ గ్రాంటు ఇస్తే తప్పనిసరిగా రూ.5,000కోట్లు పై చిలుకు సర్‌ప్లస్ వస్తుందనేది మా అంచనా. అందుచేత ఇప్పుడు పార్లమెంటులో ఫైట్ జరుగుతోంది. ఇక్కడా ఫైట్ జరుగుతోంది. బహుశా గవర్నమెంటు ఆఫ్ ఇండియా ఇస్తారనేటటువంటి ఆశాభావం కూడా ఉంది. ఒకవేళ అవి ఇవ్వకపోతే ఏం చేయాలనేది కూడా ప్రభుత్వం ఆలోచిస్తుంది. అదే రాజకీయంగా కూడా ఆలోచించవలసిన అవసరం కూడా ఉంది.

అధ్యక్షా, ఈ రెవెన్యూ డెఫిసిట్‌ను ఒకసారి పరిశీలిస్తే - 2015-16లో రూ.7,301కోట్లు, 2016-17లో రూ.17,193కోట్లు, 2017-18 రివైజ్డ్ ఎస్టిమేట్‌లో రూ.4,018కోట్లు ఉంది. అందుచేత ఇది దాదాపు రూ.415కోట్లు బి/ఎ లో చూపించాము. అయినప్పటికీ రెవెన్యూ డెఫిసిట్ బాగా పెరిగింది. అందుచేత 2018-19 బడ్జెట్‌లో ఈ సర్‌ప్లస్ పెట్టుకున్నాము. ఎందుచేత అంటే, ఎస్టిమేట్స్ చేసేటప్పుడు రాబోయేటటువంటి ఇన్‌కమింగ్ ఇన్‌ఫ్లోస్ ఏమైతే ఉన్నాయో, ఆ ఇన్‌ఫ్లోస్‌ను కూడా ఎస్టిమేట్ చేసి, గవర్నమెంటు ఆఫ్ ఇండియా నుంచి ఎంత వస్తుంది? రాష్ట్రం ఆదాయం ఎంత ఉంటుంది? ఇవన్నీ ఒక స్ట్రీం చూసుకున్న తరువాత అవన్నీ అంచనాలు వేసిన తరువాత, చివరగా ఈ అంకె సర్‌ప్లస్ వచ్చింది తప్ప వేరే విధంగా మేము చేసినటువంటి విధానం కాదు. అందుచేత తప్పనిసరిగా మాకు రావలసినటువంటి రూ.12,000కోట్లు పై చిలుకు 2014-15 సంవత్సరానికి సంబంధించిన డెఫిసిట్‌లో ఇప్పటివరకూ రూ.4,000కోట్లు పై చిలుకు వచ్చింది. మేము మొట్టమొదటి నుంచి డిమాండ్ చేస్తున్నటువంటిది రూ.16,000కోట్లు పై చిలుకు. మేమే కాదు, ఎందుచేతనంటే మేము ప్రభుత్వంలోకి రాకముందే, ఈ గవర్నరుగారి పరిపాలనలోనే రూ.17,000కోట్లు రెవెన్యూ డెఫిసిట్ ఉంది, ఇది ప్రభుత్వానికి అనేటటువంటిది అని బైఫర్‌కేషన్ అయిన తరువాత వాళ్ళు చెప్పారు. అప్పటికి మేము అధికారంలోకి రాలేదు. మనం ప్రభుత్వాన్ని కూడా ఫాం చేయలేదు. ఆ తరువాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత అవన్నీ లెక్కలు చూసిన తరువాత, మేము కూడా రూ.16,000 కోట్లు పై చిలుకు రెవెన్యూ డెఫిసిట్ 2014-15 సంవత్సరానికి ఉంటుందని మేము కూడా చెప్పాము.

అధ్యక్షా, అయితే కేంద్రప్రభుత్వానికి ఎప్పుడూ కూడా రాష్ట్రప్రభుత్వాల మీద నమ్మకం ఉండదు. రాజ్యాంగపరంగా అందరికీ నమ్మకం ఉండాలి. మనది, వాళ్ళది కూడా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే. అందుచేత ఈ ఎన్నుకున్న ప్రభుత్వాలు ఇచ్చిన అంకెలను వాళ్ళు చూసుకోవలసిన అవసరం ఉంది. అయితే మేము సిఏజి వాళ్ళని అడుగుతామని చెప్పారు. OK. CAG is also the Constitutional Authority which can give right figure అని మేము ఒప్పుకున్నాం. ఒప్పుకున్న తరువాత సిఏజిని అడిగారు. సిఏజి వాళ్ళు కూడా రెవెన్యూ డెఫిసిట్ ఇంచుమించు రూ.16,000కోట్లు అని చెప్పారు. అదేవిధంగా ఆర్‌బిఐ రిపోర్టును రీసెంట్‌గా చూశాను. మొత్తం అకౌంట్లు అన్నింటినీ ఆర్‌బిఐ కూడా reconciliation చేస్తారు. అలా చేసినప్పుడు వాళ్ళు కూడా రూ.18,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్ల వరకు చూపించారు.

అదేవిధంగా నీతిఆయోగ్ చూస్తే, రూ.24,000కోట్లు పైచిలుకు చూపించారు. ఈమధ్యనే రాష్ట్రంలోని అకౌంట్స్ అన్నింటినీ చూసి రూ.24,000కోట్లు పైచిలుకే చూపించారు. ఎవరు చెప్పినా, ఏ ఆర్గనైజేషన్ చూపించినా కూడా అన్నింటికంటే ప్రధానమైనటువంటిది సిఏజినే. అది కాన్‌స్టిట్యూషనల్ అథారిటీ. అందుచేత ఆ లెక్కలను ఆ రీ-కన్సిలియేషన్‌ని ఎవరూ కాదనలేరు. కానీ, వారు ఆ నివేదికలు ఇచ్చిన తరువాత కూడా మీకు అంత రాదు, మీకు అంత ఎలిజిబిలిటీ లేదని చెప్పడం చాలా దారుణమైన విధానాన్ని కేంద్రప్రభుత్వం అవలంబిస్తోంది కాబట్టి, దీని గురించి చెప్పవలసిన అవసరం కూడా ఉంది. ఎందుచేతనంటే శ్రీ జైట్లీ గారే స్వయంగా చెప్పారు. సిఏజీ నివేదికలు వచ్చిన తరువాత, వాళ్ళు ఇచ్చిన వివరాల ప్రకారంగా నిధులను ఇస్తామని చెప్పారు. కానీ, అది కూడా ఇవ్వలేదు.

అధ్యక్షా, ఇప్పుడు వాటిని చూస్తే మీకు పెన్షన్ స్కీము అందులో తీసేస్తాము. రైతులకు ఇచ్చిన ఋణమాఫీని తీసేస్తాము, అలాగే పవర్ బాండ్లకు సంబంధించినంతవరకు అవి లోన్లు ఉన్నాయి కాబట్టి అవి తీసేస్తాము. లేకపోతే ఇంకొక కార్యక్రమం తీసేస్తామని చెప్పారు. అసలు ఈ ఫెడరల్ స్ట్రక్చర్‌లో కేంద్రప్రభుత్వానికి ఏం అధికారం ఉంది? ఈ రాష్ట్ర ప్రభుత్వాలను డిక్టేట్ చేయడానికి కేంద్రానికి ఏం అధికారం ఉంది? ఈనాడు ప్రజలు మమ్మల్ని ఎన్నుకున్నారు. మా మేనిఫెస్టోలో మేము హామీలు ఇచ్చాము. ఆ హామీలు ఇచ్చిన తరువాత, వాటిని నెరవేర్చవలసిన బాధ్యత మా మీద ఉంది. ఈనాడు మా రాష్ట్రానికి రెవెన్యూ వస్తుంది. ఈరోజున జిఎస్టీ వస్తుంది. లేకపోతే నాన్ టాక్స్ రెవెన్యూ వస్తుంది. లేకపోతే బారో చేస్తున్నాం. వీటిల్లో మా డబ్బులు కూడా ఉన్నాయి. ఒక్క కేంద్ర ప్రభుత్వం దయాదాక్షిణ్యాలతోనే రాష్ట్ర ప్రభుత్వాలు ఆధారపడి లేవు. ఎవరి ఆదాయాలు వారికి ఉన్నాయి. ఇక్కడ రాష్ట్రంలో కట్టిన రెవెన్యూలను మళ్ళా అక్కడకు వెళితే, మళ్ళీ మన షేర్ మనకు వస్తోంది. అందుచేత మనకు వచ్చేటటువంటి బడ్జెట్, మాకు వచ్చేటటువంటి స్కీమ్స్ కానీ, మేము పెట్టుకోవడానికి మాకు రాజ్యాంగ ప్రకారంగా హక్కు ఉంది. మీరు ఈ స్కీం పెట్టారు కాబట్టి, మేము రెవెన్యూ డెఫిసిట్ పెట్టడానికి మీకు రాజ్యాంగపరంగా ఏం అధికారం ఉందని చెప్పమని అడుగుతున్నాను. ఎందుచేతనంటే వారికి ఏ అధికారం కూడా లేదు. ఈ ఫెడరల్ స్ట్రక్చర్‌లో ఎవరి స్కీములు వాళ్ళకి ఉంటాయి. ఎవరి పాలసీలు వాళ్ళకి ఉంటాయి. అట్లా అంటే ఈ సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీములకు సంబంధించి దాదాపు 30 స్కీములు పెడుతున్నారు. ఈ 30 స్కీములను మన మీద రుద్దుతున్నారు. వాళ్ళు రూ.60లు ఇస్తుంటే మనం రూ.40లు పెట్టవలసి వస్తోంది. అసలు వాళ్ళు మనతో సంప్రదించరు. వాళ్ళు స్కీములు తయారు చేసుకోవడం, స్కీములు పెట్టేయడం, వాటిని క్రిందకు పంపేయడం, తద్వారా రాష్ట్రాలకు పంపించేస్తూ, మేము రూ.60 ఇస్తున్నాము, మీరు రూ.40 పెట్టుకోండని చెపుతున్నారు.

అధ్యక్షా, ఆ విధంగా మనకు ఉండే రెవెన్యూ కూడా ఆ సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీములకు గానీ, లేక వేరే స్కీములకు ఈ 40 శాతం పెట్టడం వల్ల మనకు ఈ ఫిస్కల్ స్పేస్ కూడా తగ్గిపోతోంది. ఎందుచేతనంటే మనకు మన స్కీములు పెట్టుకోవడానికి లేకుండా పోతోంది. అందుచేత ఈ రాష్ట్రప్రభుత్వ పథకాలలో మేము రైతులు అతి కష్టాలలో ఉన్నప్పుడు వారికి రైతు ఋణమాఫీ చేస్తే, అలాగే డ్వాక్రా మహిళలకు ఋణమాఫీ చేస్తే, ఈనాడు పవర్‌బాండును తీసుకువచ్చి అప్పులు తీరుస్తున్నాము. ఈనాడు పవర్ సెక్టార్ అంతా దాదాపు రూ.7,500కోట్ల వరకు నష్టాలలో నడుస్తోంది. దానికి సబ్సిడీ ఇవ్వవలసి వస్తోంది. ఆ సబ్సిడీ కరెక్టు కాదని, ఇవన్నీ చేస్తోంటే, It is our own policy. We are acting in accordance with the Constitution. I don't know why they are objecting?

అందుచేత అవన్నీ కూడా తీసేసి మీకు నెట్ రూ.138కోట్లే వస్తుందని చెప్పడం ఎంతవరకు సబబు? ఒకసారి గౌరవ సభ్యులందరూ కూడా దీనిని గురించి ఆలోచించవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా తమ ద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, అందుకని వాటినన్నింటిని తీసేయ్యడానికి మీకు ఎవరు అధికారం ఇచ్చారు? ఎందుచేతనంటే మీరు కాగ్, మొదలైనవన్నీ లెక్క పెట్టారు కదా! కాగ్ లెక్క ప్రకారంగా చూస్తే, దాదాపు రూ.16,000 కోట్ల చిల్లర రావాలి. అందులో కేవలం రూ.4,000కోట్లు ఇచ్చారు. ఇంకా రూ.12,000కోట్లు రావాలి. అదే ఇక్కడ మేము తీసుకుంటే మాకు సర్ప్లస్ వచ్చింది. అంతే కానీ, ఇవేవో కాకి లెక్కలో, మరొక లెక్కలో కాదు. అంతా పకడ్బందీగా, కన్స్ట్రక్టివ్‌గా చేసినటువంటి సిస్టం అనేది కూడా గౌరవ సభ్యులకు చెప్పవలసిన అవసరం ఉంది. మీరు రైతులకు ఋణమాఫీ చేయడానికి వీలు లేదు. లేకపోతే మీరు మధ్యాహ్న భోజనం పెట్టడానికి వీలు లేదు, లేకపోతే మీరు భోజనాలు చేయడానికి వీలు లేదని చెప్పడానికి కేంద్రప్రభుత్వానికి ఏం సంబంధమని ఈ సందర్భంగా తమ ద్వారా అడుగుతున్నాను. ఇందులో కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదు. మేము ఇంతకాలంగా ఏదైతే రూ.16,000 కోట్ల కోసం డిమాండ్ చేస్తున్నామో, రెవెన్యూ డెఫిసిట్ క్రింద, గ్యాప్ రిసోర్సెస్ క్రింద మాకు చట్ట రీత్యా రావలసింది ఇవ్వండి. మీరు రీ-ఆర్గనైజేషన్ యాక్టులో చాలా స్పష్టంగా పెట్టారు. అక్కడ సెక్షన్ ఉంది. ఆ చట్టం ప్రకారంగా మాకు రావలసినవి ఏదైతే ఉందో ఆ రిసోర్స్ గ్యాపునే మేము అడుగుతున్నాము. అది ఇవ్వవలసిన బాధ్యత మీకు ఉంది, అది ఇవ్వాలి. దీని గురించే అక్కడ పార్లమెంటులోను, ఇక్కడ కూడా డిమాండ్ చేస్తున్నాము. ఆ విధంగా చట్టంలో ఉన్న ఇష్యూలు కానీ, అప్పుడు ఉన్న ప్రధానమంత్రి గారు ఇచ్చిన హామీలు కానీ, జైట్లీ గారు ఇచ్చినటువంటి హామీలు గానీ, అమలుజరుపుతున్న హామీలు కానీ, వీటన్నింటిని చేయవలసిన బాధ్యత ఉన్నది. ఎందుకంటే, అన్నింటికంటే ఈ డెమోక్రసీలో సుపీరియర్ బాడీ పార్లమెంట్. ఆ పార్లమెంటులో చేసినటువంటిదే ఈ రీ-ఆర్గనైజేషన్ యాక్ట్. ఇందులో మొదటి పాయింట్ ఏమిటంటే - పార్లమెంటు స్వయంగా ఒక చట్టం చేస్తే, ఆ చట్టాన్ని అమలు చేయడానికి వెనుకాడుతున్నారంటే, అసలు ఆ కేంద్రప్రభుత్వానికి ఆ చట్టం మీద నమ్మకం ఉందా లేదా?

మ.01.30

అధ్యక్షా, రెండవది అసలు పార్లమెంట్ మీదే నమ్మకం ఉందా, లేదా? పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలు అమలుచేయాలి. మీకు తెలుసు అధ్యక్షా, ఇక్కడ మనం హామీలు ఇచ్చామంటే ఎస్యూరెన్స్ కమిటీకి వెళుతుంది. హామీలను ప్రభుత్వం ఖచ్చితంగా అవునో, కాదో చెబుతారు. హామీలను అమలుజరుపుతారు. సాధ్యమైనంత వరకు కూడా ఆ రోజు పట్టుపడి హామీలు ఇచ్చిన రాజకీయ పార్టీ, అక్కడే విభజన చేసిన రాజకీయ పార్టీ పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు జరపమంటే ఇప్పటికి కూడా డాడ్జ్ చేస్తున్నారంటే దీనిని అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. ఏది ఏమయినప్పటికీ కూడా పునర్విభజన చట్టంలో విషయాలు అన్నీ ఖచ్చితంగా అమలు జరపవలసిన అవసరం ఉంది. ప్రత్యేక హోదాను ఇవ్వవలసిన అవసరం ఈనాటి కేంద్ర ప్రభుత్వానికి ఉంది. మిగిలిన సమస్యలను తీర్చాల్సిన అవసరం కూడా ఉంది. వాటన్నింటినీ తీర్చేంత వరకూ తెలుగుదేశం ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై పోరాడుతునే ఉంటుందనే విషయాన్ని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, **Outstanding Debt** నేను చాలా స్టేట్‌మెంట్స్‌ను బయట ఉన్న లీడర్స్ కానీ, ఇక్కడ లీడర్సు కానీ చేస్తున్నారు. **Outstanding Debt** ను ఎలా లెక్కకడతారో అక్కడున్న లీడర్ తెలుసుకోవాలి. బహుశా ఈ సభలో లేరనుకోండి, ఆ సభలో ఉండే వారు ఇవాళ బాయ్‌కాట్ చేశారు. చాలా మంది దీనిని గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉంది. మన రాష్ట్రం ఏర్పడిన దగ్గర నుంచి ఇప్పటి వరకు ఉన్న అప్పును **Outstanding Debt** అంటారు. ఈ **Outstanding Debt** మీదే ఇప్పటికే రూ.9వేల నుంచి 10వేల కోట్ల వరకు వడ్డీనే కడుతున్నాం. ఈ **Outstanding Debt** అనేది మన రాష్ట్ర విభజన సమయంలోనే ఉన్నది. మనం అపోజ్ చేసినప్పుడు కూడా వినలేదు. 58 శాతం మనకు వస్తుంది. అదే విధంగా 42 శాతం తెలంగాణాకి వెళుతుంది. అంటే మనకు ఆ రోజుకే రూ.1,48,743కోట్లు ఉంది. అందుచేత మనకు అప్పు ఎక్కువ వచ్చింది. రెవెన్యూస్ తక్కువ వచ్చాయి. పాపులేషన్ ఎక్కువ ఉంది, ఎంప్లాయీస్ ఎక్కువ వచ్చారు. ఇవన్నీ అనేక కష్టాలకు దారితీశాయి. ఎంప్లాయిస్ శాలరీ బిల్లు మనకు తెలంగాణా కంటే ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా పాపులేషన్ కూడా తెలంగాణా కంటే మనకే ఎక్కువ. అదే విధంగా అప్పును కూడా మనకే ఎక్కువ ట్రాన్సఫర్ చేశారు. అప్పును ఎప్పుడైతే ట్రాన్సఫర్ చేశారో వడ్డీ కూడా ఆటోమేటిక్‌గా పెరిగిపోతుంది. అందుచేత మన రెవెన్యూస్ అన్నీ తగ్గిపోవడానికి అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితిలో మనకు వచ్చిన తరువాత రెవెన్యూస్ ఎప్పుడైతే తగ్గుతున్నాయో, ఖర్చులు ఎప్పుడైతే పెరుగుతున్నాయో సాధారణంగా మార్కెట్ బారోయింగ్స్‌కు వెళ్ల వలసిన అవసరం ఉంటుంది. బారోయింగ్స్ ఎందుకు చేశారు, అప్పులు ఎందుకు చేశారు, అప్పులు చేసి ఏమి చేస్తున్నారని అంటున్నారు. దాదాపు ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన దగ్గర నుంచి చూస్తే కాంగ్రెస్ ఉన్నప్పుడు చేశారు, వైయస్‌ఆర్ గారు ఉన్నప్పుడు చేశారు, మేమూ అప్పు చేశాం, ఇప్పుడూ అప్పు చేస్తున్నాం. ఇది కంటిన్యూగా జరిగే ప్రాసెస్. అప్పు లేకుండా బహుశా ఎవరూ ఉండరు. అందుచేత దీంట్లో చూస్తే బహుశా దాదాపు మీరు రూ.2కోట్లు అప్పు చేశారంటే దానికి సభ్యులు సిస్టమ్ గురించి తెలుసుకోవాలి. **Outstanding Debt** ను గురించి తెలుసుకోవాలి, మార్కెట్ బారోయింగ్స్ గురించి తెలుసుకోవాలి, ఎందుకు బారో చేస్తున్నారో తెలుసుకోవాలి. అందుచేత ఫిస్కల్ డెఫిసిట్ ఎప్పుడైతే పెరుగుతుందో, ఇందాక ఫిస్కల్ డెఫిసిట్‌ను చూస్తే **fiscal deficit = total receipts– total expenditure, revenue deficit = tax revenue-revenue expenditure** వస్తుంది. అందుచేత ఫిస్కల్ డెఫిసిట్‌ను చూస్తే 2016-17లో 4.52 శాతం ఉంది. ఇది మన జిఎస్‌డిపిలో ఇది 3 శాతమే ఉండాలి. ఎందుచేతంటే ఎఫ్‌ఆర్‌బిఎమ్ యాక్ట్ వచ్చిన తరువాత 3 శాతం కంటే ఫిస్కల్ డెఫిసిట్ దాటడానికి వీలు లేదు. మన రాష్ట్రానికి అంతే, కేంద్ర ప్రభుత్వానికి అంతే, అన్ని ప్రభుత్వాలకు అంతే. అందుచేత మన **self imposed enactment** ఇది. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా చేసుకుంది. ఇక్కడ ఇంకొక విషయం కూడా చెప్పాలి, రాజ్యాంగం ప్రకారంగా ఎఫ్‌ఆర్‌బిఎమ్ యాక్ట్‌కు రెగ్యులేషన్సు పెట్టుకోవడానికి కొన్ని లిమిట్స్ పెట్టుకోవడానికి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చేసుకుంది, కేంద్ర ప్రభుత్వం చేసుకుంది. అందుచేత మనకు ఏమిటంటే ఫిస్కల్ కన్‌సాలిడేషన్‌లో ఫిస్కల్ పారామీటర్స్‌ను మెయింటైన్ చేయాలనే ఉద్దేశంతో ఆ చట్టం తీసుకువచ్చాం. అది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ అధికారంలోనే ఉంటుంది. గత సమావేశాల్లోనే ఈ బిల్లును ఆమోదించారు. ఎందుచేత అంటే 4 శాతం బారో లిమిట్‌ను

పెంచుకోవడానికి చేశాము. ఈ బిల్లును కేంద్ర ప్రభుతానికి పంపిస్తే దానిని ఇంత వరకు తిరిగి పంపించలేదు. మేము అడిగినపుడు మీకు అధికారం ఉంది కదా, మీరు చేసుకోవచ్చు అంటారు. మనం చేసుకుని అక్కడకు పంపిస్తే వెనక్కి రాదు. ఎక్కడ వీలైతే అక్కడ రాష్ట్ర ప్రభుత్వాలను తొక్కిపెట్టాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఉంది. ఏ ప్రభుత్వానికైనా అది అంత మంచి పద్ధతి కాదు. జిఎస్‌డిపిలో 2016-17లో దాదాపు 4.52 శాతం ఉంది. సవరించిన అంచనాలు 2017-18లో చూస్తే 3.48 శాతం ఉంది. అదే విధంగా బడ్జెట్ ఎస్టిమేట్స్‌లో 2018-19లో చూస్తే ఈ రోజు 2.78 శాతానికి తెచ్చాము. అంచేత మనం తీసుకున్న చర్యల వలన గ్రాడ్యువల్‌గా తగ్గించుకుంటూ వస్తున్నాము. ఇది 3 శాతం కంటే తక్కువే ఉండాలి. ఎందుచేతంటే రెవెన్యూ సరిగా లేకపోయినట్లయితే ఒకొక్కసారి పెరగడానికి అవకాశం ఉంటుంది. ఇందంతా రెవెన్యూ మీద ఆధారపడి ఉంటుంది. అదే విధంగా జిఎస్‌డిపిపై కూడా ఆధారపడి ఉంటుంది. ఈ రెండూ బాగున్నట్లయితే ఫిస్కల్ డెఫిసిట్ తగ్గిపోయే అవకాశం ఉంటుంది. ఆ విధంగా ఎస్టిమేట్ చేశాము. ఈ రోజు ఫిస్కల్ డెఫిసిట్ ఎంతైతే ఉందో దాదాపు 2018-19 లో మార్కెట్ బారోయింగ్స్‌కి వెళ్లి రూ.29,605కోట్లు బారో తెచ్చుకునే అవకాశం ఉందనే అంచనా వేయడం జరుగుతుంది.

మ.01.40

ఓవరాల్ రెవిన్యూస్ మాత్రమే కాకుండా, సెంట్రల్ గవర్నమెంట్ నుండి వచ్చే **devolutions, Grants-in-Aid, State revenues** ఇవన్నీ కలుపుకున్న తరువాత మనకు కావాల్సింది దగ్గరదగ్గరగా రూ.30,000 కోట్లు. ఆ మొత్తం బారోయింగ్ ద్వారా తీసుకోవాల్సిందే తప్ప, ఇంకోరకంగా అవకాశం లేదు. జిఎస్టీ వచ్చిన తరువాత ట్యాక్సు వేసే అవకాశం ఎవ్వరికీ లేదు. జిఎస్‌టి వచ్చిన తరువాత ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ మీద కేంద్ర ప్రభుత్వానికి పవర్ లేదు. స్టేట్ గవర్నమెంట్‌లకు కూడా పవర్ లేదు. జిఎస్టీ కౌన్సిల్‌కు మాత్రమే పవరుంది. ఏదన్నా ఉంటే జిఎస్టీ కౌన్సిల్లో మాత్రమే డిస్కస్ చేయాలి. ఇప్పటికే శ్లాబ్స్ అన్నీ ఫిక్స్ చేసేశారు. అందుచేత ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్‌లో పెద్దగా మార్పు ఉండదు. అందువల్ల, మనం ట్యాక్సేషన్ ఎస్టిమేట్లు, గ్రోత్‌రేట్ బాగానే చేశాము. ఈ సంవత్సరమైతే అన్ని డిపార్టుమెంట్లు అనుకున్న గ్రోత్‌రేట్లు సాధించాయి. ఒక్క కమర్షియల్ ట్యాక్సెస్‌లోనే రెండువేలు, మూడువేల కోట్లు షార్టేజీ వచ్చింది తప్ప, మిగతా అన్ని డిపార్టుమెంట్లలో టార్గెట్‌ని సాధించుకోగలిగాము. అందుచేత, 2018-2019లో కూడా వాళ్లకిచ్చిన టార్గెట్లను సాధిస్తారనే నమ్మకం కూడా ఉంది. **In addition to that, we are likely to borrow another Rs.30,000 crore for the development of the State**. అంతేగానీ, పప్పుకూడు తింటానికి అప్పు తేవడం లేదు.

మీరు చూస్తే, భారతదేశంలో అన్ని రాష్ట్రాలు అప్పులు చేస్తున్నాయి. ప్రపంచంలో అన్ని దేశాలూ అప్పులు చేస్తాయి. **Including West Bengal. Including China and Russia.** ఏ దేశం తీసుకున్నా కూడా అప్పులు చేసుకుంటారు. అంటే జపాన్, అమెరికా తీసుకున్నా కూడా బారోయింగ్ చేస్తారు. కానీ, రుణం క్రింద తీసుకున్న మొత్తం సరిగ్గా ఖర్చుపెడుతున్నారా, లేదా అనేది చూడాల్సిన బాధ్యత మాత్రం మన మీద ఉంటుంది. ఆ విధంగా సక్రమంగా ఖర్చుపెట్టుకోవడానికే మనం స్కీమ్స్ అన్నీ కూడా పెట్టుకోవడం జరిగింది. ఈ రోజున మనం బారో

చేస్తున్నాము. Another important factor ఏమంటే ఓపెన్ మార్కెట్‌లో బారోయింగ్ చేస్తారు. అలా చేసినప్పుడు అన్ని రాష్ట్రాలను మా ఆఫీసులో వారు కాంటాక్ట్ చేస్తే, అందరూ కూడా 9 శాతం వడ్డీకి అప్పు చేశారు. కానీ, 7.9 శాతంతో అతి తక్కువ వడ్డీకి బారోయింగ్ చేసిన రాష్ట్రం ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమేననేది గుర్తుంచుకోవాల్సిన అవసరముంది. ఆ విధంగా చేశాము కాబట్టే, interest payments భవిష్యత్తులో తగ్గడానికి అవకాశముంటుంది. ఓవరాల్‌గా ఈ మూడు సంవత్సరాల్లో మేం బారో చేసింది రూ.65,757 కోట్లు. సగటున మూడు సంవత్సరాలకు కలిపి బారో చేసిన మొత్తం ఇది. అంతేగాని, రూ.2 లక్షల కోట్లో, రూ.1 లక్షకోట్లో బారో చేయలేదు. ఈ మూడేళ్లలో అంటే 2015-2016, 2016-2017, 2017-2018లో మేం బారో చేసింది రూ.65,757 కోట్లు. ఈ సంవత్సరం likely borrowing Rs.30,000 crore అని అనుకుంటున్నాము. అంటే, lowest borrowings. అదే విధంగా ఇవి కాకుండా Half Budget borrowings కూడా చేయవలసినటువంటి అవసరం వచ్చింది. ఎందుకంటే, రైతులందరికీ దాదాపు ఇంకా రూ.8,000 కోట్లకుపైగా రుణ మాఫీ క్రింద చెల్లించాల్సి ఉంది. అందుచేత, ఈ సంవత్సరం రూ.4100 కోట్లు బడ్జెట్‌లో పెట్టాము. అదేవిధంగా బ్యాలెన్స్ చెల్లించాల్సిన అవసరముంది. మొన్న కూడా కొంత half budget borrowings చేసి మహిళలకు చెల్లిస్తున్నాము. అదేవిధంగా రైతులకు కూడా చెల్లించాము. రూ.24,000 కోట్ల మేర రైతులకు రుణాలను మాఫీ చేసిన ఘనత ఒక్క ఈ ప్రభుత్వానిదేనని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇప్పటికి దాదాపు రెండు దఫాలుగా చెల్లించాల్సి ఉంది. రెండు విడతల్లో ఆ మొత్తం చెల్లించాలి. ఆ మొత్తం రూ.8000 కోట్లు 2018-19లో చెల్లించాలి. ఈ బడ్జెట్‌లో రూ.4100 కోట్లు కేటాయించాము. మిగతాది కూడా half budget borrowing చేసి గానీ, లేక మరెక్కడైనా సేవింగ్ చేసైనా సరే రైతులకు 2018-19లో 100 శాతం రుణమాఫీ చేస్తామని కూడా ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అదేవిధంగా మహిళలకు కూడా రుణమాఫీ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు వాళ్లకు దాదాపు రూ.10,000 కోట్లు రుణమాఫీ చేశాము. ఇక్కడ చూసినట్లయితే, డ్వాక్రా సంఘాలకు ఇంట్రస్ట్ కూడా మాఫీ చేశాము. అట్లాగే, ప్రతి సంవత్సరం వాళ్లకు ఒక ఫేజ్‌లోనో, రెండు ఫేజుల్లోనో రుణమాఫీ చేయాల్సి ఉంది. కాబట్టి, ఈ సంవత్సరం వాళ్లకి చెల్లించి కంప్లీట్ చేస్తాము. ఈ రెండు రుణమాఫీలు కూడా 2018, 2019వ సంవత్సరంతో పూర్తవుతాయని గౌరవ సభ్యులకు ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, చెప్పాలంటే ఇంకా చాలా విషయాలున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం devolutions గురించి చాలా గొప్పగా మేము 32 శాతం నుండి 42 శాతానికి చేశామని చెబుతున్నారు. ఈ 32శాతం నుండి 40శాతం చేశామని వీళ్లు చెప్పుకొంటున్నారు గాని, ఆ రోజునే 14వ ఆర్థిక సంఘం నివేదికని బయటపెట్టినప్పుడే చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది. అందుచేత రిపోర్టుల ప్రకారం చూసినట్లయితే రెండు మూడు కేటగిరీలు ఉంటాయి. మనకు కావాల్సినటువంటి Grants-in-Aid, Devolutions వస్తాయి. Devolution is a Statutory Power. రాజ్యాంగం ప్రకారం మనకు ఎంత షేర్ వస్తుందో, ఆ షేర్ మనకు ఆటోమేటిక్‌గా వస్తూ ఉంటుంది. దాంట్లో మనకి ఎవరు

తగ్గించేదీ లేదు, పెంచేది కూడా లేదు. Total Central Pool లో ఎంత వస్తుందో, సెంట్రల్ పూల్‌కు వచ్చిన దాంట్లో రాష్ట్రాలకు 42 శాతం వస్తుంది. ఆ 42 శాతం రాష్ట్రాలకు కేటాయిస్తే, 4.305శాతం మన రాష్ట్రానికి వస్తుంది. అంటే, దాదాపు ఈ సంవత్సరం రూ.33,000 కోట్లు పైచిలుకు డెవల్యూషన్స్‌లో వస్తుందని ఎస్టిమేట్స్ వేశాము. ఈ డెవల్యూషన్స్ కూడా ఒక మాయ. కరెక్టుగా చెప్పాలంటే, పేరుకు 32 శాతం నుండి 42 శాతమని చెప్పి 10 శాతం పెంచారు గానీ, ఈ Grants-in-Aid లో మాత్రం వాళ్లకి discretionary power ఇచ్చారు. ఈ విధంగా గ్రాంట్స్-ఇన్-ఎయిడ్‌లో కేంద్రానికి ఎప్పుడైతే discretionary power ఉందో, అది non statutory power. ఆ Grants-in-Aid విషయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు పాస్ చేసుకుని వాళ్లు చేయడానికి అవకాశం ఉంటుంది. కేంద్రంలో ఎవరైతే అధికారంలో ఉన్నారో, వాళ్లు దాన్ని ఇష్టం వచ్చినట్లుగా అవసరమైతే ఏ రాష్ట్రానికైనా ఎక్కువ ఇవ్వొచ్చు, అవసరం లేదనుకుంటే తక్కువ ఇవ్వొచ్చు, లేకపోతే వాళ్లకు కావాల్సిన స్కీమ్సు పెట్టుకోవచ్చు, ఆ స్కీమ్స్ అన్నింటినీ రాష్ట్రాల మీద రుద్దొచ్చు. కానీ, రాష్ట్రాలు అవన్నీ భరించాలంటే కష్టం. మనం ఏమనుకుంటామంటే, కేంద్రం నుండి 60 రూపాయలు వస్తుంది కాబట్టి, మనం 40 రూపాయలు పెట్టొచ్చని అనుకుంటాము. ఈ రోజు సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్ క్రింద దాదాపు 30 స్కీములున్నాయి. ఆ 30 స్కీములకు ఒకవేళ 100 రూపాయలు ఖర్చుచేయాలంటే కేంద్రం 60 రూపాయలిస్తారు, మనం 40 రూపాయలు పెట్టాల్సిన అవసరముంది. ఈ విధంగా ఈ స్కీమ్స్ ఇచ్చేటప్పుడు ఫైనాన్స్ కమిషన్ వారు చాలా సందర్భాల్లో డిస్కస్ చేశారు. 11వ ఆర్థిక సంఘం నివేదికలో చాలా స్పష్టంగా చెప్పారు. నేను కూడా చాలా ఫైనాన్స్ కమిషన్స్‌కి అటెండ్ అయ్యాను. స్టేట్ గవర్నమెంట్ డిమాండ్ చేసేది ఒక్కటే. Centrally Sponsored Schemes పెట్టక్కర్లేదు. Centrally Sponsored Schemes (CSS) ఏవైతే ఉన్నాయో, అవన్నీ కూడా రద్దుచేసి, equal amount రాష్ట్రానికి ట్రాన్స్‌ఫర్ చేయండి. లేదా, 50 % devolutions ఇవ్వండి. మాక్కూడా fiscal space ఉంటుంది. ఆ ఫ్లెక్సిబిలిటీ రాష్ట్రాలకు ఉంటుందని అనేక సందర్భాల్లో చెబితే, ఏదీ పట్టించుకోలేదు.

మొన్నటి వరకు అంటే 13వ ఆర్థిక సంఘం వరకు 1 నుండి 2 శాతం పెంచేవారు. కానీ, ఇప్పుడు 10 శాతం పెంచారు. సిఎస్ఎస్ క్రింద మనకు వచ్చే వాస్తవ మొత్తం చూస్తే, 13వ ఆర్థిక సంఘం క్రింద వచ్చిన దానికంటే, 14వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చేవి ఘనంగా ఏమీ రావడం లేదు. ఎందుచేతనంటే, Centrally Sponsored Schemes లో sharing pattern మార్చేశారు. ఆ sharing pattern మార్చడం వల్ల మనకు వచ్చేది తక్కువ అయిపోతోంది. ఇంతకుముందు కొన్ని స్కీముల్లో 90:10 నిష్పత్తిలో వచ్చేది. కొన్ని స్కీమ్స్‌లో 75:25 నిష్పత్తిలో వచ్చేది. కొన్ని స్కీమ్సులో 60:40 నిష్పత్తిలో వచ్చేవి, కొన్ని స్కీమ్సులో 50:50 నిష్పత్తిలో వచ్చేవి. కానీ, ఇప్పుడు యూనిఫామ్‌గా అన్ని స్కీమ్సులో 60:40 రేషియో చేశారు. అంటే, 90:10 వచ్చేవి కూడా 60:40 చేసేటప్పటికి మన మీద అదనంగా భారం పడుతోంది. అందుచేత, అక్కడ నుండి వచ్చేవి తగ్గిపోతున్నాయి. ఓవరాల్‌గా క్యాలిక్యులేట్ చేస్తే, ఏదైతే 10 శాతం డెవల్యూషన్స్ పెంచామో దానికి, దీనికి సరిపోలడం లేదు. మనకు మొత్తం మీద పెద్దగా బెనిఫిట్ రాలేదు. మొన్ననే కేరళ ఫైనాన్స్ మినిస్టర్ గారు నాకు ఫోన్ చేశారు. క్రైటీరియా విషయంలో Finance Commission వాళ్లు mischievous గా

ప్లే చేస్తున్నారు. ఈ మాట అనకూడదు గానీ. ఆ కమిషన్ వారు కూడా ఈ క్రైటీరియా ఫిక్స్ చేసేటప్పుడు ఎప్పుడూ దక్షిణ భారతానికి నష్టం జరిగేదిగానే ఉంటోంది. అదేవిధంగా మొత్తం నార్త్ ఇండియాకు లాభం కలిగే విధంగా ఉంటుంది. అందుకనే, మన ముఖ్యమంత్రి గారు అనేకసార్లు లెటర్లు రాశారు. మేం వెళ్లి ఫైనాన్స్ కమిషన్ ముందు కూడా చెప్పాము. ఎందుచేతనంటే, మీకు క్రైటీరియా ఫిక్స్ చేసేటప్పుడు సౌత్ఇండియాలో కూడా పెర్ఫార్మింగ్ స్టేట్స్‌కి ఎక్కువ ఆర్థిక సాయం ఇవ్వండి అంటే కూడా నష్టం జరిగేటట్లే క్రైటీరియా ఉంటోంది. ఆవిధంగానే 14వ ఆర్థిక సంఘం క్రైటీరియా కూడా ఉంది. వాస్తవానికి 1971 జనాభా లెక్కల్ని తీసుకుంటే, దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాలకు కూడా లాభం జరుగుతుందని మేమంటే, ఈ రోజున వాళ్లు చేసిందేమంటే- అది తీసుకుంటూనే మళ్లీ 2011 పాపులేషన్ తీసుకుని, దానికి ఒక 10 పాయింట్స్ యాడ్ చేసారు. దాని గురించే కేరళ ఫైనాన్స్ మినిస్టర్ గారు నాతో మాట్లాడారు. 2011 పాపులేషన్ అడిషనల్‌గా తీసుకుని, 10 పాయింట్స్ క్రైటీరియా ఎప్పుడైతే తయారుచేశారో దానివల్ల దక్షిణాది రాష్ట్రాలకు భారీగా అలొకేషన్స్ తగ్గిపోయాయి. ఆ విధంగా ఈ రోజున సౌత్ఇండియాలో ఫైనాన్షియల్‌గా చాలా నష్టం జరిగింది. సౌత్ఇండియాలో రెవిన్యూ పరంగా కూడా చాలా నష్టం జరిగిందనేది మనకున్నటువంటి ఒక ఆలోచన అని ఈ సందర్భంగా గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

మ.01.50

ఆ విధంగా వారు టాక్టికల్‌గా చేస్తున్నారు. ఒకసారి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి డెవల్యూషన్స్ వివరాలను పరిశీలించవలసిన అవసరం ఉన్నది. ఈ సందర్భంగా బడ్జెట్ రిసీట్స్ 2018-19 పుస్తకంలో ఉన్నటువంటి వివరాలను సభముందు ఉంచుతాను. ఓవరాల్ టాక్స్ కలెక్షన్ అంటే ప్రత్యక్ష, పరోక్ష పన్నులు, జిఎస్‌టి అన్నీ కలిసిన తరువాత మొత్తం రిసీట్స్‌లో ఖర్చుపెట్టినటువంటి కాస్ట్ ఆఫ్ కలెక్షన్‌ను మైనస్ చేసుకుని మిగతాది ఏదైతే ఉందో అది నెట్ ప్రొసీడ్స్ అవుతుంది. అందులో రాష్ట్రాలకు మొత్తం 42 శాతం వస్తుంది. అవన్నీ లెక్కలకు వెళితే చాలా తేడా వస్తుంది. 14వ ఆర్థిక సంఘం ఇచ్చిన రిపోర్టు ప్రకారం 2018-19 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు ఆ 42 శాతంలో 4.30 శాతం వస్తుంది. అంటే సుమారు రూ.33,929.84 కోట్లు వస్తుంది. బీహార్ రాష్ట్రానికి 42 శాతంలో 9.665 శాతం అంటే సుమారు రూ. 76,172 పై చిలుకు వస్తుంది. కర్ణాటక రాష్ట్రానికి 4.713 వాటా అంటే రూ.37,145 కోట్లు వస్తుంది. దక్షిణాది రాష్ట్రాలలో కేరళకు తక్కువ వస్తుంది. అంటే 2.58 శాతానికి గాను రూ.19,703 కోట్లు వస్తున్నది. అందుకే ఆయన వర్రీ అవుతున్నారు. మధ్యప్రదేశ్‌కు చూస్తే 7.58 శాతానికి సుమారుగా రూ.59,400 వస్తున్నది. మహారాష్ట్రకు రూ.43,514 కోట్లు తమిళనాడుకు రూ.19,207, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి రూ.1,41,539.97 కోట్లు, పశ్చిమ బంగ రాష్ట్రానికి రూ.57,722 కోట్లు వస్తుండగా మనకు మాత్రం కేవలం రూ.33,929 కోట్లు వస్తున్నది. మనకు ఇన్ని సమస్యలున్నాయి. గతంలో 14వ ఆర్థిక సంఘం వచ్చినప్పుడు మేము ప్రతిపక్షంలో ఉన్నాము, అప్పుడు నేను ఆ సమావేశానికి హాజరయ్యాను. చాలా స్పెసిఫిక్‌గా చెప్పాము. ఆ తరువాత రాష్ట్ర విభజన జరిగింది. ఆ తరువాత వాళ్లు తిరుపతి వచ్చారు. మేము కూడా రమ్మని ఆహ్వానించాము. విభజన అనంతరం మనకు కూడా సమస్యలు

ఉన్నాయి కాబట్టి, అదనంగా 14వ ఆర్థిక సంఘం బెనిఫిట్స్ ఇవ్వాలని చెబితే తిరుపతి వచ్చి మా వెర్షన్ విన్నారు, వెళ్లిపోయారు. రిపోర్టులో మాత్రం ఏ విధమైన మార్పు రాలేదు. అందువల్లే మనం ఇబ్బంది పడుతున్నాము. ఉత్తరప్రదేశ్‌కు దాదాపు 1,41,000 కోట్ల పైచిలుకు వస్తుంటే మనకు సుమారు రూ.33,000 కోట్లు వస్తున్నాయి. అంటే వాళ్ల షేర్ 17.959శాతంగా ఉన్నది. ఈ క్రైటీరియాను చాలా దారుణంగా ఫిక్స్ చేస్తున్నారు. ఇందులోనే తేడా వస్తున్నది. ఎక్కువ పన్నులు దక్షిణాది రాష్ట్రాలనుండి కేంద్రానికి వెళుతున్నాయి. ప్రత్యక్ష, పరోక్షపన్నులు ఏవైనాగానీ దక్షిణాది రాష్ట్రాలనుండే కేంద్రానికి ఎక్కువగా వెళతాయి. కానీ, డిస్ట్రిబ్యూషన్ చేసేటప్పుడు మాత్రం దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ, ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ కేటాయింపులు చేస్తారు. 5 దక్షిణాది రాష్ట్రాలకు కలిపి రూ.1,41,691 కోట్లు వస్తే, కేవలం ఉత్తరప్రదేశ్‌కు రూ.1,41,539 కోట్లు వస్తున్నది. ఇది ఎంత దారుణం అధ్యక్షా. అంటే ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి వచ్చిన మొత్తం మన 5 రాష్ట్రాలకూ రాలేదన్నమాట. ఉత్తరప్రదేశ్‌కు ఎంతైతే వచ్చిందో అంతే అమౌంట్ దక్షిణాది రాష్ట్రాలకు ఇంచుమించుగా వచ్చింది. ఇదే విషయాన్ని మనం అడుగుతుంటే ఏ విధమైన స్పందనా ఉండడం లేదు. మళ్లీ అదే క్రైటీరియాను ఫిక్స్ చేస్తూ ఉంటారు. ఈవిధంగా డెవల్యూషన్‌లో కూడా దారుణమైన ఇబ్బంది వస్తుందనే విషయాన్ని గౌరవ సభ్యులకు తమ ద్వారా మనవిచేస్తున్నాను.

గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ విషయానికి వస్తే అది కేంద్రం యొక్క డిస్క్రిషనరీ పవర్ మీద ఆధారపడి ఉంటుంది. **Constitutional power** ఉన్నటువంటి **devolution** లోనే వారు ఇచ్చే క్రైటీరియాలో మనకు లాభం చేకూర్చడం లేదు. ఇక గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ గురించి చెప్పేదేముంది అధ్యక్షా. దక్షిణాది రాష్ట్రాలు నష్టపోయే విధంగా ఉంటున్నాయి. అసలు దక్షిణాది రాష్ట్రాలు కాదు, పెర్‌ఫార్మింగ్ స్టేట్స్ అన్నీ కూడా దాదాపు గత 15 సంవత్సరాల నుండి ఇదే పరిస్థితిలో ఉన్నాయి. మన రాష్ట్రం జిఎస్‌డిపి పెంచుకోవడం, మన రెవెన్యూలను ఎక్కువ ఇవ్వడం, ఎక్కువ టాక్సులను కట్టడం వంటి వాటి ద్వారా కేంద్రానికి మనం ఎక్కువ అమౌంట్ కడుతూ ఉంటాము. కేంద్ర జిడిపికి కూడా మనమే ఎక్కువ కంట్రిబ్యూట్ చేస్తూ ఉంటాము. మన రాష్ట్రం 4.5 జిఎస్‌డిపి శాతాన్ని కేంద్ర జిడిపికి కంట్రిబ్యూట్ చేయడం జరుగుతుంది. ఈ విధంగా మన నుండి వెళ్లేవన్నీ మనం జాగ్రత్తగా కంట్రిబ్యూట్ చేస్తున్నాము గానీ, అటునుండి మాత్రం మనకు తగ్గిస్తున్నారు. ఇవీ మన ఫైనాన్షియల్ ఫిస్కల్ రిలేషన్స్, ఫిస్కల్ ఫెడరలిజంలో జరిగే అన్యాయమని నేను గౌరవ సభ్యులకు చెప్పవలసిన అవసరమున్నది. అధ్యక్షా, పేరుకే ఈ ప్రభుత్వం కోఆపరేటివ్ ఫెడరలిజం. ఈ విషయంపై నేను అప్రాప్రియేషన్ బిల్లు సమయంలో మాట్లాడతాను అధ్యక్షా.

అధ్యక్షా, ఈ సందర్భంలో రాష్ట్రాలకు గల అధికారం గురించి కూడా మాట్లాడుకోవాలి. 11వ ఆర్థిక సంఘం సమయంలో **CSS (Centrally Sponsored Schemes)** ను అబాలిష్ చేయమని, అందుకు సమానమైన అమౌంట్‌ను ట్రాన్స్‌ఫర్ చేయమని వాళ్లు క్యాటగారికల్‌గా చెప్పారు. మళ్లా దానికి సమాధానం లేదు. అన్యాయమెలా జరిగిందనే దానిమీద మనం చాలా ఎస్టిమేట్ చేశాము. తెలంగాణా పర్‌కాపిటా ఇన్‌కం, మన పర్‌కాపిటా ఇన్‌కం తీసుకుంటే ఇంచుమించు రూ.34,000 లు తేడా కనిపిస్తున్నది. మనకు ఉండే జనాభా ఎక్కువ. మన జిఎస్‌డిపి /

జనాభా = పర్‌కాపిటా ఇన్‌కం ఉంటుంది కాబట్టి మనకు చాలా తక్కువ ఇన్‌కం కనిపిస్తుంది. 2017-18 సంవత్సరానికి మన పర్‌కాపిటా ఇన్‌కం రూ.1,42,000 అయితే దానిపై రూ.34,000 ఎక్కువ వేస్తే అది తెలంగాణా రాష్ట్రానికి వస్తుంది. ఎందుకంటే వాళ్లకు అర్బనైజేషన్ ఎక్కువ. హైదరాబాదుకు పర్‌కాపిటా ఇన్‌కం ఎక్కువ ఉంటుంది. సర్వీస్ సెక్టార్‌లో వాళ్లకు ఎక్కువ జిడిపి వస్తుంది. అందువల్ల వాళ్లకు ఇన్‌కం పెరుగుతున్నది. మహారాష్ట్రతో పోల్చుకుని చూసినా, కేరళతో పోల్చుకుని చూసినా, అలాగే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పోల్చి చూసినప్పుడు మన పర్‌క్యాపిటా ఇన్‌కం చాలా తక్కువగా ఉన్నది. ఫిస్కల్ గ్యాప్‌ను సెట్‌రైట్ చేయాలని అనుకున్నప్పుడు, వెల్ఫేర్ స్కీమ్స్‌కు ఎక్కువ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రతి కుటుంబానికి కనీసం రూ.10,000లు వచ్చేట్లు చూడాలి. తద్వారా వాళ్ల ఇన్వెస్టిమెంట్స్, సేవింగ్స్ ఉండాల్సిన అవసరం ఉన్నది.

సభ్యులు విటపు బాలసుబ్రహ్మణ్యం గారు మాట్లాడినప్పుడు విద్య, వైద్య రంగాలకు తక్కువ కేటాయింపులు చేశారని అన్నారు. అయితే మేము తక్కువ కేటాయించలేదు, ఎప్పటికంటే ఎక్కువే కేటాయించాము. కేంద్రప్రభుత్వం కేటాయించిన శాతానికి కంటే మనం కేటాయించిన శాతమే ఎక్కువ ఉంటుంది. 14వ ఆర్థిక సంఘం గానీ, అనేక ఆర్థిక సంఘాలు చెప్పినట్లు ఓవరాల్ జిడిపిలో యావరేజ్ 4 శాతం ఉండాలి. కానీ, కేంద్రం అది కేటాయించలేదు. మన జిఎస్‌డిపిలో ఇంచుమించు అంతే కేటాయించాము. ఆరోగ్య రంగం, అలాగే పాఠశాల విద్యలో మేం ఎక్కువ కేర్ తీసుకుంటున్నాము. అందుకు కారణమేమంటే, ఆ రంగాల్లోనే ఎక్కువ శాతం మంది ప్రైవేటు సంస్థలపై ఆధారపడుతున్నారు, ఖర్చులెక్కువ అవుతాయి. ముఖ్యంగా మధ్య, దిగువతరగతి వారికి ఎక్కువ భారం పడుతుంది కాబట్టి, ప్రభుత్వ సర్వీసులను ఎక్కువగా అందించినట్లైతే వారికి సేవింగ్స్ ఎక్కువ అవుతాయి. అలాగే, అనేక సంక్షేమ పథకాల ద్వారా కుటుంబానికి కనీసం రూ.10,000లు ఆదాయం వచ్చే విధంగా ఉంటే అందులో కొంత ఖర్చులకు పోనూ, కొంత మొత్తం సేవింగ్స్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. దానితోబాటు ఇన్వెస్టిమెంట్స్ చేసుకునేందుకు కూడా అవకాశం ఉంటుంది. ఆ విధంగా వాళ్లు కూడా ఇన్‌క్లూజివ్ గ్రోత్ రేటులో, ఓవరాల్ గ్రోత్ రేటులో పార్టిసిపేట్ చేయడానికి అవకాశం ఉంటుంది. Economic Activities లో పార్టిసిపేట్ చేయకపోయినట్లైతే చాలా ఇబ్బందవుతుంది. మన జనాభాలో 50 శాతం మంది మహిళలు ఉన్నారు. ఈమధ్య కాలంలో సర్వే చేసిన గణాంకాలను బట్టి చూస్తే, 20 నుండి 30 శాతం పేదరికం ఉన్నది. వీరంతా ఎకనామిక్ డెవలప్‌మెంట్‌లోకి రాకపోతే సమస్య వస్తుంది. వీరందరూ కూడా ఎకనామిక్ డెవలప్‌మెంట్‌లో పార్టిసిపేట్ చేయాలి. వారందరూ చిన్న చిన్న వ్యాపారాలు చేస్తే, ఆ ఇన్‌కం కూడా జిఎస్‌డిపిలోకి తీసుకురావడానికి అన్నివిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నాము. వ్యవసాయం రంగాన్ని మనం బాగా అభివృద్ధి చేసుకోగలిగాము కాబట్టే, గత మూడు సంవత్సరాల నుండి మనం సగటున రెండంకెల గ్రోత్ రేటును మెయింటైన్ చేయగలుగుతున్నాము. ఈ సంవత్సరం కూడా మనకు 11.33 శాతం గ్రోత్ రేటు ఉన్నది. అదే విధంగా వ్యవసాయానికి కూడా 25 శాతం గ్రోత్ రేటు ఉన్నది. పారిశ్రామిక రంగంలో కూడా దాదాపు లక్షల కోట్ల

రూపాయలు పెట్టుబడులు రావడానికి అవకాశం ఉంది. ఆ పెట్టుబడులు వచ్చిన తరువాత వాటితోబాటు ఉపాధి అవకాశాలు కూడా వస్తాయి. ఇప్పటికే దాదాపు 2,3 లక్షలమందికి ఉద్యోగావకాశాలు కల్పించాము.

మ.02.00

అధ్యక్షా, ఇదికాకుండా నిరుద్యోగులకోసం రూ.1000 కోట్లు కేటాయించడం జరిగింది. అదేవిధంగా, యువత నిర్వీర్యం కాకుండా 100 శాతం నిరుద్యోగమనేది లేకుండా మనం వెళ్ళాలనే ఉద్దేశంతోనే రూ.1000 కోట్లు పెట్టాము. అవసరమైతే రూ.1000 కోట్ల కంటే కూడా ఎక్కువ ఈ ప్రభుత్వం ఖర్చుపెడుతుందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. అదేవిధంగా, మాకు రిసోర్సెస్ ఉన్నప్పుడు కూడా ఈ విధంగానే ఖర్చుపెట్టి కార్యక్రమాలు చేస్తున్నాం.

అధ్యక్షా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలికసదుపాయాల విషయానికి వస్తే, ఇంచుమించు అన్ని గ్రామాలకు అవసరమైన సిమెంటు రహదార్లు వేశాము. అదేవిధంగా నీటి పథకాలు, డ్రైనేజి పథకాలు పెడుతున్నాం. ప్రస్తుతం గ్రామాలమధ్య అనుసంధానం లేదు కాబట్టి వీటికి సంబంధించి రూ.22,000 కోట్ల వరకూ అనుమతి ఇచ్చాం. అలాగే, ఆర్ అండ్ బి రహదార్లు కూడా చాలావరకూ చేశాము. గత పది సంవత్సరాలలో వై.ఎస్.ఆర్ పరిపాలనలో రహదార్లు అధ్వాన్న పరిస్థితికి వస్తే ఈ రోజు బ్రహ్మాండంగా మనకు ఏ నడుమునొప్పి లేకుండా రహదార్లలో వెళ్ళే పరిస్థితికి తీసుకువచ్చాము.

అధ్యక్షా, సంక్షేమ పథకాలతోపాటు మౌలికసదుపాయాలు, కోరోనెట్ డెవలప్‌మెంట్, పారిశ్రామికాభివృద్ధి వంటివి చేసినట్లయితే మనకు సేవలరంగం బాగా పెరుగుతుంది. అయితే, పారిశ్రామికీకరణలో కేంద్రప్రభుత్వంకంటే మనం బాగానే ఉన్నా, సేవారంగంలో కొద్దిగా వెనుకబడి ఉన్నాము. ఎందుచేతనంటే మనకు పట్టణీకరణ తక్కువగా ఉంది. మన పట్టణీకరణ 29శాతం ఉండగా, అభివృద్ధి చెందిన మహారాష్ట్రలాంటి రాష్ట్రాలలో 50% కంటే ఎక్కువగా పట్టణీకరణ ఉంది. ఎక్కడైతే పట్టణీకరణ ఉందో అక్కడ సేవారంగం బాగా పెరుగుతుంది. సేవారంగం బాగా పెరిగితే స్థిరమైన ఆర్థిక వ్యవస్థ **(sustainable economy)** బాగా పెరుగుతుంది. మనకున్న నీటి వనరులను, ఇతర వనరులను ఉపయోగించుకుని ఈనాడు రాయలసీమలోను, విఫలమవుతుందనుకున్న కృష్ణా డెల్టాలోనూ అధిక పంటలు పండించారు. దీనితో బ్రహ్మాండమైన దిగుబడి వచ్చింది. గతంలో ఒక హెక్టార్ వరిపంటకు 3,000 కిలోలకంటే ఎక్కువ దిగుబడి దాటలేదు. కానీ ఈ సంవత్సరం 2017-18 సంవత్సరంలో దాదాపు 6,000 కిలోల పైన దిగుబడి వచ్చిందంటే అది ఈ ప్రభుత్వం వ్యవసాయం మీద చేసిన కృషి అని ఈ సందర్భంగా మీకు మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, మన రాష్ట్రాన్ని కరవురహితంగా చేయడానికి నదుల అనుసంధానం పథకాన్ని ప్రవేశపెట్టాం. దీనివల్ల ఈ సంవత్సరం వ్యవసాయ రంగంలో దాదాపు 159 లక్షల టన్నుల ఉత్పత్తిని మనం సాధించగలిగాం. అదేవిధంగా పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులను చేశాము. పోలవరం చేస్తున్నాము. పోలవరం ప్రాజెక్టు గురించి అనేకమంది అనేక విధాలుగా ఈరోజు మాట్లాడుతున్నారు. అయినప్పటికీ, ఈ ప్రభుత్వం ధ్యేయం ఒక్కటే. ఎట్టి పరిస్థితుల్లోనూ

2019 సంవత్సరంలో పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తామని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. వ్యవసాయ రంగానికి ప్రథమ ప్రాధాన్యతను ఇచ్చాం. అలాగే నీటిపారుదల రంగానికి కూడా ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వడం వల్లే నదుల అనుసంధానం చేయడం జరిగింది. 2017-18 లో నీటిపారుదల రంగానికి బడ్జెట్‌లో పెట్టినదానికంటే సుమారు రూ.3000 కోట్లు అదనంగా ఖర్చుపెట్టాం. అందుచేత ప్రభుత్వం అప్పుచేసినా, సొంత వనరులున్నా సరే ఎక్కడ ప్రాధాన్యత ఉందో అక్కడ ముఖ్యమంత్రిగారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని దృష్టిసారించి ఆ పథకాలన్నీ చేయడం వల్ల ఈనాడు ఫలితాలు వచ్చాయి. అందుకే మన వృద్ధిరేటు కూడా మొత్తం రెండంకెల స్థాయిలో స్థిరంగా ఉంటోంది. భవిష్యత్తులో కూడా ఇది 12శాతం నుంచి 15శాతానికి పెరగాలనేది ప్రభుత్వం ఆశయం. ఆ దిశలో పనిచేస్తున్నాం. అదేవిధంగా మేము ఇచ్చినటువంటి విజన్ ఏదైతే ఉందో, ఆ విజన్ ప్రకారం భవిష్యత్తులో సమస్యలు లేని, అసమానతలులేని, పేదరికం లేని సంతోషమైన సమాజం ఉండాలనీ, అదేవిధంగా రాష్ట్రంలో కరవులేకుండా ఉండాలనేది ప్రభుత్వం ఆలోచన, పార్టీ ఆలోచన. అదే మా మేనిఫెస్టో. అదే ముఖ్యమంత్రిగారి విజన్. Thank you very much sir.

(గౌరవ సభ్యుల హర్షధ్వానాలు)

**MR CHAIRMAN:** Short discussion on 'Welfare' will continue tomorrow. Now, the House is adjourned to meet again tomorrow at 10.00 a.m.

(The House then adjourned at 02.04 p.m. to meet again at 10.00 a.m. on Wednesday, the 21st March 2018)

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Council and printed at the AP Legislative Assembly Press, Velagapudi, Amaravati.**